- అగ్నిధారయై కురిసిన దాశరథి కవిత్వం
- భూమయ్య పరిశోధన – విమర్శ
- తెలంగాణ కథ – సమకాలీనత
- మానస సరోవరంలో స్వర్ణహంస - ప్రతీకాత్మక కావ్య విశిష్టత
- రామాయణం – సామాజిక నీతి
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు–7
- ప్రత్యేక తెలంగాణ సాధన - మహబూబ్‌నగర్ జిల్లా కవుల పాత్ర
- తెలంగాణ గిరిజన ఉద్యమాల్లో మహిళలు


# మూసీ

# MUSI



◆ Samputi : 27 ◆ Sanchika : 09 ◆ Pages : 64 ◆ Rs. 20

◆ July 2024

UGC CARE List
Approved Journal







వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి


# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 9
జులై - 2024
'క్రోధి' ఆషాఢ మాసం

ISSN 2457-0796

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992


## ఈ సంచికలో ...

### వ్యాసాలు


అగ్నిధారయై కురిసిన దాశరథి కవిత్వం ... ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ 7
భూమయ్య పరిశోధన - విమర్శ ... ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు 11
తెలంగాణ కథ - సమకాలీనత ... డా. ఎన్. రజని 17
మానస సరోవరంలో స్వర్ణహంస-ప్రతీకాత్మక కావ్య విశిష్టత...ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ 23
రామాయణం - సామాజిక నీతి ... డా. చిన్నం రాజారాం 27
మహాభారతం:'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-7 ... డా. అట్టెం దత్తయ్య 33
ప్రత్యేక తెలంగాణ సాధన - మహబూబ్ నగర్ జిల్లా కవుల పాత్ర ... పనిగిల్ల మల్లికార్జున్ 37
తెలంగాణ గిరిజన ఉద్యమాల్లో మహిళలు ... గుగులోతు పూల్ సింగ్ 42
తెలుగు సాహిత్యంలో లక్ష్మీస్తుతులు ... ఆర్. ధనలక్ష్మి 47
కొండవీటి సత్యవతి రచనలు - ప్రేమ ... ఆవుల రేణుక 51
ఆచార్య ఎస్వీ జోగారావు గారి వినూత్న సృష్టి - 'అడిగొప్పుల హెూరుగాలి' ... ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న 54


### సమీక్షలు


'కన్యాశుల్కం' రచనా నేపథ్యం - సరికొత్త చూపు ... ఘట్టమరాజు 58
స్వీకృతి ... 61


### కవితలు


పక్షుల వైవిధ్యాలు - డా. గన్నోజు శ్రీనివాసాచార్య - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; సాహిత్య తపస్వి - డా. తిరునగరి శ్రీనివాసాచార్య - 16; తండ్రిగారు ఎంతో ధన్యజీవి ... పసుపులేటి నరసింహారావు - 32; సగం మనిషి - గొర్రె సురేష్ బాబు - 57; గుడ్డ పేలికలు ... జానీ తక్కెడశిల - 60;





ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.



*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9  హైదరాబాద్ జూలై : 2024

## సంపాదకీయం






వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# వ్యక్తం

ప్రకటమైనవాడు, ప్రకటమైనది అనే అర్థంలో వ్యక్త శబ్దాన్ని ఉపయోగిస్తున్నాం. వ్యక్తమైనవారే వ్యక్తులు. వ్యక్తికి ఉండే ధర్మమే వ్యక్తిత్వం. వ్యక్తం కాని సూక్ష్మాతి సూక్ష్మమైన అణురూపమైనవాడే అవ్యక్తుడు. పదార్థానికి వ్యక్తమయ్యే ధర్మం ఉంటుంది. యథార్థానికి ఉండదు. మూలమైన శక్తి స్పందనలే ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి మొదలైన పంచభూతాలు. ఇవన్నీ క్రమంగా వేరు వేరు విధాలుగా వ్యక్తమవుతూ వచ్చి పదార్థాలను ఏర్పరచాయి. పదార్థం మళ్ళీ సూక్ష్మీకృతమై మూలశక్తిగా మారి చైతన్యరూపమవుతుంది. పదార్థం ఏర్పడడం ఎంత కష్టమో, ఏర్పడిన పదార్థం మళ్ళీ మూలంగా మారడం అంతే కష్టం. మట్టి, కుండగా మారడం ఎంత కష్టమో, కుండ మళ్ళీ మట్టిగా మారడం కూడా అంతే కష్టం. మనకు కలిగిన జ్ఞానాన్ని అనుసరించి మొదటి దానికన్నా రెండవది కొంత సులువు అవుతూ ఉంటుంది.

వస్తువులన్నీ వ్యక్తమైనవే. విధానాలన్నీ వ్యక్తమైనవే. కనిపించేటట్లు, వినిపించేటట్లు, అనిపించే టట్లు ఎన్నో రూపాల్లో వ్యక్త విధానాలుంటాయి. ఈ విధానం వెనుక చైతన్యం ఉంటుంది. వ్యక్తమైన అన్నింటిలోనూ మనకు అర్థంకాని చైతన్య స్వరూపం ఉండితీరుతుంది. ఆ యా వస్తు, వ్యవహారాలు అందుకే మనకు ఉపకరిస్తాయి. చైతన్య రహితమైన పదార్థం ఏదీ మనకు ఉపకరించదు. అందుకే అవ్యక్తం మూలంగా ఉంటుంది. వ్యక్తం ప్రదర్శితమవుతుంది.

భాషలో మన భావాలను వ్యక్తీకరిస్తాం. సాహిత్య, నాటక వ్యవహారాల్లో స్పష్టంగా తెలియజేసిన విషయాలను 'అభివ్యక్తి' అంటాం. వ్యక్తమైన పదార్థ వినియోగం ఎంతో, వ్యక్తం అయ్యే భాష, భావం వల్ల కూడా అంతే వినియోగం. పదార్థం, భాష, భావాల్లో లోపాలున్నా, గుణాలున్నా మూలం మాత్రం అవ్యక్తమే అవుతుంది. వ్యక్తమైన వస్తువు లోకంలో కనిపించినంత కాలం దాని గొప్పతనం చూపించుకునే ప్రయత్నం జరుగుతూనే ఉంటుంది. భావం, భాష ద్వారా వ్యక్తమైన వారు సమాజంలో తమ గొప్ప చూపించుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. అయితే వ్యక్తమైనది ఏదీ శాశ్వతంగా నిలిచిపోయే అవకాశం లేదు. ఎప్పటికైనా అది నశించి తీరాల్సిందే. అది మరో రూపాన్ని పొందవచ్చు. అదే రూపంలో మార్పును పొందవచ్చు. దాని స్థితిని మార్చుకోవచ్చు. కాని వ్యక్తమైన విషయంలో మార్పులు సంభవం అవుతూనే ఉంటాయి.

వ్యక్తం కాకుండా మూలచైతన్యం వైపు మళ్ళీ వెళ్ళి అవ్యక్తులం కావాలంటే తగిన జ్ఞానం కావాలి. విషయ, వ్యవహార జ్ఞానాదుల ద్వారా వ్యక్తి క్రమంగా తనను తాను వ్యక్తీకరించుకునే స్థితి నుండి దూరం జరగాలి. వ్యక్తం కావడంలో మొట్టమొదటి వ్యవహారం స్పందన. అణుస్పందన. ఈ స్పందనలు ఎంత ఎక్కువగా ఉంటే అంతగా వ్యక్తమైన పదార్థం మారుతూ ఉంటుంది. రూపం మారుతున్నా కొద్దీ ఇబ్బందులు పెరుగుతూనే ఉంటాయి.

తాము వ్యక్తమైనది అధికమై ఈ ప్రపంచానికి అల్పంగా కనిపించడం కన్నా, తాము తక్కువ వ్యక్తమై ఎక్కువ వ్యాపించడమే సార్థక లోకజీవనం అవుతుంది. పదార్థానికి స్వయం ప్రకాశ శక్తి లేదు. కొద్ది ప్రదేశంలోనే విస్తరిస్తుంది. ఒక దీపం తాను ఉన్న రూపం కన్నా ఎక్కువ ప్రదేశాల్లో విస్తరిస్తుంది. ఈ దీపంలోనూ ఒక చైతన్యం ఉంటుంది. దానిపేరే అవ్యక్తం. ఆ అవ్యక్త వ్యవహారాలు అర్థం చేసుకోవడం మొదలు పెట్టి స్పందనలు, ఆసక్తులు, అనవసర విషయాలతో సంగమాలు క్రమంగా తగ్గిస్తే వ్యక్తి చైతన్య మూర్తిగా మారుతూ క్రమంగా అవ్యక్తుడు, ఆనంద ప్రదుడౌతాడు.

# పక్షుల వైవిధ్యాలు







పక్షిజాతి చూడు పరభేదమెరుగవు
కలసి మెలసి వుండు కాన లోన
తరువు పైన వాలి తమగూడు నిర్మించి
కాపురంబు జేయు కలత లేక!

కాకిజాతిజూచి కసురుమానవులిల
పాడు శకునమేను పాపమనియు
ఇంటిలోపలకును యిలను వచ్చినయెడ
ఇల్లు వదలి వెళ్ళు యింటి వారు!

మావిచివురు తిన్న మత్తెక్కి కోకిల
రాగమాలపించు రక్తిమీర
"ఆమన"న్న చాలు హాయిని పెంచును
ఋతువు పక్షి గాను రూఢికెక్కె!

చిలుకపలుకుచూడ చిన్మయానందము
రామరామ యనును రామ చిలుక
జ్యోస్యగాని పాలి జోడిగా జీవికై
బ్రతుకింత తాను మెతుకు లిచ్చు!

నెమలినాట్యరీతి నెమ్మదిగను చూడ
కాంచువారి కెపుడు కనులవిందు
మనసుదోచుపురి మధురభావనలిచ్చు
రంగుపక్షిజాతి రంజితంబు!

చెట్టుపైన వాలి చిన్నగూటిలోచేరి
తల్లి పిల్లలన్ని తనివి తీర
ఎండవాన యనక యెదిరించి బ్రతుకుచు
శీతకాలమన్న చెదరవెపుడు!

అడవిలోనగలవు అపురూపపక్షులు
చూడతరముకాదు చూపరులకు
అన్ని పక్షుల జూడ నలవి కాదుమనకు
సరిగ చూడ మనము సంతసంబు!

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్ నగర్, ఫోన్ : 8555 899 493

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9  హైదరాబాద్ జూలై : 2024

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

అలమటింతువేలరా జీవా
నిరాశల నలుముకుందువేలరా
సుఖము వెనక దుఃఖము నీడ
చక్రము తిరుగు వోలె జీవన క్రీడ

నమ్ము ఆత్మ బంధువు అతడు
ఈ జగానికాధారము అతడు
అతడి ఇంట చీకటి లేదు
వెలుగు రేఖ కద్దము రాదు

చింతచేయుమోయి నరుడా
కలత వీడుమోయి సఖుడా
నామమంత్రముంచి ముఖమున
తాల ధ్వనుల సందడి చేయు

తుకా భ్రమర గీతమయ్యెను
విఠల పద్మ పదము గ్రోలెను
అసత్తు కాదు సత్యము జీవా
అనుభవాల అసలు పొందుమా




అనువాదం :
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

# అగ్నిధారయై కురిసిన దాశరథి కవిత్వం

**ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ,** పూర్వ ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9440447737

**(మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా..)**

**'ఊళ్లకూళ్లు అగ్గిపెట్టి - ఇళ్ళన్నీ కొల్లగొట్టి**
**తల్లి పిల్ల కడుపుగొట్టి - నిక్కిన దుర్మార్గమంత**
**నీ బాధ్యత నీ బాధ్యత'** అంటూ సూటిగా ప్రకటించడంతో పాటు...

**'వద్దంటే గద్దె ఎక్కి- పెద్దరికం చేస్తావా?**
**నీకు నిలుచు హక్కు లేదు- నీకింకా దిక్కులేదు**
**దిగిపొమ్మని జగత్తంత - నగారాలు కొడుతున్నది**
**దిగిపోవోయ్ తెగిపోవోయ్ - తెగిపోవోయ్ దిగిపోవోయ్'** అంటూ దాశరథి కృష్ణమాచార్య 'అగ్నిధారలు' కురిపించాడు. 'రుద్రవీణలు' పలికించాడు.

అటు బ్రిటీషాంధ్ర ప్రాంతంలో గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన ప్రజాగ్రహ గీతం 'మాకొద్దీ తెల్లదొరతనము' ఎంతగా ప్రజలను ప్రభావితం చేసిందో, ఇటు నిజామాంధ్ర ప్రాంతంలో దాశరథి గీతాలు అంతగా ప్రకంపనలు సృష్టించాయి. ఫలితంగా అటు ఆ జాతీయోద్యమ కవికీ, ఇటు ఈ ప్రజోద్యమ కవికీ కారాగారం తప్పలేదు. దుర్భరమైన జైలు జీవితం. రాసుకోవడానికి కలమూ, కాగితమూ లేని దుస్థితి. అప్పుడీ కవి పద్య ప్రక్రియను ఆశ్రయించాల్సి వచ్చింది. జైలుగోడల మధ్య అల్లుకున్న పద్యాలు, అక్కడ బొగ్గుతో రాయడంతో పాటు మనస్సులో మననం చేసుకుంటూ పదిలపరుచుకునేవాడు. మాత్రాఛందస్సు, లయబద్ధత ఉన్నందున తన పద్యాలన్నీ తనకు గుర్తుండిపోయేవి. **'కవిత్వం గుర్తు పెట్టుకోదగిన కళారూపం'** అని విశ్వసించాడు. జైల్లో అనేక పద్యాలు అల్లుకుని, ఆ తరువాత చాలా కాలానికి నెమరు వేసుకుని కాగితంపై పెట్టాడు. అలా రూపొందినవే **'అగ్నిధార', 'రుద్రవీణ'** కవితా సంపుటులు.

**'పోరాటం నుండి కళ పుడుతుందని'** దాశరథి విశ్వాసం, ఆయన జీవితమంతా పోరాటమే. ఎన్నో ప్రతీపశక్తులతో పోరాడాడు. ప్రతిబంధకాలెదురైనప్పుడు ఏనాడూ నిరాశ చెందలేదు. నమ్రతతో తన దారిన తను పయనించాడు. అతని గమ్యం ప్రపంచశాంతి, అతని ధ్యేయం ప్రజాస్వామ్య సామ్యవాదం.

**'జనం మనం- మనం జనం**
**జనం లేక మనం లేము'** అన్న స్పష్టత ఉన్నవాడు. అందుకే...

**'రానున్నది ఏది నిజం?**
**అది ఒకటే సోషలిజం**



**కలపండోయ్ భుజం భుజం**
**కదలండోయ్ గజం గజం'** అంటూ ఉద్యమాహ్వానం పలికాడు.

ఖమ్మం జైలు జీవితకాలంలో దాశరథి ప్రేమాభిమానాలు పొందిన మహా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి. జైలుగోడల మీద దాశరథి బొగ్గుతో రాసే పద్యాలను ఇతను కంఠస్థం చేసేవాడు. పదే పదే చదువుతూ పదిమందికీ వినిపించేవాడు. జైలు అధికార్లు ఆ పద్యాలను గోడలమీద చెరిపేసినప్పుడల్లా, అవి మరో గోడమీద ప్రత్యక్షమయ్యేవి. వాటిని దాశరథి రాస్తున్నాడని జైలు పోలీసుల అనుమానం. నిజానికి రాస్తున్నవాడు ఆళ్వార్‌స్వామి అని వాళ్ళు కనిపెట్టారు. ఫలితంగా అతడ్ని గుల్బర్గా జైలుకూ, దాశరథిని హైదరాబాద్‌లోని చెంచల్‌గూడా జైలుకూ మార్చారు.

**'ఇది నిదాఘము; ఇందు సహింపరాని**
**వేడి యేడ్పించుచున్నది, పాడుపడిన**
**గోడలందున జైలులో పాడినాడ**
**వాడిపోనున్న పూమొగ్గ పైన పాట'** అంటూ జైల్లో పద్యాలు అల్లుకున్నాడు.


**జైలు గీతం :**

**'ఆయాసపడు జైలులో ఎన్ని ప్రజల రా**
**జ్యములున్నవో! యని యరసినాను**
**నిరుపేదవాని నెత్తురు చుక్కలోనెన్ని**
**విప్లవాలో! యని వెదకినాను**

ISSN 2457-0796

UGC CARE List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 (8) హైదరాబాద్ జులై : 2024




నీళ్ళలో నిప్పు మాదిరి, నిప్పులోన
నీళ్ళ మాదిరి, కష్టాల నీడలందు
సుఖము నివసించునంట! ఉస్సురను వేడి
ఊర్పులలోన పరిమళాలున్నవంట!
ఇట వసంతము లేదు, సహింపరాని
గ్రీష్మ హేమంతకాల కాళికలె గాని;
ఇట ఉషస్సులు లేవు, భరింపరాని
అంబువాహ సందోహ నిశాళి కాని
వెన్నెలలు లేవు, పున్నమ కన్నె లేదు
పైడి వన్నెల నెలవంక జాడలేదు
చుక్కలే లేవు, ఆకాశ శోకవీధి
ధూమ ధామమ్ము, దుఃఖ సంగ్రామ భూమి
కాల దైవజ్ఞుడీ జగత్కన్య హస్త
తలము దర్శించి జ్యోతిషమ్ములు వచించు
పరుల హింసించువారలు బాగుపడెదు
మాట వట్టిది, నశియించు మాట నిజము'

అంటూ నిజాం ప్రభుత్వాన్ని శపించాడు. ప్రజలను హింసించే ప్రభువులు నశిస్తారని ప్రకటించాడు. **'ఇందుపుర దుర్గము'** శీర్షికన నిజామాబాద్ సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు, ఆ జైలు ప్రాచీనతనూ, ప్రాశస్త్యాన్నీ వర్ణిస్తూ చక్కని కవిత రాశాడు.

"ఇది చారిత్రాత్మకంబయిన
ఏ మహితాలయమో! ఇదే మహా
కదనము కోసమై మలచి
కట్టిన దుర్గమొ!"

అంటూ మొఘల్ రాజులను ఎదిరించిన మరాఠా వీరులు కట్టించిన కోట ప్రశస్తిని దాశరథి వర్ణించాడు.

**స్మృతి కవిత**

1948 జనవరి 30వ తేదీనాడు నాథూరాం గాడ్సే కాల్చిన తుపాకి గుళ్ళకు నేలకొరిగిన గాంధీజీ మరణవార్తను నిజామాబాద్ జైలులో వున్న దాశరథి విన్నాడు. చలించిపోయాడు. **'క్షమామూర్తి'** శీర్షికన ఉద్వేగభరితమైన స్మృతి కవితను రచించాడు.

'హిమగిరి శిఖాముఖాన వెలిగించినావు
దివ్య దీపాంకురము; దేశదేశములకు
యుగయుగమ్ముల చీకటులుడిగిపోవ
గుండెలో నుండి నెత్తురుల్ పిండిపోసి,
నలుబది కోట్ల భారత జ
నమ్ముల వందల ఏండ్ల బంధన
మ్ములు సడలించినావు, జయ
ముల్ గొనినావు, త్రివర్ణ కాంతులన్
తళతళలాడు భారత ప
తాకము నాకము తాకునంత యె
త్తుల కెగయించినావు; పగ
తుర్ కొనియాడగ పెంచినాడవున్'

అంటూ తన సమ్మోహన శక్తితో, నిర్మాణ కార్యక్రమాలతో మేధావుల ఉద్యమాన్ని విస్తృత ప్రజోద్యమంగా మలచిన గాంధీజీ ప్రతిభను ప్రశంసించిన దాశరథి, కవితాంతంలో...

'చేతులారగ నీవు పెంచిన స్వతంత్ర
నాగవల్లికే విషనాగమయ్యె,
నీ గళము చుట్టి ప్రాణాలు లాగివేసె
భారతీయుల గౌరవ ప్రతిభ మాసె' అని నిట్టూర్పు విడిచాడు. నివాళులర్పించాడు.

'జండా ఒక్కటే మూడు వన్నెలది;
దేశంబొక్కటె భారతాఖండా సేతు హిమాచలోర్వర;
కవీట్కాండమ్మలోనన్ రవీంద్రుండొక్కడె కవీంద్రుడు
ఊర్జిత జగద్యుద్ధాలలో శాంతి కోదండోద్యద్విజయుండు
గాంధి ఒకడే, తల్లీ! మహాభారతీ!' అంటూ పొంగిన గుండె నిండా పద్యాలతో భారతమాతను ఆరాధించాడు. రవీంద్రుని కవితాశక్తిని, గాంధీజీ శాంతి ఉద్యమాన్ని కీర్తించాడు.

**శిల్పి ప్రశంస**

'చాగిలదీసి రాళ్లనొక
జాలుగ, వాగుగ, తోగులాగునన్
లాగెదవెట్టులన్న నటు
లన్, ప్రియురాలి పయంటలో అజం
తా గుహలోని స్వప్నములు
తాపిన నీ ఉలి ముక్కులోపలన్

దాగుడుమూతలాడె కవి
తా లతాంగి రమో విహరముల్'

అంటూ కరకు శిలలను సైతం కరగించి అందమైన శిల్పాలుగా మలిచే 'శిల్పి' నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ దాశరథి చక్కని పద్యాన్ని రాశాడు.

'నీ ఉలి చూచి ప్రస్తరము
నీరయి పారును; వెన్నముద్దపై
------------------
భూషణ! శైల శిల ప్రపేషణా!'–

అంటూ ప్రతి వికారశిలను సుందరశిల్పంగా రూపొందించే శిల్పి ప్రతిభకు చేయెత్తి నమస్కరిస్తున్నాడీ కవి.

**శ్రామిక జనచైతన్యం**

భూస్వామ్య సమాజంలోనూ, పెట్టుబడిదారీ సమాజంలోనూ దోపిడీకి, అణచివేతకూ గురయ్యే శ్రామిక జనం పట్ల అభిమానం కల ప్రగతిశీల కవి దాశరథి. అందుకే....

'తరతరాల దరిద్రాల
బరువులతో కరువులతో
క్రుంగి క్రుంగి
--------------
మేల్కొన్నది – మేల్కొన్నది'– అంటూ మేల్కొంటున్న శ్రామికజన చైతన్యానికి స్వాగతం పలికాడు. అంతే కాదు...


'అనాదిగా సాగుతోంది– అనంత సంగ్రామం
అనాథుడికీ, ఆగర్భశ్రీనాథుడికీ మధ్య'–


అన్న వర్గస్పృహను దాశరథి ప్రకటించాడు. ఈ అనంత సంగ్రామానికి గల కారణాలను విశ్లేషిస్తూ...

'సేద్యం చేసే రైతుకు– భూమి లేదు, పుట్ర లేదు
రైతుల రక్తం త్రాగే – జమీందార్ల కెస్టేట్లు
మిల్లు నడిపి, కోట్ల డబ్బు – కొల్లగ లాభం తెచ్చే
కూలోనిదికాదు మిల్లు – మిల్ మ్యాగ్నేటొక సేటు
కర్షకులు, కార్మికులు – మథనపడే మేధావులు
తమ శ్రమలకు తగిన ఫలం – ఇమ్మంటే తిరుగుబాటు'– అంటూ అసమసమాజ స్వరూపాన్ని దాశరథి ఆవిష్కరించాడు.

**సమసమాజ నిర్మాణ ఆకాంక్ష**

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించగానే దేశ పరిస్థితులన్నీ మారిపోతాయని దాశరథి భ్రమపడలేదు. నిజాం నవాబు లొంగిపోగానే, హైదరాబాద్ సంస్థానం విముక్తమై, ఇండియన్ యూనియన్‌లో విలీనం కాగానే ఇక్కడి ప్రజల జీవన స్థితిగతులన్నీ




అనూహ్యంగా మార్పు చెందుతాయని అతడు భావించలేదు.

'ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ
ఒక్క మాటు చూచిందిటు
తమస్సు పాషాణ కిరీటం తీస్తూ
ఒక్క పరుగు తీసిందటు'

'ఉషస్సంధ్య' గేయంలో అటు రాజులు, రాజరికాలు, చట్టాలు, శాసనాలు, జైళ్ళు, ఆకలి, ఆరాటం, వేదన, సంపాదన, క్రౌర్యం, కౌటిల్యం, కసి, మారణాయుధాలు, మంటలు మసి, సిండికేట్లు, సేట్లు నిండిన వ్యవస్థను తమస్సుతో పోల్చాడు దాశరథి.

ఇటు జలపాతానికి నాంది; కుళ్ళిన సమాజపు దుర్గంధాన్ని తరిమికొట్టే ప్రజాగ్రహ ప్రవాహం, శతాబ్దాలుగా గొంతుదాటి పలకని శబ్దాల హెూరు, సమీపిస్తున్న ప్రజాగళ గర్జనలను ఉషస్సుతో ఉపమించాడు కవి.

'ఎత్తండి కాంతి పతాకాలు
ఒత్తండి శాంతి బాకాలు
పదండి అగామి పథమ్ముల
పాడండి అందాల పదమ్ముల'..

ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ దూసుకువస్తున్న సమసమాజ నిర్మాణాన్ని దాశరథి ఆకాంక్షించాడు.

'ఉదయాకాశ పతాకం– యెదలో కదలాడె నేడు
హృదయావేశ తటాకం – నదిలా పొరలాడె నేడు
రానున్నది ఏది నిజం– అది ఒకటే సోషలిజం'


అని కచ్చితంగానే ప్రకటించాడు. ఒక మనిషిని వేరొక మనిషి ఒక జాతిని వేరొక జాతి పీడించడానికి అవకాశం లేని ఒక ఉదాత్త సమాజం ఆవిర్భవిస్తుందని ఆశించాడు. చల్లని సముద్రగర్భంలోని బడబాగ్నులనూ, నల్లని ఆకాశంలోని సూర్యులనూ చూడగలిగాడు. ఉదయించనున్న సుందరమైన లోకాన్ని కలకన్నాడు.

ISSN 2457-0796

UGC CARE List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9  హైదరాబాద్ జూలై : 2024



**దాశరథి కవిత్వంలో భావుకత**

జైలుశిక్ష పడేనాటికి దాశరథి వయస్సు ఇరవై ఏళ్ళు. నూనూగు మీసాల నూత్న యవ్వనం. ఆకాశంలోకి తలెత్తి చూస్తే, మేఘాలు అందమైన ఆడపిల్లల ఆకారాలు ధరించి, పొంగిన వక్షస్థలాలతో ఇతణ్ణి కవ్వించడానికి వస్తున్నట్లనిపించేది. తలదించి బ్యారక్ వైపు చూస్తే, తళతళా మెరుస్తున్న నగ్న ఖడ్గంతో తుపాకీ చేత బూని కవాతు చేసే భటుడు కనిపించేవాడు. వాణ్ణి నరికేసి, లేదా వానిచే నరకబడి మేఘభామిని వైపు పరుగెత్తాలనీ కలలు కనేవాడు. ఇదీ దాశరథి భావుకత.

మానుకోట తాలూకాలోని నెల్లికుదురు గ్రామంలో పోలీస్‌స్టేషన్ నుండి దాశరథి తప్పించుకుని, అడవిలో పడి పరుగు లంఘించినప్పుడు, గుర్రాలమీద నలభైమంది సైనికులు అతన్ని వెంటాడసాగారు. క్షణం ఆగకుండా అతడు అరణ్యంలో పరుగెత్తుతుంటే, దూరాన పది గుడిసెల చిన్న పల్లె తటస్థించింది. అక్కడ కాస్సేపు ఆగి, మంచి నీళ్లడిగితే, ఆప్యాయంగా ముంత నీళ్ళందించిన రైతు పిల్ల ఒయ్యారం, ఆమె కళ్ళలోని అమాయకత్వం ఈ కవిని మైమరిపించాయి. ఇలాంటి అనుభూతులన్నీ దాశరథి కవిత్వంలో అంతర్లయగా ప్రతిధ్వనిస్తూ ఉంటాయి.

జైలు కిటికీలోంచి చూస్తే, బయట మామిడికొమ్మ చిగిరిస్తే, పూలు పూస్తే, లక్ష ఉగాదులు ఒక్కసారి ఇతని హృదయంలో దూకినట్లుండేవి.

**'ఏ పొలమున నిరుపేదకు – దొరకదో తిండి**
**ఆ పొలమున గల పంటను – నిర్దయగా తగులబెట్టండి' –**


అని జాతీయ విప్లవకవి ఇక్బాల్ రాసిన పద్య పంక్తులను తలచుకున్నప్పుడల్లా దాశరథి హృదయం ఉద్రేకంతో పొంగిపోయేది. కాస్తా చల్లబడ్డాక ఆలోచిస్తే, ఆ పొలాన్ని కాపలా కాసే అందమైన అమ్మాయికి ఏ అపకారం జరగకుండా అక్కడి పంటను తగులబెట్టాలి సుమా! అని హెచ్చరించేది అతని సున్నిత హృదయం.

**'నా కలంపు వి**
**న్నాణముతో రచింతు లల**
**నా! నును చెక్కుల పైని కావ్యముల్'–**

అంటాడు దాశరథి. అంతేకాదు **'కవితా మదిరానుపానమే అతులిత మోహనౌషధం'** అని కూడా అంటాడు. **'ఇంతి, వాసంతి దాశరథికి అతి ప్రియమైన కవితా వస్తువులు. ఉషస్సులో, చంద్రోదయంలో, శరత్తులో, శిశిరంలో అన్నింటా ఆయనకు అతివలే కన్నులకు కట్టుతారు'** అని మాన్యులు దేవులపల్లి రామానుజరావుగారు విశ్లేషించారు.

తన గ్రంథానికి 'అగ్నిధార' అని పేరు పెట్టడాన్ని కొందరు మిత్రులు ఆక్షేపించారట. అగ్ని, ధారలా ప్రవహిస్తుందా? అని ప్రశ్నించారట. దానికి దాశరథి సమాధానం ఇలా ఇచ్చాడు –**'విద్యుత్తు అగ్ని కాదా? అది ప్రవహించదా? సముద్రంలోని బడబ, అగ్ని కదా? అది నీటిలో అన్నివైపులా సాగిపోదా? అయినా అగ్ని ప్రవహించడాన్ని ఊహించండి. అగ్నిధారలోని అగ్ని అనేది చైతన్యానికి సంకేతం. ఆ చైతన్యం మానవుని హృదయంలో నుండి ఇంకొకరిలోకి ప్రవహించి, ఇలా జాతినంతటినీ ఏకసూత్రాన బంధిస్తుంది'** అంటాడాయన.

అంగారం, శృంగారం కలగలిసిన కవిత్వం ఇతనిది. సైనికుడు యుద్ధరంగంలో పోరాడుతూ అప్పుడప్పుడూ తన ప్రియురాలి అందమైన కళ్ళను తలచుకోవడం స్వాభావికం కాదా? అన్నది దాశరథి ప్రశ్న. క్రాంతిని ప్రబోధించే ఎందరో విప్లవ కవులు కమ్మని శృంగార గీతాలు రాశారన్నది దాశరథి వాదన. దుర్మార్గులైన నైజాం సిపాయిలను ఎదిరిస్తూ అడవుల్లో తిరుగుతున్నప్పుడూ జైల్లో ఏకాంతం బాధిస్తున్నప్పుడూ... తమ ఊళ్లో నది నుండి మంచినీళ్ళు మోసుకెళ్ళే పచ్చని అమ్మాయి తలపులో మెదలుతుండేది. దాంతో గుండె గొంతుకలో కదలాడుతుండేది అంటాడు దాశరథి. గాయపడిన కవి గుండెలలో రాయబడిన కావ్యాలే ఇతని కవితా ఖండికలు. **'గతాన్ని కాదనలేను, వర్తమానం వద్దనబోను, భవిష్యత్తు వదులుకోను. కాలం నా కంఠమాల. నా పేరు ప్రజాకోటి. నా ఊరు ప్రజావాటి'**గా ప్రకటించిన ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య కంటికి కనిపించేదంతా కైతగా రాశాడు. మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచాడు. నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగవలె నడిచిపోయాడు.



# భూమయ్య పరిశోధన – విమర్శ

**ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు,** తెలుగు శాఖాధ్యక్షులు, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9441330511



**(గత సంచిక తరువాతి భాగం)**

**వేయి పడగలు :** వేయి పడగల ఇతిహాస చర్చ చేసిన మొదటి అధ్యాయంలో నాయకుడు ధీరోదాత్తుడు కాడనీ ఒక కావ్యాన్ని నేడు పాఠకుడు నిరసించటం లేదు. ఇతిహాసాల్లో కనిపించే దేవాసుర యుద్ధం ఆధునికేతిహాసంలో మంచి చెడుల సంఘర్షణగా రూపొందింది. ఛందః ప్రక్రియ వచన ప్రక్రియగా మారింది...

ఇతిహాసంలో ఆద్యంతం పరచుకొని ఉండి, క్రమవికాసం పొందే కథలే కాకుండా కొందరు రచనలు చేస్తున్నారు.

ఇతిహాస లక్షణమైన ఉపాఖ్యానం చెప్పేపద్ధతి ఇతిహాసంలో, నవలలో వేర్వేరుగా ఉంటుంది. నవలలో ఉపాఖ్యానాలను అనుకథగా సంకేతించవచ్చునని అంటారు భూమయ్య. ప్రాచీన భారతాది ఇతిహాసాలకు, పాశ్చాత్యుల ఆధునిక ఇతిహాసాలకు చెప్పబడిన ప్రధానమైన లక్షణాలు సుదీర్ఘమైన కథ, కథానాయకుడు, అనుకథలు, కర్మఫలానుభవం ప్రతీకాత్మకత వేయిపడగలలో ఉన్నాయని ప్రథమాధ్యాయంలో నిరూపించారు.

**2. వస్తు సంవిధానం :**

ఈ అధ్యాయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, గణాచారి, రంగారావు, ధర్మారావు – వీళ్ల మధ్యనున్న సంబంధం తెగిపోయిన లంకె (లింక్) ఎలా పునరుద్ధరించబడింది? – ఈ అధ్యాయంలో చర్చించబడింది.

**3. కథానాయకత్వం :**

ఇందులో నాయకుడు ధర్మారావా? రంగారావా?

**"వ్యసని అయికాని, దుఃఖమును పొందికాని పిమ్మట ఎవడు అభ్యుదయమును పొందినవాడగునో అతడే ప్రధాన నాయకుడని తెలియవలెను. అనేకులకు ఒకే విధముగా వ్యసన – అభ్యుదములు రెండును కలిగినప్పుడు, ఎవరివ్యసనాభ్యుదయములు పరిపుష్టములై ఉండునో అతడే నాయకుడు"** – నాట్యశాస్త్రము అధ్యా. 24.

ఏకావ్యంలోనైనా ఉద్దిష్ట ప్రధాన ప్రయోజనాన్ని బట్టి నాయకత్వాన్ని నిర్ణయించటం ఉచితం. ఆ ప్రయోజనాభిముఖంగా కథ సాగటంలో ఆశ్రయమైన వ్యక్తికి నాయకత్వం లభిస్తుంది. ఆ విధంగా చూస్తే ధర్మారావు నాయకత్వం సందేహాస్పదం.

ఈ నవల చదువుతుంటే సర్వత్ర ధర్మారావే వ్యాపించినట్లు ఆభాసిస్తాడు. ఆయన కథే సాగినట్లు అనిపిస్తుంది. అందువల్ల ధర్మారావు కథనాయకుడేమో నన్న భ్రాంతి కలుగుతుంది.

**వేయిపడగల పాము విప్పారుకొనివచ్చి**

**కాటందుకొన్నది కలలోన రాజును** – అని పాడుతూ వెళుతున్న గణాచారికి ఒక మహాపురుషుడెదురైనాడంటూ ధర్మారావును ప్రవేశపెట్టటంలో ఈ భ్రాంతికి బీజావాసన జరుగుతుంది" అంటాడు. ప్రధాన కథ దృష్ట్యా వివాదాంశాల వ్యక్తీకరణకు, ఉద్దీప్తికి హేతువులయిన అనుకథలు – ఉపాఖ్యానాలు – ధర్మారావు సంబంధంతో అనుసరించ బడుతాయి. కాలప్రభావం వల్ల సుదీర్ఘకాలం సుప్తంగా ఉండిపోయిన గొప్ప నాగరికతగల జాతి జాగృతమయినప్పుడు, ప్రస్ఫుటమయ్యే జీవశక్తికి, సంకల్పశక్తికి, నిర్వహణశక్తికి హరప్ప చిహ్నం. ఈ శక్తిత్రయ సంపుటి అభివ్యక్తమయి ఆచరణరూపంలో ప్రవర్తించటానికి దేశీయ విజ్ఞాన ప్రచారం ద్వారా దోహదం కలిగించిన వ్యక్తి ధర్మారావు. ధర్మారావు పాత్ర ఇలాగే ఉంటుంది. మహాభారతంలో శ్రీకృష్ణుడు వంటి వాడు ధర్మారావు. శ్రీకృష్ణుడు భారత కథానాయకుడు కాడుకదా! కథానాయకుడు రంగారావే.

**నాల్గవ అధ్యాయం అనుకథలు.** ఇవి ఎలా నవలలోని ప్రధాన లక్ష్యానికనుగుణంగా ఉంటున్నాయో, వాటిలోని మౌలిక లక్ష్యాలను గమనిస్తే, ఇతిహాసతాత్పర్యంలో అవి ఎలా ఇమిడి పోతున్నాయో ఈ అధ్యాయంలో వివేచించటం కనిపిస్తుంది. రామేశ్వరం అధికార దాహంతో చేసిన పీడన ఆ దౌష్ట్యానికి అనుభవించిన ఫలం: రాధాపతి ఆత్మప్రతారణ. అధర్మప్రవృత్తమయి, విశృంఖలమైన కామ ప్రవృత్తి వేసే వెర్రితలలకు నాజూకుగా చేసిన నవనాగరకతాలంకారం రాధాపతి – ఫలితం ఆత్మహననం.

శివరావు భ్రాంతిసాధన, కుమారస్వామి గాఢశీలవ్యగ్రత, నాయరు – కారుణ్యమయత, రాఘవరావు ఆదర్శనిష్ఠ, కేశవరావు జాతీయత,

మంగమ్మ ఆత్మోత్తారణ, రంగాజమ్మ పాతివ్రత్య తపస్సు, కిరీటి శశిరేఖల దివ్యప్రణయం వంటి అనుకథలు ఎలా ఇతిహాస అంతస్సూత్రానికి దోహదం చేస్తున్నాయో వివరించాడు.

**అయిదవ అధ్యాయం కర్మాఫలానుభవం.**

వేయిపడగల నవలానాయకుడు 'రంగారావు' అని నిరూపించటం చాలామందిని ఆశ్చర్య చకితుల్ని చేసింది. వేయిపడగలలో ధర్మారావు క్రియాశూన్యతతోపాటు, కుమారస్వామి, హరప్పా, మంగమ్మ, అరుంధతితోపాటు మిగిలిన తన మిత్రవర్గానికి చైతన్య ప్రదాతగా, ప్రేరకశక్తిగా కనిపించటాన్ని భూమయ్యగారు పట్టుకున్నారు. అనుకథల అంతస్తత్వాన్ని ఒక్కొక్క మానవ స్వభావాంశంగా గుర్తించటం భూమయ్య గారి అంతర్వీక్షణాన్ని తెలుపుతుంది. ఉదాహరణకు రామేశ్వరం కథను 'అధికార దాహపీడ అనటం, రాధాపతి కథను 'ఆత్మప్రతారణ'మనటం, శివరావు కథను 'భ్రాంతి సాధన మనటం', కుమార స్వామి కథను 'గాఢశీలవ్యగ్రత' వంటి పేర్లు పెట్టటం.

ప్రతీకాత్మకతను వ్యాఖ్యానించటం, సంవిధానంలో భాగంగా వస్తు చర్చ చేయటం ఈ గ్రంథంలో ప్రధానమైన విషయాలు.

వేయిపడగల నాయక చర్చ తరువాత 'ప్రజల మనిషి' నవలలో కథానాయక చర్చ మరొక సంచలనాత్మక పరిశీలనతో కూడిన విమర్శ. స్వీయ చారిత్రాత్మక నవలగా గుర్తింపు పొందిన ఈ నవలలో కథానాయకుడు కంఠీరవం కాదు. గొట్టం కొమరయ్య అని నిరూపించటం. ఇటువంటి నవలల సంవిధానంపై విమర్శక లోకం పునరాలోచన చేయవలసిన అగత్యాన్ని భూమయ్యగారి విమర్శ కల్పించింది.

ప్రజల మనిషి నవలలో ప్రధాన సమస్య భూమి సమస్య. అది వ్యక్తికి సంబంధించిన భూమి, ప్రజలకు సంబంధించిన భూమి. ఈ రెండు రకాల భూముల్ని అంటే కొమరయ్య భూమిని, ఊరి చెరువును దొర రామభూపాల్ రావు అన్యాయంగా ఆక్రమించినప్పుడు సమస్యలో కంఠీరవం పాలుపంచుకున్న దాఖలాలేదు. అంటే నాయకత్వం వహించలేదు. అటువంటప్పుడు కంఠీరవం ప్రజల మనిషి ఎలా అవుతాడన్నది భూమయ్యగారి ప్రశ్న.

'కంఠీరవం' – పాత్ర ఆళ్వారుస్వామేనని అంటారు. కంఠీరవం పాత్ర తాను పుట్టిన కుటుంబ పరిధిని, కులమతాలనన్నీ అధిగమించి గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహా సభలు, నిజాం రాష్ట్రానికి వెలుపల గాంధీజీ నేతృత్వంలో జరుగుతున్న జాతీయోద్యమం – వీటన్నింటి నుండి చైతన్యాన్ని పొందిన పాత్ర. అయితే ఆ చైతన్యంతో చూపించవలసిన పోరాటస్ఫూర్తిని చూపించలేదన్నది భూమయ్యగారి వాదన. దిమ్మగూడంలో జరిగిన మత పరివర్తనకు కారకుడు హైదరలీ. మతమార్పిళ్లను అడ్డుకోవాలని పట్నం నుండి వచ్చిన కంఠీరవం అడ్డుపడలేదు. జరుగుతున్నంత సేపు చూస్తుండిపోయాడు. అంతా అయ్యాక అంజుమన్ నాయకుల్ని ప్రభుత్వ విధానాల్ని విమర్శించి దూషించి నిర్బంధింపబడటం, సరయిన సమయంలో తీసుకున్న సరయినచర్యకాదని భూమయ్య గారంటారు. అలాగే గ్రంథాలయ ప్రధాన కార్యదర్శిగా సభానుమతినీ ప్రభుత్వంతో ఏ పోరాటమూ చేయలేదు. సమస్య సమస్యగానే మిగిలిపోయింది.

బెదిరించి దొరలాక్కున్న భూమిని, ఎదిరించి తిరిగి పొందటం, ఊరి చెరువునాక్రమించిన దొరను ప్రజల మద్దతుతో జైలుపాలు చేయటంతో పోరాటం చేసింది కొమరయ్యయే. చైతన్యమూర్తిగా కొమరయ్యలో ఆ చైతన్యం అప్రయత్నంగా నవల ఆరంభం నుండి ఎలా వికసిస్తూ వచ్చిందో సోదాహరణంగా చెపుతూ, కంఠీరవాన్ని కథానాయకునిగా నిలబెట్టేందుకు ఎలాంటి విఫలయత్నం జరిగిందో కూడా భూమయ్య విశ్లేషించి చెప్పాడు.

**మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం :**

కందుకూరి సాహిత్యేతర ప్రక్రియలన్నింటినీ తన సంస్కరణోద్యమానికి వాడుకుంటే, ఆ చైతన్యాన్ని కవిత్వానికి కూడా పట్టించి చూపినవాడు గురజాడ. గురజాడలోని ఆధునికదృక్పథం, అభ్యుదయ ఉద్యయమానికి నాందీగీతమని, శ్రీశ్రీ ఆ ఉద్యమానికి మూలవిరాట్టని అభ్యుదయ విమర్శకులు నిరంతరం నొక్కిచెప్పారు.

శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం ముప్పయ్యవ దశకంలో 1938 నుండి వస్తే, ఉన్నవ మాలపల్లి 1922లో వెలువడింది. శ్రీశ్రీలో లేని కులదృష్టి ఉన్నవ రచనలో ఉంది. ఆర్థిక సామాజిక దృష్టి రెండుకళ్ళుగా ఉన్నవ మాలపల్లి కనిపిస్తుంది. శ్రీశ్రీలా ఉన్నవ మార్క్సను చదువటానికి అప్పటికి అవకాశం లేదు. అభ్యుదయాన్ని కేవలం మార్క్సిజం నికషం మీదనే నిర్ణయిస్తే గురజాడ కూడా నిలవడు. వీరేశలింగం అనుచరునిగా, గుంటూరు వీరేశలింగంగా ఖ్యాతికెక్కి, తిలక్ శిష్యునిగా, పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొన్నవానిగా, ఐర్లాండ్‌లో బారిస్టర్ చదువు చదువుతూ అక్కడి ఉగ్రవాదాన్ని, శాన్ షాన్ ఉద్యమాన్ని గమనించిన ఉన్నవ హృదయం సహజంగానే సంస్కరణాపేక్షితమైంది. ఉన్నవ మాలపల్లి రాసే నాటికి మార్క్సిజాన్ని గురించి 1921 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో 'సోవియట్టులు' అనే శీర్షికతో భోగరాజు పట్టాభి సీతారామయ్య వ్యాసాన్ని రాస్తే, గోవిందరాజు శ్రీవేంకటకృష్ణారావు 1921లో 'నిలోలాయ్ లెనిన్' అనే గ్రంథాన్ని ఇంగ్లీషులో రాశాడు. వీళ్లు కమ్యూనిజం ప్రేమికులని చెప్పలేం. అలాగే వీటిలో దేనినైనా ఉన్నవ చదివియుండేందుకు అవకాశముంటే ఉండి యుండవచ్చు. ఇవి చదవకపోయినా ఆయనకు రష్యా విప్లవాన్ని గురించిన అవగాహన ఉన్నది.

ఇటువంటి నేపథ్యంలో రాసిన మాలపల్లి నవలలోని 'చరమగీతం', సమతాధర్మ'మనే రెండు గీతాల నాధారం చేసికొని ఉన్నవ తొలి అభ్యుదయకవి అని నిరూపించాడీ గ్రంథంలో భూమయ్య.

**"ఆర్థిక ప్రాతిపదిక మీద సమాజాన్ని రెండు వర్గాలుగా చూపి, ఆ వర్గ భేద నిర్మూలన మార్గాలను తెలియరాయటమే అభ్యుదయ కవిత్వమైతే తెలుగులో మొట్టమొదటి అభ్యుదయ కవి ఉన్నవ లక్ష్మీనారాయణగారే"** (పుట. 7) అని చరమగీతం, సమతా ధర్మమనే గీతాలలోని వస్తువును ఆధారంగా చేసికొని భూమయ్య నిర్ణయించారు ఇదే గీతాలలో గాంధీజీ సహాయ నిరాకరణ కూడా ఉన్నదని మరికొందరు వివేచించారు.

**"కులపరమైన సాంఘిక అసమానతల్ని రూపుమాపుతూ మార్క్సు దృక్పథాన్ని అనుసరించి ఆర్థిక అసమానతలను తొలగించుకుంటూ సమసమాజ స్థాపనకు తోడ్పడేదే అభ్యుదయ కవిత్వం"** అని శ్రీశ్రీ వంటి వారు పట్టించుకోని దళిత స్పృహను జోడించి ఉన్నవ వారి దృక్పథమిదేనని **"అభ్యుదయ కవులు మార్క్స్ చెప్పిన ఆర్థిక సమస్యను మాత్రమే చేపట్టి, ఉన్నవ చెప్పిన మనదేశంలోని బలమైన కుల సమస్యను పట్టించుకోలేదు"** (పుట. 34) అని స్వదేశీస్థితిని గమనించ గలిగిన ఉన్నవ వారిలో విదేశీయమైన మార్క్సిజానికి స్వదేశీ పునాది ఎలా జత అయిందో చెపుతూ **"చరమగీతానికి ప్రేరణ భారతదేశం లోని సాంఘిక పరిస్థితులు. సమతాగీతానికి ప్రేరణ మార్క్స్"** (పుట. 34) అని భూమయ్య సోదాహరణంగా వివరించాడు.

సంగదాసు, వెంకటదాసులనే ఇద్దరిని గాంధీతత్త్వానికి, సామ్య వాదానికి ప్రతీకలుగా చేసి కథను నడిపి, తుదకు సంగవిజయంగా నవలను తీర్చిన ఉన్నవను తొలి అభ్యుదయకవి అనటం మాలపల్లి లోని గేయాలను పురస్కరించుకునే. కులవ్యవస్థను తొలుత గురజాడయే తిరస్కరించాడని అనటం, శ్రీశ్రీయే తొలి అభ్యుదయ కవి అనటం సాహిత్యలోకంలో స్థిరపడిన సంప్రదాయం. దాన్ని కాదని ఎత్తి చూపే సాహసం భూమయ్యగారు చూపారు.

**'లవణరాజు కల'**లో గురజాడ **'మంచియన్నది మాలయైతే మాలనేనవుదున్'** – అన్న వాక్యాల సందర్భాన్ని గమనిస్తే వ్యామోహితుడైన రాజు తాత్కాలిక భావోద్రేకంలో ఆమె సౌందర్యానికి అమోదం తెలుపుతూ అన్నమాటలని, కాయకష్టం చేసుకుంటూ చాలీచాలని తిండితో అలమటించే మాలస్త్రీని ప్రబంధనాయికగా వర్ణించే రాజు దృష్టిపథంలో కనిపించే ఉదాత్తతను గురించి భూమయ్యగారు వేసిన ప్రశ్న ప్రత్యేకంగా పరిశీలించదగింది.

**'గురజాడది సంఘసంస్కరణదృష్టి. రాయప్రోలుది శృంగార రస సంస్కరణదృష్టి. కట్టమంచిది వ్యక్తిత్యాగ ప్రధానమైన జాతీయ దృష్టి'** అని చెపుతారు భూమయ్య.

అభ్యుదయ దృక్పథం వర్గవైరుధ్యాన్ని, సంఘర్షణను నొక్కి చెపితే, మాలపల్లి వర్గ సామరస్యాన్ని అభిలషించింది. తక్కెళ్ల జగ్గడి తత్త్వాలతో, బోధనలో కమ్యూనిస్టుమేని ఫెస్టోలోని భావాలు కనిపిస్తాయి.

అ.ర.సం.స్థాపనకు, అభ్యుదయ కవిత్వానికి జన్యజనక సంబంధం లేదన్న కె.వి. రమణారెడ్డి గారి మాటల్ని భూమయ్యగారి



విమర్శ నిజమని నిరూపిస్తుంది.

మార్క్సిజం స్పృహ ఉన్నవకున్నదన్న విషయాన్ని భూమయ్య పట్టి చూపిన సందర్భాన్ని గమనిద్దాం. మార్క్స్ భావాలు ప్రభావ ఫలితమే జగ్గడు. జగ్గడు నడిపిన సంతానోద్యమం –

**''సంతానోద్యమం బోల్‌షెవిజానికి వామశాఖని''** కవి రామానాయుడి చేత స్పష్టం చేయించాడు. (పుట. 87) అని పేర్కొన్న దానినిబట్టి ఉన్నవకు బోల్‌షేవిజంతో పరిచయముందని తేటతెల్ల మవుతుంది. ప్రజలుకాని, రామదాసుకాని, కలెక్టరు గాని సంతానోద్యమం చట్ట వ్యతిరేకమయినప్పటికీ, మొత్తం మీద దాని ఉద్దేశం మంచిదేనన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఉన్నవ చెప్పటంలో దానిపై తన అభిప్రాయాన్ని చెప్పినట్లే.

ఇలా జాతీయ జీవన మార్గాన్ని వీడని ధోరణిలో భావ కవితా యుగంలో వెలసిన నవల మాలపల్లి. దాని రచయిత ఉన్నవ తొలి అభ్యుదయ కవి అని భూమయ్య తీర్మానం.

**ఆద్యుడు కట్టమంచి :**

ఆధునికాంధ్ర విమర్శకు దారి చూపిన ధీశాలిగా సి.ఆర్. రెడ్డిగారిని సాహిత్య లోకం గౌరవిస్తుంది. అయితే ముసలమ్మ మరణం వంటి సాంఘిక ఇతివృత్తాన్ని తీసుకొని, వస్తు నవ్యతతో కావ్యం రాసే ఆధునిక కవిగా కట్టమంచి నిలిచిపోయాడు. ఒక వాస్తవ కథను కావ్య వస్తువుగా స్వీకరించి, భోగవస్తువుగా కథానాయికగా చిత్రించే వాతావరణానికి భిన్నంగా త్యాగమూర్తిని చేసి స్త్రీని చిత్రించడం ముసలమ్మ మరణంలోని విశిష్టత. సాహిత్యం, సమాజం నిత్య సంయోగాలని ఈ రచన ద్వారా సి.ఆర్.రెడ్డి గారు నిరూపించ దలచినట్లుగా భూమయ్యగారు పేర్కొన్నారు. ఈ కావ్య రచనా కాలానికి దేశంలో స్వాతంత్ర్యోద్యమం ప్రారంభమవుతున్న సమయం. **"ఎవరికి వారు 'నాకేమిటి?' అని అనుకున్నట్లయితే దేశానికి స్వాతంత్ర్యం రావటం అసంభవం. త్యాగం ఏ కాలానికైనా అవసరమైన గుణమే అయినప్పటికీ ఈ కాలంనాటికి మాత్రం అది తప్పనిసరి. దేశ**

**సౌభాగ్యానికి పాటు పడవలసింది ఒక్క పురుషులే కాదు స్త్రీలు కూడ. ఒక ఉద్యమ విజయానికి స్త్రీలు కూడ భాగస్వాములు కావాలన్నది రెడ్డిగారి అభిప్రాయం"** (ఆద్యుడు కట్టమంచి, పుట. 5) అని భూమయ్యగారు ఈ ముసలమ్మ మరణ కావ్య రచనోద్దేశాన్ని వివరించారు.

ఆంగ్ల భాషా గవాక్షం ద్వారా తాను అధ్యయనం చేసిన సాహిత్య ప్రభావంతో ఈ ప్రయోగం చేసి ఆధునిక తెలుగు సాహిత్యంలో నవ్యతను సాధించిన మొట్టమొదటి కావ్యంగా దీనిని భూమయ్యగారు నిరూపించారు. అయితే కావ్యాన్ని శ్రీతో ఆరంభించడం, పూర్వకవుల్ని స్మరించడం, దేవతలను, తండ్రిని స్తుతించడం, అంకిత పద్యాలుండటం - ఇటువంటి పదహారు పద్యాల తరువాత ప్రారంభమైన కథా పద్యాలు కూడ శ్రీతోనే ప్రారంభం కావటం, చంపూ కావ్య పద్ధతిలో అందునా ప్రాచీన కావ్య పద్ధతిలోనే పద్యాలు రచించడం ఇవన్నీ కూడ రచనా నవ్యతను పట్టి చూపడంలేదు. కేవలం వస్తునవ్యత తప్ప రచనలో మరేమీ లేదని ఈ కావ్యాన్ని గూర్చి చాలామంది మాట్లాడారు. దానికి భిన్నంగా భూమయ్యగారి ప్రతిపాదనను గమనిద్దాం.

ముసలమ్మ పాత్ర వైశిష్ట్యాన్ని తెలిపే సన్నివేశాలు కావ్యంలో రెండు కనిపిస్తాయి. (1) ఊరి ప్రజలు ఆమె గుణగణాల్ని కీర్తించడం (2) చెరువుకు బలికాదలచుకున్న తన నిర్ణయాన్ని భర్తకు చెప్పి ముసలమ్మ ఒప్పించడం. ఈ రెండు సన్నివేశాల ద్వారా ముసలమ్మ పాత్ర ఏ విధంగా ప్రకాశించినదో భూమయ్యగారు సవివరంగా చర్చించారు. రెండవ సన్నివేశంలో ముసలమ్మ మానవతా ధర్మాన్ని, కారుణ్య బుద్ధిని, పరోపకారాన్ని, వసుధైక కుటుంబ భావాన్ని, విశ్వ మానవతా దృక్పథాన్ని చాటిచెప్పే సన్నివేశంగా, సహజంగా, హృదయంగమంగా కట్టమంచివారు ఎలా తీర్చిదిద్దారో భూమయ్యగారు వివరించారు.

**ముసలమ్మ :** అత్తమామల అనుమతిని తీసుకునే సందర్భాన్ని, భర్త అనుమతిని పొందే సందర్భం కంటే కూడ క్లుప్తంగా చెప్పటంలోని ఔచిత్యాన్ని భూమయ్యగారు ఇలా వివరిస్తారు. భర్తను ఒప్పించి అనుమతి పొందగలిగిన ముసలమ్మకు అత్తమామల అనుమతి పొందడం అంత కష్టం కాలేదు. భర్తతోనే ఆమెకు ఎక్కువ గాఢానుబంధం కాబట్టి ఆ బంధాన్ని క్రమక్రమంగా వదిలించుకోవటంలో సహజంగానే కొంత ఇబ్బందిగా ఉంటుంది.. వారి సంభాషణను సుదీర్ఘంగా తీర్చడంలోని రహస్యమది. (ఆద్యుడు కట్టమంచి, 5.21)

భర్త, అత్తమామలతో పాటు ఊరి ప్రజల అనుమతిని తీసుకోవడంలో ముసలమ్మ ఉదాత్తత పరాకాష్టకు చేరిందని భూమయ్యగారు వివరిస్తారు. ఈ కావ్యంలోని బుక్కరాయ సముద్రమనే గ్రామం దేశానికి ప్రతీక అని, గ్రామ ప్రజలు దేశ ప్రజలని, దేశ క్షేమంలోనే కుటుంబ క్షేమం ఇమిడి ఉందని ప్రబోధించిన ఆధునిక తెలుగు కావ్యనాయిక ముసలమ్మేనని, అందుకే ఆధునిక తెలుగు కవితా మార్గానికి ఆద్యుడు కట్టమంచేనని భూమయ్యగారు నిరూపించారు.

**"పద ప్రయోగంలో, వర్ణనలలో, పద్య శిల్పములో (ఛందస్సులో) పలుకుబడి పోహళింపులో రెడ్డిగారు సంప్రదాయ క్షుణ్ణమైన ప్రబంధ మార్గాన్ని అవలంబించినారని, రచనా రీతిని బట్టి చూస్తే ఈ కావ్యంలో నవ్యత కానరాదని నారాయణరెడ్డిగారు పేర్కొన్నారు."** (ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు - ప్రయోగములు, పుట. 153) ఈ అభిప్రాయాన్ని సోపపత్తికంగా కావ్యంలోని ఔచిత్యమైన వర్ణన సందర్భాలనన్నింటినీ పేర్కొని సి.నా.రె. అభిప్రాయంలోని సామంజస్యాన్ని చర్చించి భూమయ్యగారు పరాస్తం చేస్తారు. కట్టమంచిలోని తొలి ఆధునిక కవిగా, ఆయన ప్రతిపాదించిన వస్తు ప్రాధాన్యాన్ని, నాయికా ప్రాధాన్యాన్ని, త్యాగ వీరాన్ని దృష్టిలో పెట్టుకొని భూమయ్యగారు తీర్మానించారు. రాయప్రోలు, గురజాడ, దువ్వూరి రామిరెడ్డి వంటి వాళ్లపై కట్టమంచి ప్రభావముందని భూమయ్యగారు సోదాహరణంగా నిరూపించారు. వస్తువు, రచన, భావం అనే మూడింటిలో కట్టమంచి వారు ముసలమ్మ మరణం ద్వారా మొదటి మార్గాన్ని పేర్కొంటే, రెండవ మార్గమైన రచనలో ఆధునికత చూపించే మార్గానికి గురజాడ ప్రాతినిధ్యం వహించారని, భావనవ్యత గల మూడో మార్గాన్ని రాయప్రోలు ప్రతిపాదించారని, వీరందరిలోనూ మొదటివారు కట్టమంచి కాబట్టి **"ఆద్యుడు కట్టమంచే"**నని భూమయ్యగారు సంభావించారు.

**తొలి ఆధునిక విమర్శ గ్రంథం : కవిత్వతత్త్వవిచారము :**

1914లో వెలువడిన కవిత్వతత్త్వవిచారము అటు నవ్య కవిత్వం మీద, ఇటు తెలుగు సాహిత్య విమర్శమీద అమితమైన ప్రభావాన్ని చూపి, ఆధునిక తెలుగు సాహిత్య స్వరూప స్వభావాల్ని మార్చివేసింది. ఆధునిక సాహిత్య విమర్శలో ప్రథమ స్థానాన్నాక్రమించుకొన్న ఈ గ్రంథాన్ని గురించి అనుకూల ప్రతికూల విమర్శలు బహుముఖంగా వచ్చాయి. కొందరైతే అంతకుముందు విమర్శకులు పేర్కొన్న చాలా విషయాలను తనదైన శైలిలో కట్టమంచివారు ప్రస్తావించారని పేర్కొన్నారు. పి. దక్షిణామూర్తిగారి వ్యాసంలో కనిపించే భావనాశక్తి, కల్పనాశక్తి, నాటకశైలి, స్వాభావిక వర్ణనలు, ఉత్ప్రేక్షాది అలంకారాలు ఉండకపోవటమనే అంశాలు కట్టమంచివారి కవిత్వతత్త్వ విచారంలో కనిపించేమాట నిజమేగానీ ఆ అంశాలను గురించిన విశ్లేషణ కట్టమంచివారి గ్రంథంలో భిన్నంగా కనిపిస్తాయని భూమయ్యగారు సోదాహరణంగా వివరించారు. సమాజం, సాహిత్యం రెండు పరస్పర పూరకాలని చెబుతూ కట్టమంచివారు ప్రతిపాదించిన విషయాన్నిలా వివరించారు.

**'కవిత్వ తత్త్వ విచారం'** ప్రథమ భాగం ప్రారంభంలోనే **"భాషా చరిత్ర, దేశచరిత్ర నిత్య సంయోగాలు"** అనే శీర్షిక పెట్టి ఈ విషయాన్ని

పేర్కొన్నారు. వీర శౌర్యాది గుణాలతో విరాజిల్లే కాలంలోనే నన్నయ తిక్కనాది కవులు గొప్ప కవిత్వాన్ని రాయగలిగారని, మహమ్మదీయుల చేత ఓడింపబడి తెలుగు జాతి ఉత్సాహాన్ని కోల్పోయిన కాలంలో ప్రతిభావంతమైన కవిత్వం వెలువడలేదని కట్టమంచివారు ప్రతిపాదించారు. ఈ అంశాన్ని గూర్చి సమీక్షిస్తూ భూమయ్యగారు ఇలా రాస్తారు. **"గొప్ప కవిత్వం రావటానికి సమాజం గొప్పదిగా ఉండాలన్నది"** రెడ్డిగారి ఉద్దేశం. అందుచేత పౌరుషం చెడి, నిద్రాణంగాను, నిస్తేజంగాను దురాచారాల చేజిక్కి ఉన్న సమాజం యొక్క దుస్థితిని కూడ ఆయన, కొందరి మనసు చివుక్కుమనేటట్లు కొంత ఘాటుగా విమర్శించారు. ఈ విమర్శ విధానానికి సంతోషించినవారు కూడా ఉన్నారు. ఈ విధంగా రెడ్డిగారు సమాజానికి, సాహిత్యానికీ గల నిత్య సంబంధాన్ని చూపి ఆనాటి సమాజాన్ని విమర్శించినారు కాబట్టే కవిత్వతత్త్వ విచారం యువకుల మీద గాఢమయిన ప్రభావం చూపగలిగింది. మంచి కవిత్వం వచ్చింది. విమర్శ గ్రంథాలు అనేకం వచ్చినాయి. ఇది రెడ్డిగారి కవిత్వతత్త్వ విచారంలోని ఒక ప్రత్యేకత. (ఆధునిక విమర్శ గ్రంథం కవిత్వతత్త్వ విచారము : పుట. 79)

అలంకార శాస్త్రాలపై తిరుగుబాటును, కవి స్వేచ్ఛను గూర్చి ప్రస్తావిస్తూ మనిషికి స్వేచ్ఛ ఎంత ముఖ్యమో కవికి కూడ అంతే స్వేచ్ఛ ముఖ్యమని, అలంకారశాస్త్రాల నుండి విడివడి, స్వేచ్ఛగా ఆలోచించకపోతే అతని సృజనాత్మకత ఉద్బుద్ధం కాదని కట్టమంచి వారి అభిప్రాయం. ప్రబంధాల్లో గతానుగతికమైన వర్ణనలు, మూసపోసినట్లుగా వర్ణనలుండటానికి కారణం అలంకార శాస్త్రాలే కారణమని కట్టమంచి భావన. బసవరాజు అప్పారావు లాంటి యువకవులకు ఈ కవిత్వతత్త్వ విచారమే స్ఫూర్తి అని, నవ్యాంధ్ర సాహిత్య వీధులలో కురుగంటి సీతారామాచార్యులవారు పేర్కొన్నారు. విమర్శరంగంవైపు వేలుచూపిన వారు ఎంతమంది ఉన్నా వెలుగు చూపినవారు మాత్రం కట్టమంచేనని భూమయ్య వివిధ సాక్ష్యాలతో, ప్రమాణాలతో నిరూపించారు.

**"కవిత్వతత్త్వవిచారం"లో కట్టమంచి ప్రతిపాదించిన సిద్ధాంతాలు:** కథ, ప్రబంధం, వర్ణనలు, అలంకారాలు, పాత్రలు, రసం, భావనాశక్తి మొదలైన అంశాలకు సంబంధించినవి. రెడ్డిగారు ప్రతిపాదించిన సిద్ధాంతాలు ప్రధానంగా అలంకారశాస్త్రాలపై తిరుగుబాటును ప్రకటించినాయి. వస్తు భావ రచనల్లో రెడ్డిగారు ప్రధానంగా వస్తు భావాల మీదనే దృష్టిని కేంద్రీకరించారని భూమయ్యగారు ప్రమాణాలతో నిరూపించారు. అలంకారాల ప్రయోజనాన్ని రెడ్డిగారు ఎరుగని వారేమీకాదు కానీ భావ ప్రకటనకు అవి సహకరించేలా ఉండాలని కోరుకుంటారని భూమయ్యగారు కట్టమంచి వారి ఉద్దేశాన్ని వివరించారు. ఇలా వస్తు నవ్యతగల కావ్యాన్ని రాసి, అటు ఆధునిక కవుల్లోను, ఇటు ఆధునిక సాహిత్య విమర్శకుల్లోను కట్టమంచి రామలింగారెడ్డి గారు ఆద్యస్థానాన్ని అలంకరించారని భూమయ్యగారు నిరూపించిన గ్రంథమే **"ఆద్యుడు కట్టమంచి".**

ఇలా రెండు కొత్తకోణాలలో రెండు పుస్తకాలను సమీక్షించి కొత్త దారిని విమర్శక లోకానికి చూపిన భూమయ్యగారు విమర్శక లోకంలో కూడ అంతర్వీక్షణ సార్వభౌములే.

---

**"ఉద్ధరేదాత్మనాఽఽత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవహ్యాత్మనోబంధు: ఆత్మైవ రిపురాత్మన: ॥"**

**(భగవద్గీత 6-4)**


అందరూ తమను తామే ఉద్ధరించుకోవాలి. వారిని వారు అధోగతిని పొందించుకోకూడదు. ఇంద్రియాలను జయించుకునే ప్రయత్నం చేస్తే తనకు తానే బంధువు అవుతాడు. అదేవిధంగా జయించక పోతే తనకు తానే శత్రువు అవుతాడు.

ఈ లోకంలో పుట్టిన అందరూ ఏవో కర్మల కొరకు మాత్రమే పుడుతుంటారు. పుట్టిన ప్రతివారు తప్పనిసరిగా తామున్న స్థితి నుండి ఉన్నతస్థితివైపు ఎదగడానికి మాత్రమే ప్రయత్నించాలి. ఎవరో వచ్చి తమను ఉద్ధరించే అవకాశం లేదు. తమ కర్మల ప్రకారమే ఎవరైనా తమ చుట్టూ చేరుతారు. అయినా తమకున్న పుణ్యం వల్లనే వారు తమకు ఉపయోగపడతారు. అందువల్ల అనవసరమైన విషయాలపై మనసు కేంద్రీకరించకుండా, ఉన్నతశక్తిపై దృష్టి సారించినప్పుడు మాత్రమే తమను తాము ఉద్ధరించుకునే అవకాశం కలుగుతుంది.

మన చుట్టూ ఎప్పుడూ ఏవో సమస్యలు ఉంటూనే ఉంటాయి. సమస్యలను చూస్తూ, ఇంద్రియాలకు లోలత్వము పొందుతూ స్వల్ప సంతోషాలకు పొంగిపోవడం, చిన్న బాధలకే కుంగిపోవడం వల్ల ఎదగడం కష్టం. అసలు సమస్యలు ఎందుకు వస్తుంటాయి? తమకే అనేక రూపాల్లో కష్టాలు వస్తుంటాయని ఎందుకు మనం భావిస్తున్నాం? ఇవి మనని వేధిస్తున్న ప్రశ్నలు. తట్టుకునే శక్తి ఉన్నంతవరకు ఏదీ సమస్య కాదు. తట్టుకునే శక్తి లేనప్పుడు మాత్రమే ఏ విషయమైన సమస్యగా భావించడం జరుగుతుంది. ఒక చిన్నపిల్లవాడికి ముల్లు గుచ్చుకుంటే బాగా ఏడుస్తాడు. అదే కొంత పెద్దవానికి గుచ్చుకుంటే అంత ఎక్కువగా బాధపడడు. ఇద్దరికీ జరిగిన నొప్పి ఒక్కటే అయినా చిన్నపిల్లవానికి తట్టుకునే శక్తి ఉండకపోవడం వల్ల ఏడవడం జరుగుతుంది. అందుకే మన ప్రయత్నం ద్వారా మనం అన్ని సమస్యలను తట్టుకునే శక్తిని పెంచుకోవాలి.

# సాహిత్య తపస్వి...

డా. తిరునగరి శ్రీనివాస్, ఫోన్ : 9441 464 764



భూగోళమంత మనిషికి
కవితాహారతులెత్తిన శబ్దశిల్పి
సంప్రదాయ ప్రయోగాలను
పరిమళింపజేసిన విద్వన్మణి
ప్రతీకల ప్రత్యేకతతో
భావచిత్రాల మేళవింపుతో
పదబంధుర రచనలందించిన సామ్రాట్టు
కలాన్నే కరవాలంగా మలిచిన నిబద్ధత
సరిలేని భాషాచమత్కృతుల చతురత
సమ్మోహన ప్రసంగాలతో చాటిన విజ్ఞత
కొనగోటి మీద జీవితాలను
విభిన్నతల దృక్పథాలను
అవలోకించి అక్షర బద్ధం చేసిన మహాద్యుతి
కవితాలతకు వన్నెలద్దిన పున్నమిరేడు
విశ్వంభరపై తెలుగును వెలిగించినాడు
మట్టీ మనిషీ ఆకాశాన్ని
అనుసంధానించిన ప్రయోగశీలి
అక్షరమై ప్రకాశించిన జ్ఞానపీఠి
సినారె మనోజ్ఞ కవితా తపస్వి...

( జూలై 29న సినారె జయంతి...)


# శిలాక్షరం


**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 (17) హైదరాబాద్ జులై : 2024

# తెలంగాణ కథ – సమకాలీనత


**డా. ఎన్. రజని,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9010501030


తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన కథలను మొదటి నుంచీ నేటివరకు పరిశీలిస్తే ఆ కథల్లో ఆయాకాలాల జీవితం, నేపథ్యం, సమాకాలీనత ఎట్లా ఉందో తెలుసుకోవచ్చు. ముఖ్యంగా కథలన్నింటిలోనూ కనిపించే సమకాలీనతను మీ ముందు పెట్టడానికి ప్రయత్నిస్తాను. తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన రచయితలు, రచయిత్రులందరిలోను సహజంగా కనిపించే ఏకత సమకాలీనత ఆ సమకాలీనతను గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం. ముందుగా ఆయా కాలాల్లో సాంస్కృతికంగా, సామాజికంగా వచ్చిన ఉద్యమాలు, సంస్కరణలు, మార్పులు అన్నీ ఆయా కాలపు రచనల్లో ప్రతిబింబించాయని చెప్పవచ్చు. ఆయాకాలపు రచయితల దృక్పథాల్లో ఆయాకాలాల సమాజ ప్రభావం స్పష్టంగా పడిందని చెప్పవచ్చు.

సమాజంలో వచ్చిన పెనుమార్పులలో సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమాలు, అభ్యుదయ, విప్లవోద్యమాలు, అస్తిత్వ ఉద్యమాలు, మైనారిటీ ఉద్యమాలు, గిరిజన సంక్షేమం ఇవన్ని సమాజంలో ఒకవైపు జరుగుతూ ఉంటే అవన్నీ సాహిత్యంలో ఎట్లా ప్రవేశించాయో కథల్లో ఎట్లా వస్తువులయ్యాయో మనం ఇప్పుడు తెలుసుకోవచ్చు.

తెలంగాణలో కవులే లేరు అన్నమాటకు ప్రతిస్పందిస్తూ సురవరం ప్రతాపరెడ్డిగారు 354 మంది తెలంగాణ ప్రాంత కవులను పరిచయం చేసారు. అట్లాగే తెలంగాణ ప్రాంతం నుంచి మొట్టమొదటి కథ రావడమే కాదు సంస్కరణ కాలం నుంచీ వచ్చిన ఎన్నో కథలను మనం కచ్చితంగా గమనించాలి. సాహిత్యకారులు, రచయితలు తమ సమకాలీన జీవితాలను పట్టుకోవడం వాటిని తమ కథల ద్వారా పాఠకలోకానికి అందించడమనే గొప్ప పనిని చేశారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

బెంగాల్‌లో రాజారాంమోహన్‌రాయ్‌తో మొదలైన సంస్కరణ గాలులు తెలుగు ప్రాంతంలో కందుకూరి వీరేశలింగం వంటి వాళ్లను ప్రభావితం చేసాయి. అయితే ఆ ప్రభావం తెలంగాణ ప్రాంతమంతా కూడా పడింది. కోస్తాంధ్ర ప్రాంతంలో ఒక ఉద్యమంగా వచ్చినట్టు కనిపించినా, ఆ సంస్కరణ ప్రభావం గురజాడ, శ్రీపాద మొదలైన వారి కథల్లో ప్రస్ఫుటంగా కనిపించడం వల్ల సంస్కరణ ప్రభావాన్ని మనం ఎక్కువగా కోస్తాంధ్ర ప్రాంతపు దృష్టితోనే చూస్తాము. కానీ తెలంగాణ ప్రాంతపు కథకులు, రచయితల మీద కూడా ఆ ప్రభావం తక్కువేమి లేదు. సంస్కరణలో భాగమైన స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం, సంఘసేవ, అభ్యుదయ దృక్పథం మొదలైన కథాంశాలు తెలంగాణలో కూడా వెలువడ్డాయి.




**"మధ్య తరగతి కుటుంబ సమస్యలను, బ్రాహ్మణీయ భావజాలాన్ని చిత్రించిన ఆంధ్రప్రాంతంలోని కథల కన్నా తెలంగాణ నుంచి కథలు మొదటి నుంచి భిన్నంగా ఉన్నాయి. తెలంగాణ కథా రచయితలు సమాజాన్ని పట్టించుకొనే కథలే మొదటి నుంచి రాసారు. సమాజ సమస్యలు కింది వర్గపు ప్రజల జీవితాలు వాళ్ళ కథల్లో చిత్రింప బడినాయి"** అంటూ ముదిగంటి సుజాతారెడ్డి గారు తెలంగాణ తొలితరం కథలు పుస్తకానికి ముందుమాటలో పేర్కొనట్టు తెలంగాణ రచయితలు తమ చుట్టూ ఉన్న సమాజాన్ని, సమస్యలను ముఖ్యంగా కింది వర్గపు ప్రజల జీవితాల్ని ఎక్కువగా చిత్రించారు.

బండారు అచ్చమాంబ కథ మొదటిది అనుకుంటే, బండారు అచ్చమాంబ తన మొదటి కథలోనే స్త్రీవిద్య ఆవశ్యకతను తెలియచెప్పింది. ఆడంబరాలకు దూరంగా ఉండాలనే సూచనతో పాటు "ధనత్రయోదశి" కథలో స్త్రీలు ఎప్పుడూ నగల వ్యామోహాన్ని కలిగి ఉంటారనే ఒక అపోహను తొలగించే విధంగా తన భర్త నిజాయితీని నిరూపించడమే కాదు. భార్యాభర్తల మధ్య ఉండవలసింది అన్యోన్య ప్రేమ అని, ఆ ప్రేమకు నగలు గీటురాయి కాదనే సందేశాన్ని చాలా స్పష్టంగా చెప్పింది. **"ధనత్రయోదశి"** పండుగను **"ప్రేమ"** అనే నగలతో జరుపుకోవటం మోసాలు లేని సమాజాన్ని కలగనడం ఈ కథలో రచయిత్రి ఇచ్చిన తీర్పు గురజాడ భావించినట్టు **"మగడు వేల్పన పాత మాటది ప్రాణ మిత్రుడ నీకు నేను"** అనే భావనే ఈ కథలో చాలా స్పష్టంగా తెలుస్తుంది.

నిజానికి తెలంగాణలో చాలా సాహితీ సంస్థలు ఏర్పడడం, పుస్తకాలు అచ్చవడం, కథలు రాయడం వంటివి జరిగినా ఎక్కువగా

ప్రచారానికి నోచుకోకపోవడం వల్ల ఆ కథలు బయటి సమాజానికి పరిచయం కాలేదు. 1915లోనే **"మల్లికా గుచ్చము"** అనే పేరుతో మాడపాటి హనుమంతరావు గారు రాసినది తెలంగాణ కథల మొదటి పుస్తకం.

అణా గ్రంథమాల ప్రచురించిన **"రైతు" "సుభాష్ చంద్రబోసు"** అనే వాటిని నిజాం రాష్ట్రం నిషేధించింది. అంటే ఆ కాలపు సమాజ చిత్రణ ఎంత వాస్తవంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మాడపాటి రాసిన **"హృదయశల్యము"** కథ కూడా స్త్రీలను శంకించకూడదనే ఇతివృత్తంతో సాగుతుంది.

ఒద్దిరాజు సోదరులలో ఒకరైన సీతారామచంద్రరావు రాసిన **"రక్తమూల్యము"** సంఘసంస్కరణ దృష్టితో, దేశభక్తితో సాగుతుంది. రాఘవ రంగారావు రాసిన **"లండన్ విద్యార్థి"** కథ కూడా సంపన్నుల దోపిడిని, విదేశీ వ్యామోహాన్ని, జాతీయతా భావాల వ్యాప్తిని చిత్రించింది.

నందగిరి వెంకట్రావు అప్పటి గోల్కొండ రాజ్యాన్ని, అక్కన్న మాదన్నల పరిపాలనను చారిత్రాకాంశాలతో స్పృశించారు. అప్పటి నిజాం రాజుల పరిపాలనా సరళిని ఇందులో చూస్తాము.

ఎల్లాప్రెగడ సీతాకుమారి 1937లో రాసిన **"పుని స్త్రీ పునర్వివాహం"** అనే కథ నిజానికి సంఘ సంస్కరణ భావాలకు ప్రతీకగా చెప్పవచ్చు. వరకట్నం ఇవ్వలేదని భర్త పుట్టింటి నుంచి తీసుకుపోకపోతే ఆ కథా నాయిక మరో వ్యక్తిని ఆదర్శ వివాహం చేసుకుంటుంది. అంటే ఈ కథలో వరకట్న దురాచారంపై విమర్శ, పునర్వివాహం అనే సంస్కరణ భర్త చనిపోయిన స్త్రీయే కాదు. భర్త తీసుకుపోకపోతే మరో వ్యక్తిని పెళ్ళి చేసుకునే ఒక సంస్కరణను ఈ కథ ద్వారా రచయిత్రి ఆశిస్తుంది. స్త్రీ స్వేచ్ఛ అవసరం అనే అంశం కూడా ఇందులో ప్రతిపాదిస్తుంది.

సురవరం ప్రతాపరెడ్డిగారి కథలు మంచి కథనంతో కూడి చమత్కారంగా ఉండి సమకాలిక జీవిత సమస్యలను ప్రతిబింబిస్తాయి. వీరి కథల్లో ఎక్కువగా పేదల శ్రమశక్తిని దోచుకోవడం, పేదలపై జరిగే అన్యాయాలు, ఆక్రమణలు నిజాం పాలనలోని దౌర్జన్యాలు, సామాజికంగా జరుగుతున్న అన్యాయాలను చిత్రించారు.

వి.ఆర్.అవధాని రాసిన తిరుగుబాటు కథ సంస్కరణను మరింత ముందుకు తెచ్చి స్త్రీవిద్య, స్త్రీస్వేచ్ఛ భావాలను ప్రతిపాదిస్తుంది. నందగిరి ఇందిరాదేవి **"పందెం"** కథ అయితే స్త్రీ పురుషుల మనస్తత్వాలు, పురుషుల పన్నాగం వల్ల బలైన స్త్రీల జీవితాలు ఇట్లా సాగుతుంది.

పొట్లపల్లి రామారావు గారి **"సమాధి స్థలము"** ఒక బీద స్త్రీ తన పిల్లవాన్ని పాతిపెట్టటానికి స్థలం దొరకక పోవడం అదేస్థానంలో విశాలంగా ఆక్రమించుకున్న సంపన్నుల సమాధులను గురించి వర్ణిస్తూ సాగుతుంది. పేదవాళ్ళ జీవితాలు చనిపోయిన తర్వాత కూడా ఎంతటి దుస్థితిని అనుభవిస్తాయో చెప్తారు రచయిత. ఇప్పటి సంపన్నుల, రాజకీయ నాయకులకు కూడా సరిపోయే విధంగా ఉంటుంది ఈ కథ. **"కాలం కన్నా ముందున్న రచయితగా పొట్లపల్లిని అభివర్ణిస్తారు కాసుల ప్రతాపరెడ్డి."**

కాంచనపల్లి చిన వెంకటరామారావు ఎక్కువగా బీదరైతుల మీద జరిగే అన్యాయాలను అక్రమాలను చిత్రిస్తూనే కథలు రాసారు. ముఖ్యంగా వీరి కథలో తెలంగాణలో దొరలు, జాగీర్దారులు, వాళ్ళ వాళ్ళ స్వార్థ ప్రయోజనాలు, మతం పాత్ర, అమాయక ప్రజలు చివరికి ఎదురు తిరగడం మొదలైన ఇతివృత్తాలతో సాగాయి. నిజానికి ఈ ఇతివృత్తాలన్నీ సంఘటనలుగా కళ్ళముందు జరుగుతున్నవే. సమకాలీన జీవితాలే. సమకాలీన వస్తువులే.

ఇక పివి నరసింహారావు గారి **"గొల్ల రామవ్వ"** కథ గురించైతే చెప్పాల్సిన పనిలేదు. ఉద్యమకారులను రక్షించుకోవడానికి, కాంగ్రెస్ కార్యకర్తలను రక్షించడానికి ఒక స్త్రీ పడ్డ తపన, ఆరాటం నిజంగా ఎంతోమంది స్త్రీలు అట్లా తమ ఉద్యమ నాయకులను, కార్యకర్తలను రక్షించుకున్న ఘటనలకు ఉదాహరణగా నిలుస్తుంది.

కథ మానవ జీవితాన్ని ప్రపంచానికి సంబంధించిన సంఘటనలను ప్రతిబింబింప చేసే దర్పణం నిజంగానే సమకాలీన జీవన ప్రతిబింబాలు తెలంగాణ కథలు అని మనం చెప్పుకోవచ్చు.

వట్టికోట ఆళ్వారుస్వామి **"జైలు"** కథలైతే ఒక సామాన్యుడి జీవితం జైలు పాలవడానికి కారణమైన వ్యవస్థను, బీదవాని ఆర్థికస్థితికి, నేరం చేయవలసిన దుస్థితిని చాలా చక్కగా చిత్రిస్తుంది. ఈ వ్యవస్థ బలవంతులది. బలవంతుల చేతుల్లో బలహీనులు ఎట్లా బాధలు పడుతున్నారో, బలవుతున్నారో ఉదాహరణగా నిలుస్తుంది. ఇప్పటికీ ఏ మార్పులేని సమాజాన్ని కూడా మనం చూస్తున్నాము.

**"యుగాంతం"** కథ నెల్లూరి కేశవస్వామి గారిది హైదరాబాదు నగరంలో అన్నదమ్ముల వలె మెలిగే హిందూ ముస్లింల మధ్య 1948 సెప్టెంబరు పోలీసు చర్య తరువాత పరిస్థితులు అప్పటిదాకా తమతో తిరిగిన మనుషులనే అనుమానించే పరిస్థితి మానవ సహజ ప్రేమానురాగాలను, ఆవేశకావేశాలను మొత్తంగా చుట్టూ ఉన్న సమాజపు చిత్రాన్ని మనకు అందిస్తుంది.

తిరుపతయ్య రాసిన **"న్యాయం"** కథ భూస్వాములకు, రైతు కూలి కుటుంబాలకు మధ్యగల సంబంధాన్ని, కూలీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని మోసంచేసే భూస్వాముల దురాగతాల్ని స్పష్టంగా తెలుపుతుంది. మల్లమ్మ, సాయిలు భార్యాభర్తలు వెంకటనర్సు, రాయలింగు వాళ్ళ పిల్లలు సాయిలు 20 ఏళ్ళనుండి పనిచేస్తున్నా కొంచెం కూడా ఎదుగుదల లేని కుటుంబం. మల్లమ్మ తల్లిగారింటినుంచి తెచ్చిన సొమ్ముతో భూమిని కొంటారు సాయిలు.

ఆ భూమిని అతి తక్కువ ధరతో సాయిలు దగ్గర నుంచి దొర శ్రీనివాసరావు కొనుక్కుంటాడు. ఈ 20 ఏండ్లలో శ్రీనివాసరావు ఆస్తి మూడింతలు అవుతుంది. పిల్లలు పెద్దపెద్ద స్థాయికి చేరుతారు. సాయిలు పెద్దకొడుకు మళ్ళీ కూలీగానే కష్టపడుతూ ఉంటాడు. ప్రతిసారీ మోసం చేసి వీళ్ళు సేద్యం చేసుకుని కష్టపడి పండించిన పంటను ఆ అప్పు ఈ అప్పు అంటూ కాజేస్తాడు దొర. ఇదంతా గమనించిన బావమరిది చిన్నకొడుకును తన దగ్గర పట్నంలో ఉంచి చదివిస్తాడు. ఉద్యోగం కూడా కుదురుతుంది. కానీ ఆ డబ్బులు కూడా దొర అప్పుకిందికే పోతాయి. ఇట్లా దొర చేస్తున్న ఆగడాలు చూడలేక విప్లవకారుడిగా మారిన రాయలింగు కథ ఇది. తెలంగాణ పల్లెల్లో వాస్తవంగా జరిగిన ఎన్నో సంఘటనల ప్రతిరూపం ఈ కథ.

చెరబండరాజు కథలు విప్లవోద్యమ కథలుగా చెప్పొచ్చు. **"చిరంజీవి"** కథ నూనూగు మీసాల వయసులో ఉన్న ఒక అజ్ఞాత విప్లవోద్యమ కార్యకర్తను ఎన్‌కౌంటర్ చేయడానికి తీసుకుపోవడంతో మొదలవుతుంది. పోలీసు జీపు, ఎస్.ఐ, కానిస్టేబుల్, విప్లవోద్యమాన్ని గురించిన చర్చలు మొత్తంగా ఆనాటి తెలంగాణ ప్రాంతంలోని ఉద్యమ తీవ్రతను, పోలీసుల అరాచకత్వాన్ని, ఉద్యమకారుల సంసిద్ధతను స్పష్టంగా తెలుపుతుంది. విప్లవకారుల నిబద్ధతను తెలుపుతుంది. ఎన్‌కౌంటర్ సమయంలో పోలీసుల మనో సంఘర్షణ **"రాంబాబు"** అనే యువకున్ని ఎన్‌కౌంటర్ చేయడం ఈ కథ సారాంశం. మన చుట్టూ ఉన్న విప్లవోద్యమ పరిస్థితులకు అద్దం పడుతుందీ కథ.

అల్లం రాజయ్య **"సంఘం"** కథ. 1970ల కాలంలో గ్రామాలలో జరిగే అన్యాయాలను గురించి స్పష్టంగా తెలుపుతుంది. లచ్చిమల్లడు అనే అతడు సంఘం ప్రోత్సాహంతో దొర వీరారెడ్డి పొలాన్ని దున్ననియ్యకుండా అడ్డుకుంటాడు. దొర కోపంతో ఊగిపోతుంటాడు. అక్రమంగా భూమి కాజేయడం, రైతుకూలీల మీద పెత్తనం, ఆరుగాలం కష్టపడినా నోటికింత బువ్వ దొరకని పరిస్థితి. వీటన్నిటికీ వ్యతిరేకంగా రైతుకూలీలు సంఘటితమై సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం ఆ సంఘం పంచాయతీ పెట్టి రైతుకూలీల శ్రమ, పంట వారికే దక్కాలని తీర్మానించడంతో పాటు దొరే లచ్చిమల్లయ్యకు అప్పు పడ్డడని చెప్పడం కొసమెరుపు. నిజంగానే తెలంగాణ పల్లెలలో జరిగిన భూమి పోరాటాలకు సాక్ష్యం ఈ కథ.

నెల్లుట్ల రమాదేవి రాసిన **"స్తన్యం"** కథ గ్రామీణ మధ్యతరగతి జీవితాలకు ప్రతిరూపంగా నిలుస్తుంది. ముఖ్యంగా తెలంగాణ పల్లెల్లో భూస్వాముల దౌర్జన్యాలకు బలైపోయే కూలీలు, రైతులు మరీ ఎక్కువగా వారి దౌర్జన్యాలను అరికట్టలేక నలిగిపోయే స్త్రీల గురించి చెప్పే కథ. అయితే రచయిత్రి ఈ కథలో భూస్వామి అయిన రాఘవరెడ్డి తన పొలంలో పనిచేసే మల్లిని బిడ్డకు పాలివ్వడానికే వెళ్ళనివ్వని సంఘటన నుంచి, దొర బిడ్డకు పాలు రాకపోవడం వల్ల తాను చీదరించుకునే ఆ మల్లి చేతనే పాలు ఇప్పించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పటిదాకా మల్లిని, మల్లి కొడుకును చీదరించుకున్న ఆ దొర రాఘవరెడ్డి, పిల్లవాడికి ఎండ రక్షణగా గొడుగు పట్టగలుగుతాడు. రచయిత్రి ఈ కథలో కొంత మార్పును కోరుకుంది. ఆ దిశగా కథ సాగుతుంది. ఇంకా ముదిగంటి సుజాతారెడ్డి, యశోదారెడ్డి వంటి రచయిత్రులెందరో సమకాలీన తెలంగాణ జీవితాలను ఉన్నదున్నట్టుగా చిత్రించారు.

వెల్దండి శ్రీధర్ రాసిన కథ ఈ కాలంలో రూపాన్ని సారాన్ని మార్చుకున్న అంగడి గురించిన కథ. కొమురడు వ్యవసాయం మీద ఆశ లేక గొర్రెలమంద కొనుక్కుంటాడు. కొమురడికి అప్పిచ్చిన సేటు అప్పు తీర్చకపోతే మందను తీస్కుపోతా అంటాడు. ఈ కథలో ఒక గొర్లకాపరి బతుకుకు రచయిత వ్యాఖ్యానం మనసును కలిచి వేస్తుంది. గుడ్డోని కన్ను మూత్తెంత? తెరిత్తెంత... అంటే గుడ్డోడిగా పుట్టిన వానికి కన్ను మూసినా, తెరిచినా ఒకటే. జీవితమే వ్యర్థమనే భావన అప్పిచ్చిన సేటుది రచయిత మాటల్లోనే నువ్వు బతుకుతేంది? సత్తేంది వాళ్ళకు అంటే ఒక మనిషిగా బీదవానిగా పుట్టడం అతని జీవనమే ప్రశ్నార్థకంగా మారిందంటాడు రచయిత.

గ్లోబలైజేషన్, ప్రపంచీకరణ నేపథ్యంలో ఒకప్పటి సంత, అంగడిలో ఎంత మంచి మానవ సంబంధాలుండేవి, అక్క, అన్న, మామ, బావా అంటూ ఇప్పుడా సంబంధాలు లేవు. ఆ విలువలు లేవు అంటూ మారిపోయిన నేటి అంగడిని మనకు చూపిస్తాడు శ్రీధర్.

దళిత వాదానికి, దళిత అస్తిత్వానికి వేదికగా నిలిచే దళిత కథ పసునూరి రవీందర్ రాసిన **"అవుటాఫ్ కవరేజి ఏరియా".** సురేష్, రజిత భార్యాభర్తలు. పట్నంలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ బతుకుతున్నారు. చుట్టు పక్కల వాళ్ళంతా రజితతో స్నేహంగా ఉంటుంటారు. కానీ వాళ్ళ అత్త ఊరినుంచి రావడం, సంభాషణలో దళితులని తెలిసిపోవడం అప్పటిదాకా పట్నంలో కులపు ఛాయలు లేవనుకొని ఆనందపడుతున్న రజిత, సురేష్‌లు ఒక్కసారిగా విభ్రాంతికి గురికావడం అప్పుడే సురేష్ రజితకు ఫోన్ చేస్తే "అవుటాఫ్ కవరేజి ఏరియా" అని వాయిస్ మెసేజ్ వినిపిస్తుంది. ఇప్పటికీ ఇంత అభివృద్ధి చెందామనుకుని చెప్పుకుంటున్న ఈ కాలంలో కూడా ఇంకా కులం అనే సమస్య పట్టి పీడిస్తూనే ఉంది అని చెప్పడం రచయిత ఉద్దేశమైతే, అది ఇప్పటికీ వాస్తవంగా కొన్ని ప్రాంతాలలో ఉన్నదనే మరిచిపోగూడదని ఈ వాస్తవాన్ని కథ చెప్తుంది.

**తాయమ్మ కథలు :** తాను తాయమ్మ కరుణగా కథల ద్వారానే సుపరిచితమైన రచయిత్రి. ఉమ్మడి కుటుంబాలు అంతరించే సమయంలో ఒక స్త్రీ తన కుటుంబంలో, కుటుంబం బయట పడ్డ కష్టాలు, పోరాటాలు తాయమ్మ పాత్రలో సృష్టిస్తుంది రచయిత్రి. తెలంగాణ ప్రాంతంలో స్త్రీలు ముఖ్యంగా కింది వర్గాలకు చెందిన

స్త్రీలు ఎట్లా కుటుంబం నుంచి, సమాజం నుంచి హింసను ఎదుర్కొంటారో ఒక స్త్రీ దృష్టికోణం నుంచి చెప్పిన కథ. యాభైఏళ్ళ తెలంగాణ సామాజిక చరిత్రకు ఇది ఒక రూపం. తరాలు మారినా మారని స్త్రీ దుఃఖాన్ని, కుటుంబం నుంచీ, సమాజం నుంచీ ఎదుర్కొని నిలబడి ఒక పోరాటయోధురాలిగా తాయమ్మను మార్చిన కథ ఇది. తెలంగాణ పల్లెల సమకాలీన జీవితాలకు స్త్రీల జీవితాలకు అద్దం పట్టే కథ ఇది.

మల్లెసాల కథల్లో భాగమైన కొక్కుల భాస్కర్ రాసిన **"తెగినపోగు"** కథ మంచి కరీంనగర్ భాష, యాసలో సాగే ఈ కథ ఒక పద్మశాలి, చేనేత కార్మికుని బతుకును అద్దంలో చూపిస్తుంది. **"గప్పుడు మా ఊళ్లె కరెంటులేదు గ్యాసునూనె దీపాలు పెట్టుకుని మాస్కుల పాట పాడుకుంటం టిక్కుంటిక్కుం అనుకుంటు"** అని మొదలైన కథ. ఆ బాలుడు దేశం పోవల్సిరావడం బతుకుదెరువుకు భివాండి, బొంబాయి, షోలాపూర్ వలస వెళ్ళిన లక్షలాది మంది చేనేత కార్మికుల జీవితాలకు దృశ్యరూపం ఇస్తుంది. బతుకుదెరువు కోసం దేశం పోయిన యువకుడి పరిస్థితి అక్కడ పట్నంలో ఎంత బాధాకరంగా ఉంటుంది. ముఖ్యంగా అంతరించి పోతున్న శ్రమ విలువ, చేనేత కార్మికుల శ్రమ దోపిడికి ఈ కథ ప్రతీక.

బర్ల మహేందర్ రాసిన **"గుడ్డిగొర్రె"** కథ ఒక ఊరి గుడ్డిగొర్రె వేరే గొర్లమందల కలిసింది. అది ఎవరిదో, ఎక్కడినుండి వచ్చిందో తెల్వదు. ఒక దొంగబుద్ధి గల బీరప్ప ఈ గుడ్డిగొర్రెను ఎవరు అడుగుతరులే కోసుకుందాం అని తన తోటి గొర్లకాపరులను ఒప్పించి కోసుకుంటాడు. కూర ఎందుకు తెచ్చినవు అని భార్యాభర్తలు గొడవ పడుతుంటారు. ఆ నోట, ఈ నోట గొర్రెను కోసిందెవరో తెలిసిపోతుంది. కొందరింకా కూర వండకుండా దాసి పెడుతరు. ఇంతలోనే గుడ్డిగొర్రె ఆసామి ఆ ఊర్లోకి వచ్చి మొరపెట్టుకుంటడు. కుల పంచాయతి పెట్టి కోసినోళ్ళకు దండుగ ఏస్తారు. ఆయనకు రెండు గొర్రెలు ఇస్తమని ఒప్పుకుంటారు. అయితే మొత్తంగా మనుషుల్లో నిజాయితీ లోపించడం అవినీతికి పాల్పడడం ఈ కథలో ముఖ్యాంశాలు. జరిగిన దొంగతనం ఎట్లాగో బయటపడుతుంది. మనుషుల స్వభావాలను ఉన్నదున్నట్లుగా చిత్రించాడు కథా రచయిత. ఇట్లాంటి మనుషుల గుంపు చుట్టూనే మనమూ బతుకుతున్నాం. అందుకే మానవ స్వభావాలను చిత్రించిన ఈ కథ సమకాలిక కథగా చెప్పుకోవచ్చు.

బంజారా తెగకు చెందిన కథా రచయిత్రి సూర్యాధనంజయ్ రాసిన **"ఝోళి"** కథలు నల్లగొండ ప్రాంతానికి చెందిన లంబాడీ తెగల జీవన పరిస్థితులను దృశ్యమానం చేస్తాయి. ఆడపిల్లలను అమ్ముకునే దుస్థితి, సంప్రదాయాలు, ఇంత నాగరిక ప్రపంచంలో ఇంకా ఆడపిల్లల పట్ల జరుగుతున్న దారుణాలను చూపిస్తాయి. ఇది ఒక సామాజిక సమకాలీన వాస్తవికత.

కథ అంటే జీవితం. సంభాషణ, సంఘర్షణ, పరిసరాలు, నేపథ్యం అన్నీ కలిస్తే జీవితం. తెలంగాణ పోరాటం జరుగుతున్న సమయంలో **"బతుకమ్మ"** కథలుగా నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధంలో వచ్చిన కథలు తెలంగాణ అస్తిత్వం పోరాటాన్ని పట్టి చూపిస్తాయి. బతుకమ్మ పండుగ తెలంగాణ వారికి ప్రియమైన పండుగ ఇందులోని స్వాతి శ్రీపాద రాసిన బతుకమ్మ కథ రెండుతరాల కథ. అమంత భర్త దేవేందర్ తొలిదశ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయాడు. తన కొడుకు ఉస్మానియాలో ఎం.ఎస్సీ చదువుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో భాగమయ్యాడు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మత్యాగం చేసుకున్నాడు. తనకిష్టమైన బతుకమ్మ పండుగ నాడు భర్తను, కొడుకును తల్చుకుంటూ తానూ బతుకమ్మగా మారిపోయిన దృశ్యం ఈ కథలో కనిపిస్తుంది.

ఇట్లా పోరాటం జరుగుతున్నప్పటి ఆ సమయాన్ని, సంఘటనలను పాత్రలుగా మలిచి రాసిన కథలెన్నో తెలంగాణ అస్తిత్వ పోరాట సమయంలో వచ్చాయి. అవన్నీ సమకాలీన జీవితానికి అద్దం పట్టేవే.

**"పహెచాన్"** హైదరాబాదు నగరంలో మనతో పాటుగా బతుకుతున్న మరో సమూహపు వ్యథను కథలుగా మలిచి మనకు అందించిన మరో రచయిత్రి డా. భారతి. గీతాంజలి పేరుతో రాసిన ఈమె కథలన్నీ హైదరాబాదు పాతనగరంలోని ముస్లింల జీవితాలలో ముఖ్యంగా ముస్లిం సమాజం వర్తమానంలో ఎదుర్కొంటున్న పరిస్థితులు చాలా గొప్పగా చిత్రించారు గీతాంజలి.

**"ఉనే నహి మాన్తే"** అనే కథ ముస్లిం భర్తల పైశాచికత్వానికి మరో రూపం. అల్లా ఇస్తున్నాడు కాబట్టి తీసుకోవాలి అనే మూర్ఖభావనలో ఎంతమందినైనా కంటూ స్త్రీలు శారీరకంగా, మానసికంగా నలిగిపోవడం ఒక వంతైతే, దుర్భర దారిద్ర్యంలో పుట్టిన పిల్లలను పెంచలేక, పోషించలేక ఆడపిల్లలైతే అరబ్బు షేకులకు అమ్మడం, మగపిల్లలైతే వాళ్ళ వయసుకు మించిన పనులు చేయించడం ఆ పనులతో సతమతమై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం ఇట్లా, మన పక్కనే బతుకుతున్న వారి జీవితాలలో లోపలి సంఘర్షణలను మనకు అందించారు గీతాంజలి గారు.

ఈ మధ్యకాలంలో వచ్చిన మరో కథల సంపుటి వియ్యుక్క కథలు. **"వియ్యుక్క"** అంటే వేగుచుక్క అని అర్థం. అజ్ఞాత జీవితంలోని రచయిత్రులు రాసిన 316 కథల సంపుటి ఇది. అజ్ఞాత జీవితాన్ని గడుపుతున్న ఈ రచయిత్రులు తాము లోపలి జీవితంలో బయట జీవితంలో ఎదుర్కొన్న జీవన సంఘర్షణలే కథలుగా మలచిన కథలివి. అజ్ఞాత ఉద్యమ జీవితం గడుపుతూ వారి జీవితాలనే కథలుగా మనకు అందించారు ఈ రచయిత్రులు.

ఉద్యమంలోకి వెళ్ళిన స్త్రీలు మాతృత్వాన్ని ఉంచుకోలేక, వదులుకోలేక పడుతున్న సంఘర్షణలు, ఉద్యమంలో స్త్రీ పురుషుల

అసమానతల గురించిన చర్చలు, అనారోగ్యానికి గురయితే, మైదాన ప్రాంతానికి రావడానికి వారు పడే కష్టాలు నిజంగా ఈ కథలన్నీ ఉద్యమ స్త్రీల జీవితాలను స్త్రీల వైపు నుంచి చూసి ఆలోచించి రాసిన కథలు.

తెలంగాణ పల్లెల్లోని ఉద్యమ వాతావరణం, ప్రదీప్, సుమ ఇద్దరు భార్యాభర్తలు ఉద్యమం కోసం అజ్ఞాతంలో పనిచేస్తున్నారు. పిల్లలను కనడం అనేది సహజమైన సామాన్యమైన విషయం అందరికీ, కానీ వద్దని నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఒక దళంలో తిరగాల్సి వచ్చినప్పుడు ఆ భార్యా భర్తల మానసిక సంఘర్షణ మనకంటూ ఒక బిడ్డ ఉండాలని కోరుకునే ఆ భార్యాభర్తల అంతర్మథనం ఈ కథల్లో అద్భుతంగా చిత్రిస్తారు రచయిత్రి. అనుకోకుండా పిల్లలను కనడం వల్ల బయటి ప్రపంచంలో చూసుకునే వాళ్ళెవరూ లేక ఒకవేళ ఉన్నా బీదరికంలో ఉన్న తమ తల్లిదండ్రులు చూస్కోలేకపోతే స్త్రీ పడే మనోవేదన, ఉద్యమాన్ని త్యాగం చేసి రావాల్సిన పరిస్థితుల్లో ఉద్యమ నిబద్ధత కలిగిన ఆ కార్యకర్త మానసిక సంఘర్షణ వంటి కథాంశాలెన్నో ఈ కథల్లో మనకు కనిపిస్తాయి. ఈ కథలన్నీ మన జీవితాలకు సమాంతరంగా మరోవైపు జరుగుతున్నవే అందుకే ఇవన్నీ మన చుట్టూ జరుగుతున్న సమకాలిక వాస్తవాలే. సమకాలీన వస్తువులే.

**ముగింపు :** సంస్కరణ కాలం నుంచి ఇప్పటి వరకు వస్తున్న తెలంగాణ కథలన్నిటినీ ఒక విహంగ వీక్షణం చేస్తే ఎంతో విభిన్నమైన వస్తువు, మంచి మాండలిక భాష, శైలిలో నూతనత్వం, ముఖ్యంగా మారుతున్న పరిస్థితులకనుగుణంగా సమాజపు మార్పులను తనలో లీనం చేసుకుంటూ వస్తువైవిధ్యంతో తెలంగాణ కథ నడిచిందని చెప్పవచ్చు.

**"స్త్రీ జీవిత సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని రచనలు చేస్తున్న కాలంలో ఒక స్త్రీ కంఠస్వరమే ఆమె రచనల్లో ఏ రకంగా వినిపించింది అనేది ఆసక్తికరమైన అంశం"** అని కె.కె.ఆర్ గారు బండారు అచ్చమాంబ గురించి రాసినట్టు ఎవరు ఆపదలో ఉంటే ఎవరు సమస్యల్లో ఉంటే వారి కంఠస్వరంతోనే కథలు రావడం తెలంగాణ కథల్లో మనం చూడవచ్చు. అందువల్లనే సాహిత్యంలో వచ్చిన అనేక వాదాలు, ధోరణులు కథల్లో స్పష్టంగా కనిపించాయి. సంస్కరణ వాదం, జాతీయోద్యమం, అభ్యుదయవాదం, విప్లవవాదం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, తెలంగాణ అస్తిత్వవాదం, వృత్తికులాల వాదం ఇట్లా అన్ని వాదాలను తనలో ఇముడ్చుకుంది తెలంగాణ కథ.

బహుశా ఈ వ్యాసంలో కొందరి పేర్లు ప్రస్తావించనంత మాత్రాన వారిని గుర్తించనట్లు కాదు. తెలంగాణ కథలు ఎట్లా సమకాలీన జీవితాన్ని పట్టుకున్నాయి, సమకాలీన దృశ్యాలను మనముందుంచాయి అని చెప్పడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం. కొందరు ప్రముఖ రచయితల పేర్లు ప్రస్తావించకపోయినా ఇప్పుడే మొలకెత్తుతున్న కొందరు రచయితల రచనలు ప్రస్తావించినా అది ఉద్దేశపూర్వకంగా కాదు. తెలంగాణ కథ సమకాలీనత జీవితానికి ఎంత దగ్గరగా ఉందో చెప్పే ప్రయత్నంలో భాగంగానే విభిన్న వర్గాల, విభిన్నకోణాల తెలంగాణ కథలను ప్రస్తావించడం జరిగింది. రచయితలందరిలో ఉన్న సమకాలీన దృష్టిని రచనలో సమకాలీనతను రేఖామాత్రంగా స్పృశించాను. ఈ వ్యాసం ముందుముందు తెలంగాణ కథలను అధునిక వాదాల దృష్టితో పరిశోధించే వారికి ఇది ఉపయోగపడుతుందని విశ్వసిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు**


1. కరుణ. తాయమ్మ కథ. 2009. హైదరాబాద్ : విప్లవ రచయితల సంఘం.
2. ఖదీర్‌బాబు, మహ్మద్. నూరేళ్ళ తెలుగుకథ. 2011. కావలి ప్రచురణలు.
3. చెరబండరాజు సమగ్ర సాహిత్యం. 2003. హైదరాబాద్: విప్లవ రచయితల సంఘం.
4. నీలాదేవి, ఎస్. అల్లంరాజయ్య కథలు పరిశీలన (1973–78). 2013. వరంగల్, ఎంఫిల్ సిద్ధాంత వ్యాసం కాకతీయ విశ్వవిద్యాలయం.
5. భారతి. పహెచాన్. 2007. హైదరాబాద్ : మట్టి ముద్రణలు.
6. భూపాల్. పొట్లపల్లి రామారావు కథలు. 2012. హైదరాబాద్ : తెలంగాణ ప్రచురణలు.
7. మహేందర్, బర్ల. శ్రీనివాస్, సంగిశెట్టి (సం.పా). గొంగడి. 2024. హైదరాబాద్ : ఫోరమ్ ఫర్ కన్సర్న్‌డ్ బీసీస్.
8. జ్వలిత (సం.పా). మల్లెసాల. 2021. హైదారాబాద్ : జెడి పబ్లికేషన్స్.
9. రజని,ఎన్. తెలంగాణ అస్తిత్వ సృజన ఇతర వ్యాసాలు. 2020. హైదరాబాద్ : రజని పబ్లికేషన్
10. వేణుగోపాల్, అమ్మంగి. సాహిత్య సందర్భం–సమకాలీన స్పందన. 2012. నల్లగొండ : జయమిత్ర పబ్లికేషన్.
11. శివశంకర్, పాపినేని. నవీన్, వాసిరెడ్డి (సం.పా). కథ 93. 1994. హైదారాబాద్ : కథాసాహితి ప్రచురణలు.
12. సుజాతరెడ్డి, ముదిగంటి. తొలితరం కథలు. 2002. హైదరాబాద్ : రోహణమ్ పబ్లికేషన్స్.
13. సూర్యా ధనంజయ్. ఝోళి. 2022. హైదరాబాద్: శ్రీమన్ గ్రాఫిక్స్.


❖ ❖ ❖ ❖ ❖

## ఆదిత్య హృదయ మహిమ

**"రశ్మిమన్తం సముద్యన్తం దేవాసుర నమస్కృతమ్**
**పూజయస్వ వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్"**

**సముద్యన్తుడు :** ప్రయోజనాత్మకంగా పైవైపుగా లేచి పయనిస్తున్న వాడు అని శబ్దానికి సరియైన అర్థం. సహజంగా భాస్కరునికి ఉదయాస్తమయాలు లేవు. కానీ మనకు ఉన్నట్లు అనిపిస్తుంది. కాబట్టి ఈ శబ్దానికి సర్వకాల సర్వదేశ సర్వప్రాణి కోటికీ మేలు చేయడానికి సిద్ధంగా ఉండడమే శీలం అయినవాడు అనే అర్థాన్ని గ్రహించాలి. కాబట్టి మానవుడు సిద్ధాన్నం వంటి ఆ ఆదిత్యుని అనుగ్రహాన్ని అందుకోవటానికి తన్ను తాను సిద్ధం చేసుకోవాలి అని తాత్పర్యం.

**దేవ + అసుర, నమస్కృతుడు :** మర్త్య లోకానికి పై భాగంలో ఉండే దేవతలూ, క్రిందివైపుగా ఉన్న నరకవాసులయిన అసురులూ కూడా ఆయనకు నమస్కరిస్తూ ఉంటారు. అంటే ఇంక మానవుల సంగతి చెప్పనక్కర లేదు కదా! ఇక్కడ భావించవలసిన అంశం ఒకటి ఉంది. దేవభూమి పుణ్యఫల అనుభవానికి మాత్రమే సంబంధించినది. అక్కడకు చేరుకొన్న తర్వాత క్రొత్తగా సంపాదించే కర్మఫలం ఏమీ ఉండదు అని శాస్త్రాలు చెబుతున్నాయి. అయితే దేవతలు సూర్యభగవానునకు నమస్కరించి సాధించినదేమిటి? అలాగే అసురులు. వారు 'సుర' లేనివారు. అసువులను – ప్రాణములను, లాగివేసేవారు. అట్టివారు సూర్యభగవానునికి నమస్కారం ఎందుకు చేస్తారు? వీరూ, వారూ నమస్కరిస్తే ప్రకృతంలో శ్రీరామచంద్రునకూ, అతనిని నిమిత్తంగా చేసుకుని ప్రవర్తించే మనుష్యులకూ కలిగే ప్రయోజనం ఏమిటి? అని మూడు ప్రశ్నలు మనముందు నిలుస్తున్నాయి. మన మనస్సు తప్పనిసరిగా సమాధాన పడాలి.

శ్రీమహాభాగవతంలో ఒక అందమైన పద్యం ఉంది.


**ధీరులు, నిరపేక్షులు నా**
**త్మారాములు యోగివరులు హరిభజనము ని**
**ష్కారణమ చేయుచుందురు**
**నారాయణుడట్టివాడు నవ్యచరిత్రా!** (ప్ర.స్కం. 138)


ఇది చాలా గంభీరమైన భావనతో నిండిన మహావాక్యం. కొన్ని విషయాలకు సంబంధించి 'ఎందుకు'? అనే ప్రశ్నయే పుట్టగూడదు. దానినే నిష్కామ కర్మము అంటారు... (సశేషం)

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

❖ ❖ ❖ ❖ ❖

## సత్సంగం





### సద్గురువు

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరంబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః**

గురుడే బ్రహ్మ, విష్ణువు, శివుడు. గురు పరబ్రహ్మ స్వరూపుడు. బ్రహ్మవలెనే గురువు కూడా మనలను నూతన వ్యక్తిగా రూపొందిస్తాడు. శివుని వలె గురువు లయమొనరిస్తాడు. అంటే మన వాసనలను నాశనం చేస్తాడు. విష్ణువు వలె మనలను అన్ని విధాలా కాపాడుతాడు. నిలుపుతాడు. అందువల్లనే గురువు బ్రహ్మ, విష్ణువు, శివుడు. నిజానికి గురువే పరబ్రహ్మ. గురువు మనకి బయట ఉన్నట్టనిపిస్తుంది. కాని నిజానికి లోపలే ఉంటాడు. "భగవంతుని అనుగ్రహానికి మానవాకారం గురువు" అన్నారు శ్రీ భగవాన్. మన పరిమిత బుద్ధితో ఆయన అనుగ్రహాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేం. మనలో ఏమి జరుగుతోందో మనకి తెలియదు. పొయ్యిమీద నీటిని కాచడానికి పెట్టితే, నీరు వేడెక్కుతుంది. కొంతసేపు ఏమీ జరగనట్టే ఉంటుంది. ఉన్నట్టుండి నీటి బుడగలు కనబడుతాయి. నీరు మరుగుతుంది. మనకి బయటకు కనబడక పోయినా, బుడగలు ఏర్పడే ముందు, నీటిలో ఏదో జరుగుతూనే ఉంది. ఆ విధంగానే, గురు కటాక్షం వల్ల మనస్సులో ఏమి జరుగుతుందో గ్రహించడం కష్టం. ఏమీ జరగటం లేదని మనం అనుకుంటాం. కాని ఏదో జరుగుతూనే ఉంటుంది. వారిని స్మరిస్తున్నామంటే వారి అనుగ్రహం లేనిదే సంభవం కాదు. మాణిక్క వాచకర్ అనే తమిళ శివభక్తుడు ఇట్లా అన్నాడు. "ఆయన లోపలా ఉన్నాడు, బయటా ఉన్నాడు. నిన్ను అంతర్ముఖుణ్ణి చేయడానికి అనుకూలమైన పరిస్థితులను కల్పించటమే కాక, నిన్ను కేంద్రం వైపు తీసుకొని వెళ్ళడానికి అంతరంగాన్ని కూడా అనువుగా చేస్తాడు. నీవు కేంద్రంలో సంస్థితమవటానికి వీలుగా బయట నుండి ఒక తోపు తోస్తాడు." "గురువు భగవంతునికీ, ఆత్మకీ భిన్నం కాదు. వారిని భౌతికదేహానికి పరిమితం చేయకూడదు. వారు పరిధి అంటూ లేని కేంద్రం బిందువు వంటివారు. వారి ప్రభావం భక్తుని లోనికి మౌనంగా చొరబడుతుంది. అనుగ్రహానికి ఉత్తమ రూపం మౌనం. అదే ఉత్తమమైన ఉపదేశం కూడా... ఇతర ఉపదేశ పద్ధతులన్నీ మౌనం నుంచి వచ్చినవే. అందుచే అవి అంత ప్రధానమైనవి కావు. మౌనమే ప్రధానమైన మార్గం. గురువు మౌనంగా ఉంటే సాధకుని మనస్సు దానంతట అదే పరిశుద్ధమవుతుంది." అన్నారు శ్రీ భగవాన్.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9  UGC CARE List Approved Journal
హైదరాబాద్ జులై : 2024

# మానస సరోవరంలో స్వర్ణహంస – ప్రతీకాత్మక కావ్య విశిష్టత

**ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ**, తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం. ఫోన్ : 9491420180

**వ్యాస సంగ్రహం**

ఆధునికాంధ్ర తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధులైన కవి విమర్శకులలో ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారు ఒకరు. కత్తికి రెండు వైపులా పదునున్నట్లు సాహిత్యలోకంలో కవిగా, విమర్శకులుగా తమ ప్రతిభాశక్తిని ప్రదర్శించి, ప్రసిద్ధి పొందిన వాళ్లు చాలా తక్కువమందే కనిపిస్తారు. తెలుగులో రాయప్రోలు, విశ్వనాథ, శ్రీశ్రీ, శేషేంద్రశర్మ, సుప్రసన్నాచార్యులు, సంపత్కుమారాచార్యుల వంటి ఉద్దండులు మనకు దర్శనమిస్తారు. వీరి సరసన నిలబడదగినవారు ప్రముఖ కవి, విమర్శకులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు.


వీరభద్రయ్య గారు తెలుగు సాహిత్య విమర్శకు చేసిన కృషి ఒక ఎత్తయితే, మరోవైపు సృజనశీలిగా కవిత్వం, కథలు, జీవిత చరిత్ర, తాత్త్విక అంశాలు కావ్యాలుగా రాయటం మరో ప్రత్యేకత. ఈ పరంపరలో భాగంగా వీరు వెలువరించిన **"మానస సరోవరంలో స్వర్ణ హంస"** అనేది ఆధునిక కావ్యం. ఇందులో కవినీ, కవిత్వ ఆవిర్భావాన్ని, కవిత్వ లక్షణాలను, కవితా ధారను, కవిత్వ శక్తిని, ప్రయోజనాన్ని పరబ్రహ్మ స్వరూపాన్ని, కవి నిస్వార్థతను, జ్ఞానం గురించి మొత్తంగా కవిత్వ ఉత్పత్తి, కవిత్వ అభివ్యక్తిని గురించి ఎలా ప్రతీకలతో కవితాత్మకంగా వివరించారో తెలియజేయటమే ఈ వ్యాస ఉద్దేశం.

ఆది శంకరుల 'సౌందర్య లహరి' లో ప్రస్తావించిన అంశాలను వీరభద్రయ్య గారు ఎలా మూలంగా స్వీకరించారో కవి హృదయం నుండి ఒక కవిత లేదా కావ్యం వెలువడాలంటే దాని వెనుక ఎన్ని దశలు, అవస్థలను దాటుకొని ఎలా ఒక కావ్యంగా రూపుదిద్దుకుంటుందో అలా రూపుదిద్దుకునే క్రమాన్ని రచయిత తన కావ్యంలో ఎలా అభివ్యక్తీకరించారో తెలుపటం ఇందులో ప్రధానం. ఈ వ్యాసాన్ని విశ్లేషణాత్మక పద్ధతిలో వివరించటం జరుగుతుంది.

**కీలక పదాలు :** మానససరోవరం, స్వర్ణ హంస, శ్వేత హంస, దీధితులు, కాదంబాలు, ఊషర క్షేత్రం, పరబ్రహ్మ

**ఉపోద్ఘాతం**

**"ప్రాణం లేని మాటల రాశికాదు**
**మినుకు మినుకుమంటూ కొడిగట్టిన దీపాన్ని**
**జాజ్వల్య మానం చేసే ప్రాణచైతన్య ప్రదాత**
**దీపం – జ్యోతి – కవిత.**
**తనను దాటి సర్వమూ తానుగా వ్యాప్తి చెందితేనే**




**శబ్దానికి ప్రాణం, కవితకు చోదక శక్తి.**
**పరివర్తింపజేసే మహాశక్తి దివ్యశక్తి**
**ఇది సృజించేదే! కవితా హంస – స్వర్ణహంస.**
**(మానస సరోవరంలో స్వర్ణ హంస, పుట. 31)**

కవిత్వ శక్తిని గురించి, అది రగిలించే చైతన్యాన్ని సమాజానికి ఒక చోదక శక్తిగా ఎలా ప్రభావం చూపుతుందో పై వాక్యాల్లో చక్కగా ఆవిష్కరించారు. కవిత్వం ఎందుకింత శక్తివంతంతో కూడుకొని ఉంటుందంటే కవి దర్శనం ఒకనాటిది కాదు. నిరంతరం అతని హృదయం అంతరాంతరాలలోకి, రవి కాంచని చోటున కవి చూపులు ప్రసరిస్తూనే ఉంటాయి. ఆ ప్రసరించే చూపులకు ఎన్నో రోజుల ఫలశ్రుతిగా ఒక కవిత్వం కావ్యం ఆవిష్కృతమవుతుంది. అలా ఆవిష్కృతమైందే ముదిగొండ వీరభద్రయ్య గారి 'మానస సరోవరంలో స్వర్ణ హంస' కావ్యం. ఇందులో వస్తువు సూటిగా గాక కొన్ని ప్రతీకల ద్వారా, ధ్వని గర్భితంగా, తాత్త్విక దృష్టితో కవిత్వీకరించారు. వీరు కవిత్వీకరించిన వివిధ అంశాల గురించి, పరబ్రహ్మ స్వరూపాన్ని గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

**కవి పరిచయం :**

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్లులో ఒక సాంప్రదాయ సంగీత విద్వాంసుల కుటుంబంలో 1942లో జన్మించారు. వీరు 1967 నుండి డిగ్రీ కళాశాల అధ్యాపకులుగా పని చేశారు. 1988 నుండి 2004 వరకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో వివిధ హోదాలలో ఆచార్యులుగా విధులు నిర్వర్తించి, పదవీ విరమణ పొందారు. 2007 నుండి 2014 వరకు అనంతపురం జిల్లా పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లో తన సేవను అందిస్తూ సత్యసాయి సన్నిధిలో అవిశ్రాంత జీవితాన్ని

గడుపుతూ విస్తృత సాహిత్యాన్ని వెలువరిస్తున్నారు. వీరు వెలువరించిన గ్రంథాలు దాదాపు 60కి పైగా ఉన్నాయి. వీటిలో ప్రధానంగా విమర్శ గ్రంథాలు, శాస్త్ర గ్రంథాలు, అనువర్తిత విమర్శలు, ప్రతీకవిమర్శలు, పీఠికలు, సంపాదకీయాలు, సమకాలిక విమర్శకులపై రాసిన విమర్శనా గ్రంథాలు ఉన్నాయి. వీరు నాణేనికి మరోవైపు విమర్శకులు మాత్రమేకాదు, కవి, సృజనశీలురు.

**ప్రధాన రచనలు**

రసభావచిత్రాలు, మేజర్ క్రిటిక్స్ ఆఫ్ మోడర్న్ తెలుగు లిటరేచర్, సూత్రం– అన్వయం, విమర్శ – మౌలికాంశాలు, కళాతత్త్వశాస్త్రము, మట్టి మనిషి ఆకాశం–వస్తు సంవిధానాలు, విశ్వనాథ సాహిత్య తత్త్వ వివేచన, రావిశాస్త్రి గారి ధర్మేతిహాసం, మూడు కథల బంగారం, నవలా – నవలా విమర్శకులు, మొ॥న విమర్శ గ్రంథాలు వెలువరించారు. వీటితో పాటు సృజన రచనలు 'కేమోమిల్లా' కథల సంపుటి, భగవాన్ శ్రీ రమణ మహర్షి జీవిత్ర చరిత్ర, మొ॥న రచనలు వెలువరించారు.

**మానవ సరోవరంలో స్వర్ణహంస – ప్రతీకాత్మకత**

"కవి తాను చెప్పదలచుకున్న అంశాన్ని ప్రత్యేక వివరణ లేకుండా ఆ విషయాన్ని లేదా వస్తువును ప్రతిబింబించే ఇతర విషయాల ద్వారా, ఇతర వస్తువుల ద్వారా వివరించడాన్ని 'ప్రతీకాత్మకత' అంటారు. వీలయినంత సంక్షిప్తంగా చాలా తక్కువ మాటలలో చెప్పదలుచుకున్న విషయాన్ని తగినశక్తితో చెప్పడం కోసం ఈ ప్రతీకాత్మకతను అనుసరిస్తారు.

ముదిగొండ గారి ఈ కావ్య ప్రత్యేకత గురించి ఇలా వివరించుకోవచ్చు. ఈ కావ్య నామాన్ని గమనించిన్నట్లయితే ఇది సాధారణ కావ్యం కాదని, ఈ పేరు వెనుక తాత్విక, ఆధ్యాత్మిక, భౌతిక అంశాలను ప్రత్యేకంగా మలుచుకుని పెట్టిన పేరని ఈ కావ్య ప్రారంభ పంక్తులను గమనించిన్నట్లయితే తెలుస్తుంది.

**మానస సరోవరంలో "శ్వేత హంస"**
**సమస్త జ్ఞాన రాశికి సుందర ప్రతినిధి.**
**ఆమె దీధుతులలో ఒక దాని నుంచి**
**నిర్గమించినదే "స్వర్ణహంస"** అని తెలిపారు.

ఇందులో ప్రస్తావించిన మానస సరోవరం, శ్వేత హంస, జ్ఞానరాశి, దీధితులు, స్వర్ణహంస, మొ॥ పదాలను అర్థం చేసుకుంటే ఇందులో కవి ఉద్దేశించిన ధ్వన్యార్థం మనకు అవగతమవుతుంది. ఈ ప్రతీకల వెనుక ఉన్న ఆంతర్యం బోధపడుతుంది.

"మానస సరోవరం' అనుపదాన్ని కవి ప్రస్తావించాడు. ఇది ఎక్కడ ఉంది? భౌతికంగా ఆలోచిస్తే ఇది హిమాలయ పర్వత శ్రేణుల్లోని కైలాస గిరుల్లో ఉందని, పరమశివుడు కొలువై ఉండిన ప్రాంతంలో ఉందని, మన కావ్యాలలో అభివర్ణించారు. ఇదే విషయాన్ని ఈ ప్రాంతాన్ని సందర్శించిన వారు చెప్పడం మనం చదవడం, తెలుసుకోవడం విదితమే. ఈ సరస్సులో 'స్వర్ణహంస' మాట ఏమిటి? అంటే పూర్వపు కావ్యాలలో కవులు మానససరోవరం వంటి, గంగానది వంటి స్వచ్ఛమైన నీటి ప్రవాహాలలో రాయంచలు తిరుగుతుండేవని, ప్రయాణించేవని కవుల వర్ణన. నిజానికి ఈ కావ్య శీర్షికను తాత్విక, ఆధ్యాత్మిక, భౌతిక అంశాలను ప్రతీకాత్మకంగా తీసుకుని పెట్టిన పేరని, ఈ మూడు అంశాల మేళవింపుతో రాసిన కావ్యంగా దర్శనమిస్తుంది. భారతీయాలంకారికులు పేర్కొన్నట్లు.. **"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః యదాస్మై రోచతే విశ్వం తదేవం పరివర్తతే"** అన్నట్లు "ఈ కావ్యసృష్టికి బ్రహ్మ వంటి వాడు కవి" అన్నారు. తాత్వికార్థంలో ఉపయోగించిన ఈ పదాలు నిజానికి బ్రహ్మ లోక సంబంధమైనవి. ఈ అంశాలను కవి తన హృదయంలో ఆవిష్కరించుకొని తన అనుభవానికి వచ్చిన అనుభూతులను ఇలా వెల్లడించాడని తెలుస్తుంది. ఇందులో పేర్కొన్న మానస సరోవరం 'భౌతికంగా చాలా ఉన్నతమైన ప్రదేశంలో శ్రేష్ఠమైన, స్వచ్ఛమైన సరస్సు అనేది అందరికీ విదితమే. అయితే ఇక్కడ కవి భావన ఏమిటి? అని ఆలోచిస్తే **"మనిషిలోని మనసు అనేది మానస సరోవరం"** అని అర్థం చేసుకోవచ్చు. సమస్త జ్ఞానరాశికి అందమైన హంసలు తెల్లగా ఉంటాయని కవులు పూర్వ కావ్యాలలో ప్రస్తావించారు. హంస పాలను, నీటిని వేరు చేయడంతో పాటు స్వచ్ఛతకు, నిర్మలత్వానికి, జ్ఞానానికి, కీర్తికి ప్రతీకలు. అలా స్వచ్ఛమైన, కాంతివంతమైన హంసలలో ఒకదాని కిరణాల అంశతో స్వర్ణహంస దిగివచ్చింది. ఈ స్వర్ణహంస ఎలా, ఏ రూపంలో ఉంది అంటే –

**"కవిత్వ శిశువుకు ప్రతినిధి**
**లోక క్షేమం కోసం భువికి**
**దిగవచ్చిన రమణీయ బాల"** అన్నారు.

అందమైన, చూడముచ్చటైన, వినసొంపైన పలుకులు ఇంకా ఇంకా చూడాలనే రూపును కలిగిఉంటుంది. బాలిక హృదయం ఏ మాలిన్యం అంటని, స్వార్థం కపటం తెలియనీదై స్వచ్ఛంగా భూలోకానికి దిగివచ్చిన కవిత్వం. కవిత్వం యొక్క విశిష్టతను 'రమణీయ బాల' అను వాగ్రూప పదాలలో అభివ్యక్తీకరించారు. బహుశ ఈ భావనను జగద్గురు ఆదిశంకరాచార్యుల 'సౌందర్య లహరి' నుండి స్వీకరించి ఉండవచ్చని తోస్తుంది.

**"సమున్మీలత్సంత్వవిమల మకర కరసికం**
**భజే హంస ద్వన్ద్వం కిమపి మహతాం మానసచరమ్**
**యదాలాపా దష్టాదశ గుణిత విద్య పరిణతి**
**ర్యద దత్తే దోషాద్గుణ మఖిల మద్భ్యఃపయ ఇవ" – 38**

**తాత్పర్యం :** ఓ తల్లీ! ఏ హంస మిథునం పలికిన పలుకులన్నీయు అష్టాదశ విద్యలుగా మారుచున్నవో ఏ జంట దోషముల నుండి

గుణమును, నీటి నుండి పాలను వేరు చేసి గ్రహించునో వికసించిన జ్ఞానమనెడి కమలములందలి మకరందములు గ్రోలి మైమరిచియున్న యోగుల హృదయమను మానస సరస్సున ఉన్న అనిర్వచనీయ మహిమగల శివ శివాత్మకమనెడు హంస మిథునమును నేను సేవింతును అని తెలిపారు. ఈ భావనను స్వీకరించి వీరభద్రయ్య గారు తనదైన శైలిలో ఒక కావ్యాన్ని సృజించి వివిధ అంశాల పట్ల తన అభిప్రాయాల్ని వెల్లడించాడని అవగతమౌతుంది. ఈ శ్లోకంలో తెలిపిన సంవిత 'సత్'శివుడు. సకల విద్యలు అనేవి 'చిత్' లోని కవిత్వాది సకలకళలు. ఆ మిథున జంట బహుశా శివ పార్వతులనే రెండు హంసలు ప్రతీకలుగా పునః సృజన చేసినట్లు చెప్పడంలో ఈ తత్వం ఉందనిపిస్తుంది. ఇందులో మహాత్ములు అంటే యోగిజనులు. వీరి మనస్సు నిశ్చలంగా ఉంటుంది. కలగూర గంప వంటి ఆలోచనా తరంగాలు లేని నిశ్చల సరస్సులాంటిది మానస సరోవరం అనే భావనను ఆచార్య వీరభద్రయ్య గారు గ్రహించి ఉండవచ్చు. ఈ ప్రతీకలు పురాణ సంబంధ నేపథ్యంలోనివి అయినా కొత్త అర్థాలను పొదువుకొని, అవి సృజనకు, లోతులను, గాఢతా గాంభీర్యాలను వివరిస్తున్నాయని ఈ కావ్యంలో అభివ్యక్తీకరించిన అంశాలను బట్టి అవగతమౌతుంది.

**కవి – కవిత్వ ఉత్పత్తి :** కవిని గురించి, కవిహృదయాన్ని, ఔన్నత్యాన్ని, కావ్య సృష్టి గురించి భారతీయ అలంకారికులు నిర్వచించారు. వీరు పేర్కొన్న లక్షణాలను పొదువుకొని వీరభద్రయ్య గారు తనదైన శైలిలో ఈ కావ్యంలో ఇలా అభివ్యక్తీకరించారు.

**"బొమికలలాంటి నిర్జీవ శబ్దాలకు**
**ప్రాణం పోసి మరలా జన్మనిచ్చే**
**మహత్కళ కవికి మాత్రమే తెలిసిన విద్య"** కానీ తనకు తెలుసునన్న విషయం తెలియని అమాయక చక్రవర్తి కవి అని భౌతిక ప్రపంచంలో మనం నిత్యం చూస్తున్న, విషయాలు, ఉపయోగిస్తున్న వస్తువులు, కవి చేతిలో ప్రాణాన్ని పోసుకొని సజీవత్వాన్ని పొంది 'జీవత్కళను సంతరించుకొని ఒక సందేశా న్నిచ్చేవిగా, సజీవమైనవిగా దర్శింపచేయటం కవి ప్రతిభ. తన ప్రతిభా పాటవాల గురించి, నైపుణ్యం గురించి ఏమాత్రం తెలియని అమాయక చక్రవర్తి అని కవి మనస్తత్వాన్ని అభివర్ణిస్తున్నాడు. కవి ప్రతిభా పాటవాల గురించి మరోచోట –

**"మానవ సమాజంలో ఉన్నవన్నీ**
**ప్రకృతిలో ఉన్న వన్నీ మనుషులలో**
**దర్శించగలిగిన ప్రజ్ఞావంతుడే కవి.**
**మాసిన మనస్సు ఉతికి ఆరేయగలిగిన ప్రజ్ఞ ఇతనిది.**
**ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభా మతః**
**తదను ప్రాణానా జీవద్వర్ణనా నిపుణః కవిః"** అన్నట్లుగా మానవ సమాజంలోని బాధలు, కష్టాలు, ఇబ్బందుల్ని, ప్రకృతికి ఆపాదించడం, ప్రకృతిధర్మాలను, నిస్వార్థాన్ని, త్యాగాన్ని, స్వచ్ఛత, పరోపకారం వంటి సుగుణాలను, ధర్మాలను, మానవ సమాజానికి తన ప్రతిభ చేత అన్వయించి, నూతన సృష్టి చేసి కావ్య జగత్తులో తాను ఏమి ఆశించాడో ఈ సమాజం ఎలా ఉండాలని కాంక్షించాడో తన నైపుణ్యంతో వర్ణించి ఒక సందేశాన్నిస్తాడనే సత్యాన్ని చక్కగా కవి ఆవిష్కరించాడు.

**కవితావిర్భావం**

కవిత లేదా కావ్యం అనేది ఒక్కసారిగా ఆకాశం నుండి ఊడిపడినట్లుగా హృదయం నుండి ఒక్కసారిగా అభివ్యక్తం కాదని, దాని వెనుక చాలా నేపథ్యం ఉంటుందని.

**"కాస్తంత ఓపిక పట్టి అంతరంగంలో**
**కొంతకాలం ఊరబెడితే**
**అదే అనుభవం అనుభూతి అయి**
**కళాఖండమయి అందరినీ తట్టి లేపుతుంది**
**పల్కరిస్తుంది, ఓదారుస్తుంది, ఏడిపిస్తుంది, పరుగెత్తిస్తుంది.**
**చివరకు అందరికోసం నిలబెడుతుంది"** అని కవితావిర్భావాన్ని ఆవిష్కరించాడు. మానవ హృదయం సహస్ర తంత్రులతో కూడుకొని ఉంటుందని, ఈ తంత్రులు శ్రుతి లేకుండా, తుప్పెక్కి ఉండకూడదని ధ్వని గర్భితంగా ఆవిష్కరించాడు. ఇందులో పేర్కొన్న తంత్రులు తంత్రులు (తీగలు)కావని శ్రుతి లేనితనం, కోరిక ఇచ్ఛ, ఆకాంక్ష, సహకారం లేనితనం నుండి చైతన్యునిగా, సహృదయునిగా మార్చి ఏమేమి చేస్తుందో చక్కగా అభివ్యక్తీకరించాడు.

**కవితాశక్తి**

**కవి మాటల మంటలు మాత్రం**
**రాక్షసత్వాన్ని, పైశాచికత్వాన్ని,**
**దానవత్వాన్ని, దైత్యత్వాన్ని,**
**పాశవికత్వాన్ని, అమానుషత్వాన్నీ**
**క్రౌర్యాన్ని, సైతానిత్వాన్ని మండించి భస్మం చేస్తది.**

కావ్యం ఈ లోకాన్ని మేల్కొల్పుతుంది, మారుస్తుంది. సంస్కరిస్తుంది. జీవిత కుసుమానికి కొత్త పరిమళాలనద్దుతుంది.

ఈ వాక్యాలలో కవి కలం నుండి వెలువడిన మాటలకు ఎంత శక్తి ఉందో తెలియజేశాడు. అందుకే పెద్దలు "కత్తి కన్నా కలం మిన్న" అన్నారు. కత్తితో చేయలేని, సాధించలేని పనులు కలంతో, కలం నుండి వెలువడిన మాటలనే ఈటెలతో సాధించవచ్చని పెదల ఉవాచ. ఇది అక్షర సత్యమని అనేక సాహిత్యాలు వివిధ సందర్భాలలో పోషించిన పాత్రలను బట్టి తెలియవస్తుంది. అంతేకాదు మనుషుల మనసుల్లో నిగూఢంగా ఉన్న వివిధ అవలక్షణాలను, మండించి భస్మం చేసే శక్తిని కవిత్వం కలిగి ఉందని అభివ్యక్తీకరించారు.

కావ్యం రాయాలనుకున్న కవికి ఉండవలసిన లక్షణాలను వీరభద్రయ్య గారు ఈ క్రింది వాక్యాలలో చక్కగా ఆవిష్కరించారు.

**"శాంత చిత్తం సమాధిగత చిత్తం ఋషిదర్శనం ముఖ్యం**
**అంతరంగ యాత్ర చేయాలన్న వేడి కోరిక లేనిదే**
**ఏ కవితా శిశువూ భూమి పైకి రాదు**
**శివుని మనస్సు లాంటి మానస సరోవరంలో తరంగాలుండవు**
**వీణా వాదన లోలుడైన శివ మనోవిథమది**
**కవితా భాగీరథి అలాంటి చోటనే జన్మిస్తుంది.**
**లోక వస్తువు ఆనంద రామణీయకాలను పొందేది**
**ఈ నిశ్చల మానస సరోవరం లోనే**
**అమనస్సరోవరంలోనే! కాదంబాలు హంసలయ్యేది...** అని కవి కవితావరణం చేయాలంటే కచ్చితంగా అంతరంగ యాత్ర చేయాలని, అప్పుడే మనస్సనెడి భాగీరథి నుండి కావ్యం జనిస్తుందని, అది ఆనంద రామణీయకత్వాన్ని పొందుతుందని కవిత్వీకరించారు.

కావ్య సృజన

**హృదయ క్షేత్రాన్ని దున్ననిదే**
**ఏ బీజమూ అంకురించి వృక్షం కాదు ..**
**మానవ హృదయాలను దున్నుతుంది**
**సద్గుణ సస్యాలను పండిస్తుంది** "కావ్యమని" తెలిపారు.

**"కావ్యం జీవితమేకాని అది నూతన సృష్టి**
**తాను బ్రతుకుతున్న జీవితంలోని**
**అనేకానేక అనుభవాలను**
**అనుభూతి సస్యాలుగా పండించే**
**విచిత్ర విశేషసృష్టి అది.**
**అంతేగాని అది అనుభవాల డైరీ కాదు"** అనుభూతుల బంగారు గని "కావ్యమనీ"తెలియజేశారు.

ఉత్తమ కావ్యం కవిత్వం ఏది అనబడుతుంది అనేదానికి సమాధానంగా "కవిత కవిత కావాలి... మాటల కుప్పకాదు" మాటలకు రంగు రుచి, వాసనలు ఉంటాయనడంలో ధ్వని అర్థాన్ని గుర్తు చేస్తున్నారు. కవితావరణం జరగాలంటే కవి అంతరంగ యాత్ర చేయాల్సిందే తెలియజేశారు. అలాగే –

**పరబ్రహ్మ తత్వం**
**జీవ రాశులను నడిపించే హంస**
**అవుతుందా ఈ బ్రహ్మ హంస**
**శరీర జీవత్ కాలంలోనే ఈ హంసను**
**తెలిసికోవడమెట్ల, గ్రహించడమెట్లా?.**
**హంస రూపొందించిన బ్రహ్మ ఊహయే సృజనరీతికి మూలమా? ఆదర్శమా!** అనే వాక్యాల్లో అభివ్యక్తీకరించారు.

కవిత్వ లక్షణం మానవుని చైతన్య పరచడం, శ్రామికులు, బడుగు బలహీనులను తట్టి లేపి ఊపిరినిచ్చి ప్రజ్వలింపజేయడం. ఈ విషయాన్ని కవి –

**"నోరు లేని జీవచ్ఛవాలలో**
**అన్నీ దోచబడి కొన ఊపిరితో ఉన్న**
**బడుగు జీవులలో సగటు మానవులలో చైతన్యాన్ని రాజేస్తుంది**
**నివురు గప్పిన మానవీయతను ప్రజ్వరిల్లచేస్తుంది"** అని తెలిపారు.

**ముగింపు :** కవి విమానంలో తన గమ్యస్థానాన్ని చేరుకోగానే తాను గౌరీశంకర శిఖరంపై వాలుతానని అక్కడ ఈ భూలోక భయంకర దృశ్యాలు ఏవీ కనిపించవని తెలిపారు అక్కడి దృశ్యాన్ని గురించి –

**"పరమ నిశ్శబ్దం**
**తరంగాలు లేని మానస సరోవరం.**
**మనస్సుకు ఎంతో పైన ఉన్న మహత్ భూమిక**
**అధిరోహించగలిగిన ధీర కవి వాక్కు చీకటి గుణాలను**
**మార్చి వెలుతురు గుణాలుగా చేస్తుంది."** అనే వాక్యాలతో ఈ కావ్యాన్ని ముగించారు. శ్వేత హంస నుండి స్వర్ణ హంసను సృష్టించగలిగిన ధీరకవి వాక్కు సమాజంలోని చీకట్లను తొలగించి, వెలుతురు కిరణాలను ప్రసాదిస్తుందని కవి ఉద్దేశం.

ఈ విధంగా ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారు 'మానస సరోవరంలో స్వర్ణ హంస' అను ఈ ఆధునిక కావ్యంలో శబ్దం పుట్టుక మొదలు అది ఎన్ని పరిణామాలకు లోనై కవిత్వంగా కావ్యంగా రూపొందుతుందో, రూపొందే క్రమంలో ఎన్ని దశలను దాటి అనుకున్న ఆకారాన్ని రూపుదాలుస్తుందో చక్కగా అభివ్యక్తీకరించారు. ఇందులో ప్రధానంగా కవిత్వ ఉత్పత్తి, కవిత్వ అభివ్యక్తుల నేపథ్యంగా సాగిన కావ్యమని విదితమవుతుంది. ఇందులో సమాజంలోని వస్తువు కవి చేతిలో ఎలా కళారూపాన్ని కావ్యరూపాన్ని పొందుతుందో, దాని లక్షణం, ప్రయోజనం ఏమిటో కవిత్వ గమ్యమేమిటో చాలా స్పష్టంగా ధ్వని గర్భితంగా మరికొన్ని సందర్భాలలో ప్రతీకాత్మకంగా తెలియజేసి తెలుగు సాహిత్యలోకంలోని కవి విమర్శకుల్లో మంచి స్థానాన్ని సంపాదించుకున్నారనడంలో అతిశయోక్తి లేదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. ఆది శంకరాచార్యుల సౌందర్య లహరి– వావిళ్ల రామస్వామి అండ్ సన్స్– చెన్నపురి
2. నళిని ఎస్. ఎస్. సాహిత్య పదాల డిక్షనరీ
3. హనుమంతు రావు కోమరవోలు (సంకలనం) విమర్శకునిగా ముదిగొండ వీరభద్రయ్య–కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు –2023
4. డా.ద్వానా శాస్త్రి తెలుగు సాహిత్య చరిత్ర–విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైద్రాబాద్–1998.

❖ ❖ ❖ ❖ ❖

# రామాయణం – సామాజిక నీతి

**డా. చిన్నం రాజారాం,** అకడమిక్ కన్సల్టెంట్, తెలుగుశాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.
ఫోన్ : 9885220546

రామాయణం దేశి మార్గలలో వెలువడిన అద్భుతమైన కావ్యం, సార్వజనీనమైన కావ్యం. సంస్కృతంలో వెలసిన రామాయణాలకే గాక దేశ భాషలలో రూపుదిద్దుకున్న రామాయణాలకు కూడా వాల్మీకి రామాయణమే మాతృక అంటే అతిశయోక్తి కాదు. వాల్మీకి రామాయణానికి తెలుగులో అనేక అనువాదాలు వెలువడ్డాయి. 13వ శతాబ్దం నుంచి నేటి దాకా అనేక ప్రక్రియలలో రామాయణాలు వచ్చాయి. వాటిలో ప్రథమ స్థానం రంగనాథ రామాయణానిదే. అది వాల్మీకాలతో పాటు అనేక అవాల్మీకాలను కూడా ఆదరించింది.

**ఆది కవీశ్వరుడైన వాల్మీకి యాదరంబున బుణ్యలందఱు మెచ్చ జెప్పిన తెఱగున శ్రీ రామ చరిత మొప్ప జెప్పుదం గథాభ్యుదయ మెట్లనిన –**

ఆది కవి వాల్మీకి అడుగుజాడల్లోనే నడుస్తూ, తాను శ్రీరామ చరిత చెబుతానని 'ప్రతిజ్ఞ' చేసిన రంగనాథ రామాయణ కర్త, నలబై అవాల్మీకీయ కల్పనల్ని 'రసముల కల్పన' కోసం అనేకనేక ఆధారాల నుండి గ్రహించి రంగనాథ రామాయణాన్ని ఒక 'జానపద రామాయణం'గా తీర్చి దిద్దాడని చెప్పవచ్చు.

వాల్మీకి తన రామాయణ ప్రాశస్త్యాన్ని గురించి చెబుతూ రామాయణ పఠన, దాని మహాత్మ్యాన్ని గూర్చి ఇలా వర్ణించాడు.

**పఠ దాఖ్యాన మాయుష్యం పఠన్ రామాయణం నర:**[1]
**స పుత్ర పౌత్ర: సగుణ: ప్రేత్యస్వర్గే మహీయతే॥**[2]

అని రామాయణ పారాయణం వల్ల కలిగే ఫలితాలను తెలిపాడు. ఆయువును పెంచే ఈ రామాయణ కథను చదివేవాడు, పుత్ర పౌత్రులతోనూ, తన వారందరితోనూ కలసి స్వర్గానికి వెళ్ళి అక్కడ పూజింపబడతాడు.

**సామాజిక నీతి :** సామాజిక శాస్త్రవేత్తలైన పాశ్చాత్యులు కూడా Man is a Social Animal అని మనిషిని నిర్వచించారు. **'సమాజంలో ఎలా నడచుకోవాలో తెలిసిన జంతువే మానవుడు'** అనీ, **'సామాజిక జంతువే మానవుడు'** అనీ వారి నిర్వచనం. కాబట్టి మానవుడు జంతువులకు లేని బుద్ధి చేత, విచక్షణా జ్ఞానం చేత పశు వులకంటే ఉన్నతంగా, ఉదాత్తంగా సమాజంలో జీవించగలిగినప్పుడే అతనిని సంస్కారవంతుడైన మనిషి (Gentleman) అని పాశ్చాత్యులు గుర్తించారు. కాబట్టి సామాజిక నీతి అంటే సమాజంలో ఏ పని పట్ల, ఏ విషయం పట్ల ప్రవర్తన సమాజ అంగీకారయోగ్యతని పొందుతుందో అదే సామాజికమైన నీతి. అంగీకారయోగ్యత లేని



ఏ ప్రవర్తనసైనా అసామాజిక నీతి. సామాజిక నీతి moral అనీ, అసామాజిక నీతి immoral అని అంటారు.

**కుటుంబ నీతి :** తల్లి, తండ్రి, గురువు, దైవం, మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ అనే వరుసలు మానవులు ఆచరించవలసిన కనీస విలువైన నీతి సూత్రాలు. కుటుంబ నీతిలో ముఖ్యంగా తల్లిదండ్రులను గౌరవించడం, అన్నదమ్ములకు సహాయ సహకారాలు అందించడం, తనలో సగభాగమైన భార్య పట్ల భర్త, భర్త పట్ల భార్య ప్రేమానురాగాలు పంచడం, మొదలగువారిపై ఆచరించబడాలి. అదే కుటుంబ నీతి.

**పుత్ర నీతి – తల్లిని గౌరవించడం :** శ్రీరాముని వివాహం అనంతరం మిథిలా నగరము నుంచి తమ పట్టణమైన అయోధ్యా నగరమునకు ప్రవేశించినారు. అక్కడ ప్రజలంతా స్వాగతము చెప్పి, చాలా భక్తిని ప్రదర్శిస్తారు. వారిని దశరథుడు, రాముడు మొదలైనవారు కూడా గౌరవిస్తారు. వివాహమైన నూతన వధూవరులు అంత:పురంలో గృహ ప్రవేశము చేసే ముందు నర్తకులు నాట్యము చేయడము, బ్రాహ్మణ ముత్తైదువులు మంగళ హారతులీయడము, బ్రాహ్మణులు ఆశీర్వాదాలు చేయడము, వందిమాగధులు, స్తుతి వాక్యాలు పలకడము జరుగుతుంది. అనంతరం అంతఃపురంలో శ్రీ రాముడు సీతాదేవిని కలుసుకునేముందు తన తల్లులను గౌరవించడం కనబడుతుంది.

**తల్లులకు మ్రొక్కి వారలెంతయు నొసంగు**
**దీవనలు గాంచి యెనలేని ఠీవి మెఱయ**[3]

సీతాదేవిని కలుసుకునే ముందు కౌసల్య, సుమిత్ర, కైకేయి (దశరథుని ముగ్గురు భార్యలు) అను తన తల్లులకు నమస్కరించి, ఆశీర్వాదాలు గ్రహిస్తాడు. అందరి తల్లుల మీద ఆయనకుండే భక్తి, గౌరవం ఇక్కడ వ్యక్తమైనది. తన తల్లి కౌసల్యతో పాటు తల్లి

సమానులైన సుమిత్ర, కైకలకు కూడా నమస్కరించి, ఆశీర్వాదం పొందగల సహృదయం, విశాల హృదయం శ్రీరామునిలో కనిపిస్తుంది. కాబట్టి మొదట జన్మనిచ్చిన తల్లిదండ్రులను నమస్కరించడం, ఆశీర్వాదం తీసుకోవడం సమాజంలో ప్రతి మనిషీ పాటించవలసిన ఒక సుగుణం.

**పుత్ర నీతి – తండ్రిని గౌరవించడం :** పట్టాభిషేకానికి త్వరగా సంసిద్ధం కమ్మని దశరథుడు రాముడ్ని ప్రోత్సహించాడు. కొంత సేపటికి కైక రాముడ్ని పిలిపించి పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేయమని ఆదేశించింది. తనకు పట్టాభిషేకమని దశరథుడు చెప్పినప్పుడు గానీ, వనవాసమే తండ్రి అభిమతమని కైకేయి చెప్పినప్పుడు గానీ రాముడు ఒకే విధమైన ముఖ ప్రసన్నతనే ప్రదర్శించాడు. పైగా కైకేయి అభీష్టం తనకు కూడా అంగీకారమే నన్నాడు. అందరి చేత స్థిర ప్రజ్ఞుడనిపించుకున్నాడు.

**జననివి నీవు వేడుదటె సత్యము దండ్రికి నెక్కునట్టి నా**
**యనుజుడు నేల యేలువటె యక్కడ సమ్మని పాదపద్మవం**
**దనమటె కృత్యమిట్లగుట ధన్యుడ నేగెద గానకేను మీ**
**పనిచిన యట్లనే భరతు బట్టము గట్టు సవిత్రి ధాత్రికిన్**[4]

తనకు సంక్రమించవలసిన రాజ్యం ఇతరుల పాలుకావడం ఎంతో బాధ కలిగిస్తుంది. దానికి తోడు నార చీరెలు ధరించి 14 సంవత్సరాలు వనవాసం చేయవలసిరావడం దుర్భరమనిపిస్తుంది. అలాంటప్పుడు కూడా రాముడు చలించలేదు. తన ఆవేదనను బహిర్గతం చేయలేదు. పైగా తన దుస్థితికి వగచిన వారందరినీ ఓదార్చాడు. ఇది రాముని వ్యక్తిత్వానికి ఎంతో శోభ చేకూర్చింది. తండ్రి వ్యక్తం చేయలేని తన మనోభావాల్ని, మానసిక స్థితిని రాముడు అర్థం చేసుకుని ఉన్నత వ్యక్తిత్వం కలిగినవాడుగా కనిపిస్తాడు. ఫలితంగా 14 సంవత్సరాలు వనవాసం చేయగల ధైర్యశాలిగా కూడా కనిపిస్తాడు. తండ్రులు తన ఆలోచనలని వ్యక్తం చేయలేని పరిస్థితులు కూడా ఉంటాయి. వాటిని అర్థం చేసుకొనే స్థితిలో పిల్లలు కలిగి ఉండాలి. ఫలితంగా పిల్లలకు కష్టం, నష్టం వాటిల్లినప్పటికీ వాటిని ఆనందంగా ఆహ్వానించడం అనుభవించడం తండ్రికి పిల్లలు ఇచ్చే గౌరవంగా చెప్పవచ్చు.

**సోదర నీతి :** అన్నదమ్ముల మధ్య ఉండవలసిన అన్యోన్యను రాగము, ఆపదలలో ఆదుకోవడం, ఒకరు కోసం ఒకరు కష్టాలను సహించడం మొదలగునవి రామాయణం ద్వారా లోకానికి ప్రబోధించబడ్డాయి. పుడుతూ అన్నదమ్ములు, పెరుగుతూ దాయాదులు అనే మాట ఈ కాలానికి సరిపోతుందేమోకానీ, కుటుంబ అనుబంధాల కోణం నుంచి చూస్తే రామాయణం ఆదర్శప్రాయం, అనుసరణీయం. వేదవేద్యుడైన భగవంతుడు రాముడిగా అవతరిస్తే, ఆ వేదమే రామాయణంగా ఈ లోకానికి దిగివచ్చిందని ఋషి వాక్కు. అలాంటి రామాయణంలోని సోదర సంబంధాలను గమనిస్తే.... ప్రధానంగా మానవ, రాక్షస, వానర, పక్షి సోదరుల మధ్య బాంధవ్యాలను గురించి చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఇక్కడ మానవ సోదరులైన రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల గురించి చెప్పుకుంటే, వారి తల్లుల్లో కుటిల నీతి కనిపించినా సోదరుల మధ్య సోదర భావం మెండుగా కనిపిస్తుంది.

బాల్యం నుండి రాముడు సోదరుల మీద విశేషమైన ఆదరాభిమానాలు చూపేవాడు. రాముడికి తమ్ములు అందరి మీదా సమాన ప్రేమే ఉన్నప్పటికీ, లక్ష్మణునికి రాముని మీద విశేషాభిమానం ఉండేది. అన్న రాముడే తన జీవితం అన్నట్లుగా లక్ష్మణుడు సోదర భావం చూపించాడు. అందుకే యాగ సంరక్షణ కోసం రాముడు విశ్వామిత్ర మహర్షి వెంట అడవులకు వెళితే, లక్ష్మణుడు కూడా అడవులకు వెళ్లాడు. వద్దని వారించిన రామునికి లక్ష్మణుడు చెప్పిన మాటలు అతని భ్రాతృవియోగ దుస్సహిష్ణుతను ఆవిష్కరిస్తున్నాయి.

**"........ యిక్కడి భోగంబు లె వ్వియు నేనొల్ల**
**వన భూములను జటావల్కలములు**
**నెమ్మిత్ ధరియించి నీ పాద పద్మముల్**
**గొలిచిపచ్చెదను నే వలవదనిన**
**నొల్ల ప్రాణములన్న .............."**[5]

ధర్మ స్వరూపుడు, సూర్య సమాన తేజుడు, ధర్మ పరిపాలనా దక్షుడు మొదలగు సుగుణాలున్న రాముడిని చూచి గర్వించి, తల్లులు వేరైనా ఉన్నత పురుషుని చూసి ఈర్ష్య పడక, జీవితాంతం తోడు నీడగా ఉన్నాడు. వనవాసంలోనే కాదు తదనంతరం కూడా లక్ష్మణుడు రాముడ్ని జీవితాంతం అంటిపెట్టుకునే ఉన్నాడు. ఆదర్శ అనుజుడుగా లక్ష్మణుడు ఇక్కడ కనిపిస్తాడు.

రాముడు అరణ్యవాసానికి వెళ్ళడంతో రాజ్యభారం స్వీకరించమని వశిష్టుడు మొదలైన వాళ్ళు కోరిన సందర్భంలో భరతుడిచ్చిన సమాధానం ఆయన భ్రాతృప్రేమకు నిదర్శనం.

**జ్యేష్ఠః శ్రేష్ఠశ్చ ధార్యాత్మా దిలీప నహుషోపమః।**
**లబ్ధు మర్హతి కాకుత్స్థో రాజ్యం దశరథో యథా॥**[6]

ఈ రాజ్యాన్ని మా కులపురుషులైన దిలీపుడు మొదలైన వారు ఇది వరకు పరిపాలించారు. వారితో సమానమైన మా అన్న రాముడు ధర్మాత్ముడు. ఆయనే రాజ్యాన్ని ఏల వలసినవాడు అని రామునిపై తనకుగల గౌరవాన్ని చాటుకుంటాడు. భరతుడు రాజ్య పరిపాలన సాగించే క్రమంలో పరిపాలన తన పేరు మీద జరపలేదు. అయోధ్య సింహాసనంపై శ్రీరామ పాదుకలుంచి, పాదుకలకు పట్టాభిషేకం చేసి, రాముని ప్రతినిధిగా, రాముని పేరు మీదగా పరిపాలన కొనసాగించాడు. భరతుడు రామునికి, రాముడు అధిష్ఠించాల్సిన

సింహాసనానికి ఇచ్చే గౌరవం ఇక్కడ కనబడుతుంది.

శత్రుఘ్నుడు కేకయదేశం నుండి తిరిగి రాగానే దశరథుని మరణ వార్త, రామ వనవాస వార్త శత్రుఘ్నుడిని ఎంతగానో బాధించాయి. ఈ దుర్ఘటనలన్నిటికీ మూల కారణమైన మంధర మీద నిగ్రహించుకోలేని ఆగ్రహం కలిగింది. శత్రుఘ్నుడు మంధరను చంపబోయాడు, కైకను సైతం హత మార్చబోయాడు.

**" ..... అతండు రోషా విష్టుండగుచు బెలుచదానిం బడదాచి కేలం గడకాలు వట్టి మీదికెత్తి జిఅ జిఅం ద్రిప్పి నేలతో వ్రేసి ఖడ్గంబు దిగిచి యంకించుచుం దొలంగుడిద్దు రాత్మురాలి తలద్రుంచెద ననుచు గైకకుం గవిసినం ......................"[7]**

భరతుడతనిని వారించాడు. ఇక్కడ శత్రుఘ్నుడికి రామ, దశరథుల పట్ల గల అపార భక్తి, మంధర కైకల పట్ల ఏర్పడిన ఏహ్యాభావం ద్యోతకమౌతాయి. భరతుని సూచనతో ఏకీభవించి మనస్సు మార్చుకోవడం శత్రుఘ్నుడు పెద్దల మాటకిచ్చే విలువను తెలియజేస్తుంది.

రాముడు అయోధ్యకు చేరుకొని అధికారాన్ని చేపట్టిన తర్వాత అనువైన సమయాల్లో తమ్ములకు రాజ్యాధికారాన్ని కూడా ఆనందంగా పంచియిచ్చాడు. లవణాసుర సంహారానికి శత్రుఘ్నుడు ముందుకు వచ్చినప్పుడు అంగీకరించిన రాముడు ఆ రాక్షసుని సంహరించిన తర్వాత ఆ రాజ్యాన్ని పరిపాలించాలంటాడు. శత్రుఘ్నుడికి రాజ్యాభిషేకం ఇష్టం లేకపోయినప్పటికీ రాముడి మాటను తిరస్కరించలేక అంగీకరిస్తాడు. ఇలా తోబుట్టువులకు బలవంతంగా నైనా సుఖాలను ప్రసాదించే గుణం రాముడిలో కనిపిస్తుంది.

**దంపతుల నీతి :** రాముడు అడవులకు వెళ్ళాల్సి వచ్చినప్పుడు, తనతో సీతాదేవి వస్తాననప్పుడు శ్రీరాముడు వద్దంటాడు. అది భార్యపట్ల ప్రేమతో, ఆమె అడవులలో కష్టాలు పడకూడదని భావిస్తే; సీతాదేవి మాత్రం శ్రీరాముడు తన భర్త గనుక భర్త ఎక్కడ ఉంటే తనూ అక్కడే ఉంటానని అడవులకు బయలుదేరుతుంది. ఇక్కడ ఇరువురు ఒకరిపై ఒకరు ప్రేమని, అనురాగాన్ని ప్రదర్శించినట్లు కనబడుతుంది.

అదే విధంగా రాముడు వెంట లక్ష్మణుడు అడవులకు వెళ్లడానికి బయలుదేరి తన భ్రాతృప్రేమని ప్రదర్శిస్తాడు. అదే విధంగా లక్ష్మణుడు వెంట తన భార్య అయిన ఊర్మిళాదేవి కూడా అడవులకు వస్తానని వేడుకుంటుంది. అందుకు లక్ష్మణుడు ఊర్మిళా దేవిని ఇంటిలోనే ఉండమని ఆజ్ఞాపిస్తాడు. ఊర్మిళా దేవి భర్త ఆజ్ఞను శిరసావహించింది. ఆనాటి నుండి భర్త అడవుల నుంచి వచ్చేదాకా ఊర్మిళా దేవి పద్నాలుగేండ్లు నిద్ర వహించింది. లక్ష్మణుడు ఊర్మిళా దేవి మధ్య అన్యోన్యం కనిపిస్తుంది.



**కుటిల నీతి :** రాముడు దాసీ దాని ఒక కాలు విరగ్గొట్టాడు. చిన్ననాటి చేష్టగా దాన్ని క్షమించి మరచిపోవచ్చు. కానీ ఆ దాసి మంథర – కైకేయిని పెంచిన దాది. కైకేయికి శ్రేయోభిలాషిణి. తనకు వ్యక్తిగతంగా జరిగిన నష్టానికి ఏనాటికైనా శిక్షించాలని పగపట్టింది. వైయక్తిక కక్ష్యతో, పగతో ప్రతీకారం తీర్చుకోవాలని ఒక సామాన్యమైన దాసి యువరాజును సింహాసన భ్రష్టుణ్ణి చేసింది. తాను మాత్రం బయట పడకుండా కైక ద్వార శిక్షను అమలు చేయించింది.

తను చేస్తున్నది 'రాజద్రోహ'మని తెలిసి కూడా 'కుటిలనీతి'ని ఆశ్రయించింది మంధర. కైక దశరథుని ప్రియపత్ని గనుక ఆ నేరాన్ని కైకకు అంటగట్టాలనే దుర్బుద్ధితో, ఆమె శ్రేయస్సును కోరే దానిలా నటిస్తూ, ఆమెకు హితం చేస్తున్న విధంగా దశరథుడెప్పుడో యిచ్చి మరచిపోయిన రెండు వరాలను బయటకు తెచ్చి, ఆ వరాల స్వరూపాన్ని కూడా తానే నిర్ణయించి కైక చెవుల్లో నూరి పోసింది.

ఒక రాజ్యానికి పెద్ద కొడుకు వారసుడు కావడం. సింహాసనారూఢుడై రాజ్యపాలన చేయాలని, తక్కిన వారతనికి మనస్ఫూర్తిగా సహకరించాలని ధర్మశాస్త్రం చెబుతున్నది. ఈ విషయం తెలిసి కైకేయి కూడా మంధర పన్నిన కుట్రలో తనూ భాగం అయి కుటిల నీతికి పాల్పడింది. ధర్మశాస్త్రాన్ని తలక్రిందులు చేసే కుట్ర దశరథుని అంత:పురంలోనే జరగడం చట్ట విరుద్ధమైన రాజకీయ కుట్ర! కుటిలనీతి ఎప్పుడూ చట్ట విరుద్ధమే! ఈ కుటిలనీతి వలన రాముడు సింహాసన భ్రష్టత్వం, పదునాలుగేండ్లు అడవులు పాలు కావడంలో రాముడి వ్యక్తిత్వం, గొప్పదనం పెరిగిందే గానీ తరగలేదు. కుటిలనీతి కన్నా కూడా రాముడి వ్యక్తిత్వం గొప్పది.

**సమాజ నీతి :** రామాయణంలో రాముని కుటుంబంలో వ్యక్తుల మధ్య ఉండే నీతిని కుటుంబ నీతిగా చెప్పడం జరిగింది. ఇక్కడ కుటుంబం వెలుపల ఉండే నీతిని సమాజ నీతిగా చెప్పడం జరిగింది.

ఇందులో రాజనీతి, సీతాదేవి నీతి – క్షమాగణం, ధర్మ కామనీతి, కామ పురుషార్థ నీతి, నైతిక జీవనం వంటివి పేర్కొనడం జరిగింది.

**రాజనీతి :** రాజు ప్రజానురంజకంగా పరిపాలించాలి అనేది రామాయణంలో ఉండే రాజధర్మం. ప్రజల అభీష్టం కొరకు నేను నా రాజ్యాన్నైనా, చివరకు నా భార్యనైనా వదులుకుంటానని రాముడు చెప్పడం రాజధర్మము యొక్క ఉత్కృష్టతను తెలియజేస్తుంది. తన భార్యయందు విశేషమైన ప్రేమ కలవాడైననూ శ్రీరాముడు ప్రజా వాక్యాన్ని పట్టించుకొని తన భార్యను అరణ్యంలో వదిలిపెట్టాడు.

రామాయణంలో వర్ణ వైషమ్యాలు లేవు. రాజైనవాడు పేదవారిని కూడా ఆప్యాయంగా ఆదరించాలి అనే విషయం రామాయణం స్పష్టం చేస్తుంది. శ్రీరాముడు భగవదంశ సంభూతుడైనా దశరథ మహారాజు ముద్దుల బిడ్డ అయినా పితృవాక్య పాలన కొరకు అరణ్యాలకు వెళ్ళాడు. బెస్తవాడైన గుహున్ని, వానరుడైన హనుమంతుడ్ని చేరదీశాడు. ఆప్యాయంగా పలకరించాడు. ఆనందాన్ని ప్రసాదించాడు. పక్షి అయిన జటాయువుకు దహన సంస్కారాలు చేశాడు. రాక్షసుడైన విభీషణునకు ఆశ్రయమిచ్చినాడు. రావణాసురుడ్ని సంహరించి విభీషణునికి పట్టం గట్టాడు. వాలిని సంహరించి సుగ్రీవునికి పట్టాభిషేకం చేశాడు. ఇటువంటి దీన జనాదరణ రామాయణంలో చాలా చోట్ల కనిపిస్తుంది.

**సీతాదేవి నీతి – క్షమాగుణం :** రాముడు రావణుని సంహరించాడు. హనుమంతుడా వార్తను సీతకు వినిపించి, ఆమెను అంతవరకు సంవత్సరం పొడవునా బాధించి, సూటిపోటు మాటలతో మానసికంగా హింసించిన రాక్షస స్త్రీలను చంపుతానంటాడు. అప్పుడు సీత చెప్పిన మాటలిలా ఉన్నాయి.

**పాపానాం వా శుభనాం వా వధా ర్హా ణాం ప్లవంగమ ।**
**కార్యం కరుణ మార్యేణ న కశ్చిన్నాపరాధతి ॥**[8]

ఓ వానరోత్తమా! చెడుకైనా, మంచికైనా వధింపదగిన వారిపట్ల ఉత్తములైన వారు కారుణ్యమే చూపవలసి ఉంటుంది. తప్పు చేయని వాడంటూ ఎవ్వడూ ఉండడు. సీతాదేవి చెప్పిన ఆ మాట విని హనుమంతుడిట్లన్నాడు.

**“యుక్తా రామస్య భవతీ ధర్మపత్నీ యశస్వినీ”**[9]

‘అమ్మా! రాముని సహధర్మచారిణిగా, చిరకీర్తి నార్జించిన నీవు పలకవలసిన మాటనే పలికినావు’ అన్నాడు. సీత చెప్పిన మాటల్లో రెండు సార్వకాలిక ధర్మాలు ఉపదేశిస్తున్నట్లుగా కనబడుతుంది. ఒకటి మానవత్వ దృష్టి, రాక్షస స్త్రీలు రావణుని బానిసలు. ఆయన అదుపాజ్ఞలలోని వారు వారిని చంపి ప్రయోజనమేమిటి? రావణుడే పోయాక వారు చచ్చిన పాములాంటి వారు కాబట్టి వారిని దయతో విడిచిపెట్టడమే ఉత్తములైనవారు చేయదగింది. ‘తప్పు’ అనే బాణం ప్రయోగించినవాడు రావణుడు, వీరు ఆయన చేతిలోని బాణాలు. బాణాలది తప్పుకాదు. అది ప్రయోగించిన వాడిదే తప్పు.[10]

రెండవది **“తప్పులు చేయడం మానవులకు సహజం”** అని సీతాదేవి నిష్కర్ష. రావణుడు ఎక్కువ తప్పులు చేశాడు. కాబట్టి శ్రీరాముడు అతన్ని విడిచిపెట్టలేదు. రావణుడు తెలిసిన మూర్ఖుడు. ఈనాటి సమాజంలో రావణుని వారసులే ఎక్కువ మంది కనిపిస్తారు. ఏది నీతివంతమైనది, ఏది సంస్కారవంతమైనది అని తెలిసి కూడా స్త్రీల పట్ల అనైతిక భావజాలం కలిగి ఉంటారు. ఎప్పుడూ నీతి, సంస్కారం, నైతికత ప్రధానమూ, ప్రామాణికమూ.

**ధర్మ కామనీతి :** భర్తను అవమానించి పరపురుషునితో సంబంధం పెట్టుకోవడమే వ్యభిచార (Adultery) మనబడుతుంది. గౌతమ మహర్షి సంస్కారవంతుడు కాబట్టి ‘వ్యభిచార’ మనే మాట నోటితో చెప్పకుండా ‘మహాపాప’ మనే పేరుతో చెప్పాడు.

**“ధృతి సెడి పరు గుడి తిటు మహా పాపమతిబూని, నన్నువమానంబు జేసి”** అని అన్నాడు. దీని బట్టి అహల్య ‘మహాపాపచారిణి’గా చెప్పవచ్చు. గౌతముడన్న మరోక మాట ‘నీతి’. **“ఈ తపోవనమున నింతినా యొద్ద నీతి మాలిన నీవు నిలువంగ దగదు”** అని అన్నాడు.

తపోవనంలో కఠిన బ్రహ్మచర్యం పాటింపబడుతుంది. మనస్సు, శరీరం పవిత్రంగా ఉండేట్లు చేసే దీక్షావ్రతమే తపోవన జీవితం. అటువంటి తపోవనంలో ‘గృహస్థ తపస్వి’గా గౌతముడున్నాడు. గృహస్థాశ్రమం ‘ధర్మ కామాన్ని’ చెబుతుంది. ‘అధర్మకామం’ వ్యభిచారం. గృహస్థాశ్రమంలో ఉండే తపస్వీ జీవితం మరింత నిష్ఠాగరిష్ఠమైనది. అహల్య ‘చతుర యౌవన రూప సౌందర్యమదం’ గల్గినది కాబట్టి యిటువంటి ఋష్యాశ్రమ జీవిత విధానానికి ఆమె ప్రవృత్తి సరిపడలేదు. ఋష్యాశ్రమ సంస్కృతికి విరుద్ధంగా ఆమె ప్రవర్తించింది. కాబట్టి నీతి నియమాలు లేని అహల్య అక్కడ ఉండ డానికి యోగ్యత కోల్పోయిందని గౌతముడన్నాడు. అందుకే లోకాని కేమాత్రమూ సంబంధం లేక తపోవనానికి బయట పాషాణవిషంతో ఆపదలపాలవుతూ ఉండమని శపించాడు.

వివాహమంటే, స్త్రీ పురుషులిద్దరు శాంతియుత సహజీవనాన్ని నీతి నియమాలతో సాగించడమని అర్థం. ఒక మనస్తత్వ శాస్త్రజ్ఞుడు “Marriage is a peaceful co-existence of two different nervous systems” అని అనడం గమనింపదగింది.

అహల్య మొత్తం సంతానంలో ఒక్క ‘అంజన’ మాత్రమే ‘సక్రమ సంతానం’. తక్కిన ముగ్గురు వాలి, సుగ్రీవుడు, శతానందాదులు ‘అక్రమ సంతానం’. ధర్మ కామనీతితో పిల్లలకి జన్మనివ్వాలే గానీ అధర్మకామనీతితో జన్మనివ్వకూడదు. ఇది ధర్మ విరుద్ధం.

**కామ పురుషార్థ నీతి :** వాల్మీకి రామాయణంలో సుమంత్రుడు

అడవికి వచ్చి వెళ్ళిన తర్వాత, అయోధ్యకాండలో, రాముడు లక్ష్మణుడితో యిలా అంటాడు.

**అనాథశ్చ హి వృద్ధశ్చ వయాచైవ వినాకృత:।**
**కింకరిష్యతి కామాత్మా కైకేయీ వశమాగత:॥**
**ఇదం వ్యసన మాలోక్య రాజ్ఞశ్చ మతి విభ్రమమ్।**
**కామ ఏవార్థ ధర్మాభ్యాం గరీయనితి యే మతి:।**
**అర్థ ధర్మే పరిత్యజ్య య: కామ మనువర్తతే।**
**నవ మావద్య తే క్షిప్ర రాజా దశరథోమథా ॥**[11]

**"లక్ష్మణా! భరతుడు రాగానే కైకేయి రాజ్యాశతో మహారాజు ప్రాణాలకే ముప్పు తెస్తుందేమో! కైకేయి మీద కోరికతో ఆమెకు లొంగిపోయిన దీనుడు వృద్ధుడు. నన్ను కూడా దూరం చేసుకున్నవాడు, ఏమి చేయగలడు? రాజు మనస్సు సరిగ్గా లేదు. ఈ దుఃఖం మనకు ప్రాప్తించింది. ఇదంతా చూడగా అర్థ, ధర్మాలకంటే కామ శక్తే గొప్పదనిపిస్తోంది నాకు. అర్థ ధర్మాలను విడిచి కామానికి లొంగిన వారికి దశరథమహారాజు గతే పడుతుంది"!** అని రాముడు కామ పురుషార్థ నీతిని బోధిస్తాడు. పురుషుడికి కామంతో కళ్ళు మూసుకుపోయి వరాలు కురిపిస్తే, రాజ పాలన భ్రష్టుపట్టి కొడుకులు, కోడలు అడవుల పాలు అయి అనేక కష్టనష్టాలు సంభవిస్తాయని ఇక్కడ నీతి.

**నైతిక జీవనము :** సీత జాడ తెలియనందున లంకలో దిగిన ఆంజనేయుడు కర్తవ్య విముఖుడై ఆత్మహత్యకు సిద్ధమైనాడు. ఆత్మహత్య అనేది మహాపాపం. ఇది బలహీనమైన మనస్సు గలవారు చేసేది. ఈనాడు లోకంలో ఎంతోమంది విద్యావంతులైన యువకులు సైతం చిన్న చిన్న సంఘటనలకు కూడా బెంబేలుపడి ఆత్మహత్యలు చేసుకోవడం మనం చూస్తున్నాము. ఈ ఆంజనేయులు దీర్ఘముగా ఆలోచించి ఆత్మహత్య సరైన చర్య కాదని మరణించుట వలన అనేక ఉపద్రవములు సంభవించుననియూ, బ్రతికి ఉన్నా ఎప్పటికైననూ సుఖములు పొందవచ్చును. ప్రాణము నిలుపుకొంటయే సరైన చర్య అని వివరించి ఆత్మహత్య యత్నమును విరమించినాడు. ఈ సందర్భముగా వాల్మీకి –

**వినాశే బాహనో దోషా జీవన్ భద్రాణి పశ్చతి।**[12]

పై తెలిపిన సామాజిక నీతి అంశాలే గాక అనేక అంశాలు రామాయణంలో కనిపిస్తాయి. రామాయణంలోని బాలకాండలో గురువుకు, అయోధ్యకాండలో తల్లిదండ్రులకు, అరణ్యకాండలో సత్ పురుషులకు, కిష్కింధకాండలో స్నేహితులకు, సుందరకాండలో దైవానికీ మరియు యజమానికి, యుద్ధకాండలో ధర్మానికి ప్రాధాన్యతని ఇచ్చి ఉన్నాయి. ఒక ఆదర్శమైన మర్యాదాసహితమైన అన్యోన్యానువంతమైన మానవజీవన విధానాన్ని రామాయణం అద్దంలోలాగా చూపుతుంది.



మానవుని జీవితములో ధర్మము, అర్థము, కామము అను మూడు పురుషార్థములను సాధింపదగినవి. ఈ త్రివర్ణమునకు ధర్మము మూలము. ధర్మ బద్ధములు గాని అర్థ కామములు రెండును అనర్థ హేతువులు. ధర్మమునకు విరుద్ధముగా పచ్చి స్వార్థముతో భరతునకు రాజ్యమును (అర్థమును) కట్టబెట్ట జూచిన కైక నలుగురిలో నవ్వులపాలై లోకనిందకు గుఱియైనది. అట్లే ధర్మమును వీడి, నీతి వీడి కామాతురుడై, పరసతులను ఆసించిన దుష్ట రావణుడు లోకమున అపకీర్తి పాలయ్యెను. సపరివారముగా నశించెను. ధర్మ బద్ధుడై, రాజ్యమునే పరిత్యాజించిన శ్రీరాముడు లోకారాధ్యుడయ్యెను. కావుననే "రామో విగ్రహవాన్ ధర్మ:" (శ్రీరాముడు మూర్తీభవించిన ధర్మము) అని వాల్మీకి మహర్షి నుడివెను. అందువలననే 'ధర్మో రక్షతి రక్షిత:' (ధర్మమును ఆశ్రయించిన వారిని ఆ ధర్మమే కాపాడును) అను సూక్తి ఏర్పడినది.

వాల్మీకి రామాయణంలో రాముని చేత యుద్ధకాండ చివరలో **"ఆత్మానం మనుషం మన్యే రామం దశరథాత్మజమ్"**[13]**.** అని చెప్పించడంతో రామాయణం ఒక మంచి మనిషి యొక్క నిర్మలమైన మనస్సును నిరూపించే కథగా ఆవిష్కరింపబడింది. మంత్ర తంత్ర, మాయ, ఇంద్రజాలాది విద్యలతో విజయం సాధించడానికి రావణుడు తన శక్తినంతా ధారబోశాడు. చివరకు నెగ్గలేకపోయాడు. కాబట్టి సమన్వయమేమంటే, ప్రతి వ్యక్తికి జీవితంలో ప్రాథమికమైనవి విలువైన నైతిక నీతి. ఈ నైతిక నీతి ఉల్లంఘించినప్పుడే అనైతిక నీతి పరిధిలోకి ప్రవేశిస్తాడు. క్షుద్ర దేవతకమైన వామచార పద్ధతులు, మాయ విద్యలు, అనైతికానికి పరాకాష్ఠ స్థితి! అటువంటి **'నిర్మాలాంతఃకరణం'** కల్గిన మానవీయ విలువలు యందు కుప్పకూలి పోతాయి. రాముడు, ఆయన సహచరులు ఆ మాయలను ఛేదించారు. విజయాన్ని సాధించారు.

ఆధార రచనలు

1. రంగనాథ రామాయణం – బాలకాండ – పు.4
2. శ్రీ చలమచర్ల వెంకట శేషాచార్యులు – శ్రీమద్రామాయణం, బాల – శ్లో॥ 990
3. మొరంగపల్లి బాగయ్య, అచ్చ తెలుగు రామాయణం సమగ్ర వాఖ్యానము, పు. 185–186
4. హుళక్కు భాస్కరుదు, భాస్కర రామాయణం, అయోధ్య కాండ – పద్యం. 109
5. హుళక్కు భాస్కరుదు, భాస్కర రామాయణం, అయోధ్య కాండ – పద్యం. 174
6. హుళక్కు భాస్కరుదు, భాస్కర రామాయణం, అయోధ్య కాండ – పద్యం. 186
7. హుళక్కు భాస్కరుదు, భాస్కర రామాయణం, అయోధ్య కాండ – వచనం. 360
8. వాల్మీకి రామాయణం (గోరఖ్‌పూర్ ముద్రణ), యుద్ధకాండ, సర్గ–113, శ్లో.45
9. వాల్మీకి రామాయణం యుద్ధకాండ. సర్గ–113, శ్లో.48
10. వాల్మీకి రామాయణం యుద్ధకాండ. సర్గ–81, శ్లో.22, 28
11. వాల్మీకి రామాయణం అయోధ్యకాండ. సర్గ–శ్లో.164 నుండి 166 వరకు
12. వాల్మీకి సుందరకాండ, గోరఖ్‌పూర్ ముద్రణ, శ్లో. 47
13. వాల్మీకి రామాయణం, యుద్ధకాండ – సర్గ. 117, శ్లో. 11.

❖ ❖ ❖ ❖ ❖

## తండ్రి గారు ఎంతొ ధన్యజీవి!

అంద రూప మందు అర్ధభాగ మొసగి
జన్మదాత మనకు జనక దేవ,
చదువు సంధ్యలన్ని చక్కగా నేర్పించి,
మంచి బాట జూపు మనము బ్రతక.

నాన్న యన్న ఎవరు, నిన్ను పెంచినవాడు
చిన్న నాటి నుండి నిన్ను సాకి
చేయిపట్టి నడిపి చేయూత నందించి,
ప్రేమ పంచి నట్టి పెద్ద మనిషి.

శ్రద్ధ ఎంతొ జూపి, చదువులెన్నియొ నేర్పి,
వలయు వసతు లన్ని కలుగజేసి
కష్టమనక ఎపుడు ఖర్చులన్నియు పెట్టి,
గొప్ప స్థాయి నొసగు గురువు మనకు.

వెతలు యున్న గాని, వెలికి తెలుపకుండ
తనలొ బాధనంత దాచుకొనుచు
పరువు నిలుచు నటుల బరువంత తలమోసి,
నడుపుచుండు బ్రతుకు నావ నెపుడు.

ఆస్తిపాస్తులన్ని అధికంగ జమజేసి,
అప్పజెప్పు మనకు, 'అప్ప' ఎపుడు,
సమయమందు తగిన సలహాలు చెప్పుతూ
మంచి చెడ్డ మనకు ఎంచి జూపు.

పెద్దలంత నుడువ పితృదేవ భవయని
దైవ సమము కాదె తండ్రి ఎపుడు
మాత, పితల ప్రేమ మరపురాని దెపుడు,
అట్టి ప్రేమ మనకు అందదెచట.

పెద్దవారి ఆస్తి శ్రద్ధగా కాపాడి,
అటులె యుంచి దాని అమ్మకుండ,
అప్పజెప్పు తండ్రి, అవతలి తరముకు,
తాను మటుకు ఏమి తాక కుండ.

తండ్రి ఋణము తీర్చ తనయులకు తరమె,
అసలు, వడ్డి లేని అప్పు అదియె,
వారు చూపి నట్టి బాట యందు నడిచి,
పేరు నిలప గలరు పెద్దవారి.

యుక్తవయసు రాగ, ఉచిత రీతిగ జేయు,
తగిన వరుని జూసి తనయ పెండ్లి
కట్న కాన్క లిచ్చి, కన్యదానము జేసి,
సారె, చీర లిచ్చి సాగనంపు.

పిల్లగాళ్ళ నెంతొ ప్రేమగా పెదజేసి,
తిప్పలేమి వార్కి, తెలియనీక
అన్ని వేళలందు అండగా నిలిచేటి,
తండ్రిగారు ఎంతొ ధన్యజీవి!

**పసుపులేటి నరసింహారావు**
ఫోన్ : 9840 856 206

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 (33) హైదరాబాద్ జులై : 2024

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు-7

**డా. అట్టెం దత్తయ్య** , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

దానం అంటే తన ధనాన్ని గాని, ద్రవ్యాన్ని గాని ప్రతిఫలాపేక్ష లేకుండా దీనులకు, అవసరార్థులకు ఇవ్వడం. అమరకోశంలో – త్యాగం, విహాపితం, ప్రాదేశనం, అపవర్జనం మొదలైన పదమూడు అర్థాలున్నాయి. ఈ అర్థాలలో ప్రధానమైనవి : 'దానం అంటే నరకం నుంచి తరింపచేసేది. పుణ్యము ప్రతిపాదింపబడేది, పాపాన్ని తొలిగించేది. మీది జన్మమునకు మొలవ పెట్టబడేది' (అమరకోశం. పు. 452) అని ఉంది. దానాన్ని ఉపనిషత్తులు అమృతత్త్వం అంటాయి. (త్యాగేనైకే అమృతత్వ మానుశుః) భగవద్గీతలో మానవుడు వదలకూడని మూడు పనులలో 'దానం' ఒకటిగా చెప్పబడింది. (యజ్ఞదాన తపః కర్మ న త్యాజ్య...) వీటిని అష్ట, దశ, షోడశ దానాలుగా చెప్తారు. చతుర్విధ ఉపాయాలలో (సామ, దాన, భేద, దండ) దానం ఒకటి. దానాన్ని ప్రతి ఒక్కరు ఏదో ఒక రూపంలో ఇతరులనుంచి పొందుతారు. ఇస్తారు, కాని దాని గొప్పతనం, విధానం, ఫలం, పద్ధతి, బాధ్యతలను గుర్తించడం తక్కువ. ఈ విషయాలనే భారతం సవివరంగా – దానం ఎవరికి, ఎందుకు, ఏవిధంగా, ఎంత, ఏమి, ఎప్పుడెప్పుడు చేయాలి? ఎవరికి చేయకూడదు? అనే విషయాలను ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు భీష్ముడుచెప్పిన సమాధానాలలో సంపూర్ణంగా తెలియజేసాడు.

ప్రశ్న: **దానం ఇవ్వడానికి ఉత్తములైన యోగ్యులు ఎవరు?** (అను. 2. 58)

భీష్ముడు దీనికి సమాధానం ఇలా చెప్పాడు. **"భోజనార్థుల దుష్టి బొందించు నతడును..."** (అను. 2. 59) ఆకలితో వచ్చిన వాళ్ళకు భోజనం పెట్టెవారు, దొంగలవల్ల అంతా పోగొట్టుకొన్నవారు, వ్రతం ఉద్యాపనం చెయ్యడంకోసం యాచించేవారు, గురువును, తల్లిని, తండ్రిని, భార్యను, పుత్రులను పోషించడం కోసం ధనం కావల్సినవారు, దీర్ఘవ్యాధిని పోగొట్టు కోవడం కోసం ప్రయత్నిస్తున్న వారు, ఎప్పుడూ భిక్షాటనతో జీవించే పాపంలేని విజ్ఞానులు – ఈ ఆరు విధాలవారు యోగ్యులు.

ప్రశ్న : **దానానికి ఎవరు పాత్రులు? (అను. 2. 50)**

ఉత్తమ ధర్మపరులూ, క్రోధంలేనివాళ్ళు, సత్యవంతులు, దాంతులూ, ధీరులు, స్వధర్మపరులూ, ఇంద్రియాలను జయించిన వాళ్ళూ, సర్వప్రాణులకీ మేలుచేసేవాళ్ళూ, లోభం లేనివాళ్ళూ, శుచిమంతులూ దానపాత్రులు. వేదాలు సాంగంగా చదువుకుని, షట్కర్మలూ నిష్ఠతో పాటించే తత్వవేదులైన విజ్ఞానవంతులకి చేసిన దానం వెయ్యిరెట్లవుతుంది.



మంచి పాండిత్యం, చక్కని ప్రజ్ఞా, ఉత్తమమైన శీలం, నడవడి కలవాళ్ళకి దానం చేస్తే వంశం వృద్ధిపొందుతుంది. యోగ్యుడైన విజ్ఞానవంతుడు ఒక్కడు సంతృప్తిపడినా చాలు, ముక్కోటి దేవతలూ సంతృప్తిపడతారు. మునులూ పితరులూ తృప్తి పడతారు. అందువల్ల మంచి విజ్ఞానిని వెతికి పిలుచుకువచ్చి దానమివ్వాలి అంటాడు భీష్ముడు.

ధర్మరాజు అడిగిన ఈ రెండు ప్రశ్నలు అందరినికి చాలా అవసరమైనవి. దానం ఇవ్వడం ఎంత ఉత్తమమైనదో ఎవరికీ ఇవ్వాలి అని తెలుసుకోవడం అంతకంటే గొప్పది. దానం ఇచ్చేవారు అనేకులు, అనేక రకాలుగా దర్శనమిస్తుంటారు. దానం ఇవ్వడం వెనకా కూడా ఏదో ప్రతిఫలాన్ని ఆశిస్తూ, తనవారికి, తనకు తెలిసిన వారికి, తన ప్రాంతం వారికి ఇలా పలు వంకలతో ఇస్తుంటారు. అత్యధికులు బ్రాహ్మణుడికి ఇవ్వడమే అసలైన దానంగా భావిస్తారు. భారతం మాత్రం అట్లాకాకుండా దానం ఎవరికీ చేయాలో ప్రత్యేకంగా కొందరిని ఎంపిక చేసింది. అందులో మొదటి సమాధానంలో ఆరు రకాల వారిని పేర్కొంది. ఆ ఆరు రకాల వారందరు అందరికీ అంగీకార యోగ్యులు. అన్నార్థులకు భోజనం పెట్టేవారికి చేసే దానం ఇంకొకరికీ ఆకలితీర్చబోతుంది. కొందరు వారి ధనాన్ని రకరకాలుగా మార్గాలలో పోగొట్టుకుంటారు. అన్నిటికీ వారు కారణం అయ్యి ఉంటారు, కాని దొంగలవల్ల పోగొట్టుకున్నవారికి వారు కారణం కారు. అట్లాగే దొంగలు పడి దోచుకున్నారంటే ఇంచుమించు పూర్తిగా పోతుంది. ఇట్లాంటి దయనీయ పరిస్థితిలో ఉన్నవారికి దానం ఇవ్వడం వల్ల ఒక కుటుంబానికి ధైర్యం ఇచ్చిన వారవుతారు. వ్రతం చేయాలనే జిజ్ఞాస ఉండి ధనం లేక యాచించి చేయడానికైన వెనుకాడనివారు ఆ వ్రతాన్ని ఎంత ప్రేమ, శ్రద్ధతో చేస్తున్నాడో ఊహించుకోవచ్చు. అట్లాంటి యాచకులు కనిపిస్తే వారికి దానం చేయడం మంచిది అంటుంది మహాభారతం. ధనం కలిగిన వారు కూడా సరిగ్గా చేయలేని పనిని ధనహీనుడు చేస్తే వారికి దానం

చేయడం మంచిదంటాడు భీష్ముడు. అదే గురువును, తల్లిని, తండ్రిని, భార్యాపిల్లలను పోషించడం. ఇందులో ఏ ఒక్కరినీ వదలివేయకుండా పోషించేవారికి మాత్రమే అనేది గమనించాలి. ఎక్కువ శాతం భార్యపిల్లల భ్రమలో పడి పోషణకై ఆశపడే మిగత ముగ్గురిని మరుస్తున్నారు. భార్యాపిల్లలను ప్రేమించినట్లుగానే తల్లితండ్రి గురువులను ప్రేమించే వారికి దానమివ్వడమనేది ఆదర్శనీయం. దీర్ఘవ్యాధితో బాధపడుతున్న వారు వారి ధనాన్ని ఆ రోగంకోసమే ఖర్చుచేసి ఉంటారు. అట్లాంటి వారికి దానం రూపంలో సహాయపడు మని తెలియజేస్తుంది. చివరగా నిత్యం యాచించి జీవనం గడిపేవారు వేరే ఆధారం లేకపోవడం వల్లనే ఆ పనిని ఎంచుకుని ఉంటాడు. కాబట్టి వారికి దానం చేయడం కూడా ఉచితం అని ఒకటవ సమాదానంలో గమనించవచ్చు.

మరో సమాధానంలో దానానికి పాత్రులెవరో తెలియజేస్తూ కొనియాడదగిన లక్షణాలు గలవారిని పేర్కొన్నారు. వారందరిని గమనిస్తే ఎటువంటి వ్యసనాలు లేని, వ్యక్తిత్వం, మానవత్వం గలవారు, శాంతిమంతులు, ఇంద్రియ నిగ్రంహం కలవారు మొదలగు వారందరికి దానం ఇవ్వడం మంచింది అంటారు. ఇన్ని మంచిలక్షణాలు గలవారు ఇతరులనుండి పొందిన ధనాన్ని వృథా చేయకుండా, ఎటువంటి దుష్ట కార్యక్రమాలకు వాడకుండా మంచి పని చేస్తారని నమ్మకం. మంచి, చెడు ఏ పనైనా వాటినుండి వచ్చే పాపపుణ్యాలకు అందరినీ బాధ్యులుగా పరిగణించాలి. అందుకే మంచి గుణం కలవారు మంచి పనినే చేస్తారు. ఆ మంచి పనిలో నుండి దాతకు కూడా కొంత పుణ్యం లభిస్తుంది. అందుకే విజ్ఞానవంతులకు, గుణవంతులకు, బుద్ధిమంతులకు దానం ఇవ్వమని తెలియజేస్తుంది.

ఇక్కడ రామకృష్ణ పరమహంస చెప్పిన ఉదాహరణను గుర్తు చేసుకోవాలి. **“ఒకప్పుడొక కసాయివాడు ఒక ఆవును దూరంలో ఉన్న గోవధశాలకు తోలుకుపోతున్నాడు. ఆ కసాయివాడు దాన్ని క్రూరంగా కొట్టడం వల్ల ఆవు వాణ్ణి తిప్పలు పెట్టసాగింది. దానిని తోలుకుపోవటం వాడికి కష్టసాధ్యమైంది. అలా చాలాసేపు శ్రమపడి మధ్యాహ్నానికి ఎలాగో ఒక గ్రామం చేరుకున్నాడు. ఎంతో అలసిపోయి సమీపంలోని ఒక ధర్మసత్రానికి వెళ్ళి ఉచిత భోజనం చేశాడు. సుష్టుగా తినటంతో బాగా తేరుకొని సులువుగా ఆవును వధశాలకు చేర్చగలిగాడు. ఆ గోవధ పాపంలో కొంతభాగం కసాయివాడికి అన్నదానం చేసిన దాతకు సంప్రాప్తమైంది. కాబట్టి అన్నాదులలో కూడా దానాన్ని గ్రహించేవాడు ‘దాన్ని దుర్మార్గ కృత్యాలకై వినియోగించే దుష్టుడు కాదు కదా’ అని వివేచించి మరీ చేస్తూండాలి.”** (శ్రీరామకృష్ణ బోధామృతం.పు. 148) చిన్న ఉదాహరణ అయినా స్పష్టంగా బోధపడుతుంది.

ఈ దానపాత్రుల గురించి ‘మనుస్మృతి’ తొమ్మిది రకాలవారు అర్హులని చెప్తుంది. **“సాంతానికం యక్ష్యమాణ మధ్వాగం...”** (మనుస్మృతి. 11.1) వివాహమాడగోరే వారు, మార్గమధ్యంలో ఉన్నవారు, గురువుకు దక్షిణ ఇవ్వగోరేవారు అని మూడు రకాల వారిని గురించి ఎక్కువగా చెప్తుంది.

ధర్మరాజు ప్రత్యేకించి కొన్నిరకాల వారికి దానం చేయడం మంచిదా? అని ఎంపిక చేసుకుని అడిగిన మరో రెండు ప్రశ్నలు కూడా కనిపిస్తాయి.

ప్రశ్న: **విజ్ఞానవంతుడు దానం పుచ్చుకోవడానికి ఎలా అర్హుడు అవుతాడు? సన్యాసిగా ఉంటేనా? లేదా, ఎలా ఉన్నా సరేనా? (అను. 2.31)**

‘తన ధర్మం తప్పకుండా నడుచుకునే మంచి విజ్ఞానవంతుడు అన్ని విధాలా దానానికి అర్హుడౌతాడు. అతడు సన్యాసి కావచ్చు, కాకపోనూవచ్చు’ అని ఏక వాక్యంలో భీష్ముడు సమాధానం ఇచ్చాడు.

ప్రశ్న: **పూర్వ సంబంధం లేనివాడూ, బంధువుకానివాడూ, పండితుడూ, యజ్ఞంచేసినవాడూ, నిత్యతపస్వీ – వీరిలో దానానికి ఎవరు ఉత్తములు? (అను. 2.36)**

వీళ్ళందరూ దానానికి సత్పాత్రులే. కాని ధర్మపన్నాగాలు ఏకరువు పెట్టడం తప్ప, ఆచరణలో పాటించని వాళ్ళకి బంగారం మొదలైనవి దానం చేసినవాడు పదేళ్ళు నరకం అనుభవిస్తాడు.

సర్వకాలాలలో దానం ఇవ్వడం అనేకులు విజ్ఞానవంతు (విప్రుడు) దుని ఎన్నుకుంటారు. అతడు ఎట్లాంటివారైనా సరే. అది రాను రాను ఆ కులంలో పుట్టిన వారైతే చాలు అనుకునే ఆలోచనకు వచ్చారు. అందుకే కావచ్చు ధర్మరాజు ఈ ప్రశ్నను అడగాల్సివచ్చింది. సమాదానంలో కూడా **‘తన ధర్మం తప్పకుండా నడుచుకునే వారు’** అనే వాక్యం గురించి ఆలోచించాలి. ధర్మాలు చాలారకాలు. వారివిజ్ఞానాన్ని బట్టి వారు చేయాల్సిన పనులు లోపం లేకుండా చేయడం వారి ధర్మం. ఇక్కడ పేరుకు విజ్ఞాన వంతుడో! కులానికి విజ్ఞానవంతుడో! అయినంత మాత్రాన వారికి దానం ఇవ్వడం అనేది అపాత్ర దానం. వారు వారి ధర్మాన్ని సరిగ్గా నిర్వర్తిస్తున్నాడా అని చూసుకుని దానం చేయడం అవసరం అని ఈ సమాధానం నుండి గ్రహించాలి.

పైన తెలిపిన మరో ప్రశ్నలో ధర్మరాజు పేర్కొన్న వారిలో అందరూ దానపాత్రులే అయినప్పటికీ వారిలో ఉత్తములు అని ధర్మరాజు వచ్చిన సందేహం. అంటే అంతగొప్పవారు ఉన్నప్పటికీ కూడా ఇంకా ఆలోచించి ఎంపిక చేసుకోవల్సిన అవసరం ఉంది అని అర్థం చేసుకోవాలి. సమాదానంలో భీష్ముడు చక్కగ భయపెట్టించాడు. పండితుడికి, యజ్ఞం చేసేవాడికి, నిత్యతపస్వికి మొదలైన వారికి కొన్ని ధర్మాలు ఉంటాయి. వాటిని వారు పాటిస్తున్నారా, నటిస్తున్నారా అని గమనించి ఇవ్వకపోతే పాపం చేసినవారు అవుతారు అని

గమనించవచ్చు. ఈ కాలంలో మాత్రం ఇది చాలా అవసరయోగ్యమైన సమాధానం. బట్టల రంగులు మార్చి, జుట్లుపెంచి, రంగురంగుల బొట్లతో వేషాలు వేసుకుని నటిస్తున్న బాబాలు ఎందరినో చూస్తున్నారు. వారిని నమ్మి మోసపోతున్న బుద్ధిహీనులను కూడా చూస్తున్నారు. వీరందరూ ధర్మం గురించి మాట్లాడేవారు మాత్రమే, కాని ధర్మాన్ని ఆచరించే వారు కారు. ఆచరించేవారు మాత్రమే అసలైనా పాత్రులుగా తేల్చిచెప్పారు.

దానం పాత్రుల గురించి అంతగా ఆలోచించి యోగ్యులను, పుణ్యాత్ములను ఎంపిక చేసుకుంటారు, కాని అంతగొప్ప వారికి దానం ఇవ్వడం ఎలా అనేది చాలామందికి వచ్చిన సందేహం. ఇదే విషయాన్ని ధర్మరాజు భీష్ముడిని మరిన్ని ప్రశ్నలుగా అడిగారు.

ప్రశ్న: **శ్రద్ధతో దానం చేస్తే ఏ పాపమూ జనానికి అంటదని భావిస్తాను. నిజమేనా? (అను. 2. 35)**

'సందేహం ఎందుకు? శ్రద్ధగల మహాత్ములూ ఆదరంతో చేసిన దానం వల్ల పుణ్యం కాకుండా పాపం ఎలా వస్తుంది?

ప్రశ్న: **ఎలాంటి మనసుతో దానంచేయాలి?** (అను. 5. 211)

భీష్ముడు తెలిపిన'ఉమామహేశ్వర సంవాదం'లో దీనికి సమాధానం తెలియపరిచాడు.

**"పరుషత్వము లేకంతః**
**కరణంబున శుద్ధి చాల గలిగి ప్రియము పొం**
**పిరివోవఁ జేత దానము**
**పరమోత్కృష్టంబు..."** (అను. 5. 212) 'కాఠిన్యం లేకుండా మనసా, వాచా, కర్మణా సంతోష పూర్వకంగా చేసే దానం అత్యుత్తమం.' పై రెండు ప్రశ్నలలో దానం చేసేటప్పుడు శ్రద్ధ, ప్రేమ రెండు అవసరం అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఎంత చిన్న దానం అయినా ఎంత పెద్దదైన తీసుకునే వారెవరైనా శ్రద్ధతో, ప్రేమతో ఇచ్చినపుడు మాత్రమే తీసుకునే వారు ఆశీస్సులు, కృతజ్ఞతలు మనస్ఫూర్తిగా అందిస్తారు. పెద్దల మాట ప్రకారం దానం తీసుకునే వారు దైవంతో సమానంగా భావించినపుడు మాత్రమే సంతోషంతో ఇవ్వగలరు.

దీన్ని తైత్తిరీయోపనిషత్తు – 'శ్రద్ధయా దేయమ్' (శ్రద్ధతో), 'హ్రియాదేయమ్' (నేనేమి ఇవ్వగలను అను లజ్జతో), 'భియాదేయమ్' (నా కర్తవ్యం), 'సంవిదాదేయమ్' (జ్ఞానపూర్వకం)గా దానం చేయాలని చెపుతుంది.

భగవద్గీత వీటిని మూడు విధాలుగా చెపుతుంది. 1. సాత్త్వికదానం (ఉపకారం చేయనివారికి, దేశకాలపాత్రములెరిగి ఇవ్వదగినదాన్ని ఇవ్వడం), 2. రాజసదానం (ప్రత్యుపకార, ఫలం కొరకు కాని బాధతో చేసేది), 3. తామసదానం (దేశకాలపాత్రము తెలియక, సత్కారపూర్వకంగా కాక, అవమానం చేస్తూ చేసేది) (భగవద్గీత. 17. 20,21,22).

'అడగనిది అమ్మ అయినా అన్నం పెట్టదు' అని ఒక సామెతను విరివిగా వాడుతారు. అందరు అన్నిటిని అడగాల్సిందేనా? కొందమహానుభావులు అడగకుండానే తెలుసుకుని దానం చేసే వారూ ఉన్నారు. ఇటువంటి వారే అసలైన దానం ఫలాన్ని పొందుతారని తెలియజేసే ప్రశ్నను ధర్మరాజు అడిగారు.

ప్రశ్న: **అడిగితే ఇవ్వడమూ, అడకుండా ఇవ్వడమూ ఈ రెండింటిలో ఏది గొప్పది? (అను. 2. 342)**

**"అడిగిన నిచ్చుకంటెను నయాచకుఁ గాఁగ నెఱింగి యిచ్చు టె**
**క్కుడు ఫలమిచ్చు; దానవిధి కోవిధ! వేడుట సావు వేఁడఁగా**
**బడుటది పెద్దసావు; దగు ప్రార్థన పూర్ణము సేయునాతఁ డా**
**యడిగిన వానిఁ దన్నును దయారతిఁ గావఁగ జాలు వాఁడగున్"**
(అను. 2. 343)

'అడిగితే ఇవ్వటం కంటె అవసరం ఉండి అడగలేనివాడిని ఎరిగి ఇచ్చిన దానం గొప్ప ఫలాన్నిస్తుంది. అసలు అడగడం అనేది చావువంటిది. ప్రార్థించడం పెద్దచావు వంటిది. అడగనివాడికి ఇవ్వడం వల్ల వాడిని రక్షించేవాడౌతాడు' అని పద్య భావం. ఇందులో 'అడగడం', 'ప్రార్థించడం' అనే వాటిని చావుతో పోల్చాడు. ప్రతి ఒకరికి ఆత్మగౌరవం ఉంటుంది. ఇతరుల దగ్గరకు వెళ్ళి చేతు చాచుతున్నాడు అంటే ఆత్మగౌరవాన్ని చంపుకోవడమే. ఆత్మగౌరవాన్ని చంపుకోవడం అనేది చావడం వంటిదే.

ప్రశ్న: **దానం, యజ్ఞం ఈ రెండింటిలో అధికఫలం ఏది ప్రసాదిస్తుంది?** (అను. 2. 345)

విజ్ఞానవంతుడికి వినయపూర్వకంగా ధనం, ధాన్యం, ఆవులు, రత్నాలు, భూములు, నీరు, అన్నం మొదలైనవి ప్రేమతో ఇవ్వడం మంచి యజ్ఞం. ఇవి చక్కగా నడిపినవాడు యజ్ఞాలూ, తపస్సులూ మొదలైనవాటి పుణ్యాలన్నీ పొందుతాడు.

ప్రశ్న: **అనేక విధాల దానాలను చెప్తున్నారు. వాటన్నిటిలో అధికమైన దానమేదో నాకు తెలియజేయుము.** (అను. 2. 349)

దానాలన్నిటిలోకీ భూదానం గొప్పది. ఎంచేతనంటావా? సమస్తమైన ధన్యాలూ, వస్త్రాలు, ధనరత్నాలూ అన్ని భూమిలోంచే పుడుతున్నాయి. బంగారం, వెండి, వస్త్రాలు, ధాన్యం వివిధ రత్నాలూ దానం చేస్తే ఎంతో భూమి దానం చేస్తే అంత. అందువల్ల భూదానం చేసినవాడికి ఇవన్నీ దానం చేసిన ఫలం లభిస్తుంది.

భూమికి ఎంత ఆయువుందో, అంతకాలం భూదానం చేసినవాడు స్వర్గంలో సుఖపడుతాడు. తక్కువభూమి దానం చేసినా, హెచ్చుభూమి ఏలుకుంటాడు రాజు. వీరశయనమయినా పొందాలి లేదా

భూదానమైన చెయ్యాలి. ఈ రెండూ రెండే. భూదానంవల్ల బ్రాహ్మహత్యా పాతకం పోతుంది. ఎంతపాపం చేసినవాడి దగ్గరైనా భూమి దానంపట్టవచ్చు తప్పులేదు. భూదానం చెయ్యడమూ అశ్వమేధయజ్ఞం చెయ్యడం ఒక్కటే అంటారు ఆదిమునులు. అంటూ భూమిని దానం ఇవ్వడం వల్ల కలిగే ఫలితాలను కూలంకషంగా తెలియజేసాడు. భూమిదానం గురించి, భూమిదానం చేయడం వల్ల పొందే ఫలితాన్ని గురించి ఎక్కువగా వివరించాడు. ఇప్పుడు బహుశ అతితక్కువమంది సాధ్యం అయ్యే పనిగా మారింది. ఎక్కడ భూమి అయిన దాని ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. భూమి ఇవ్వడానికి పూనుకున్నాడు అంటే మహానుభావుడు. కాని భూమిని దానం చేయడం వల్ల తరతరాల పుణ్యం పొందే అవకాశం కూడా ఉంది.

ప్రశ్న: **దానస్వభావం కలవారికి దానం చేయటానికి తగిన వస్తువులేవి?** (అను. 2.368)

అన్నం కంటే విశిష్టమైనది లేదు. దేవతలు, ఋషులు అన్నాన్ని పొగడుతున్నారు. లోకయాత్రలో యజ్ఞయాగాదులు మొదలైనవన్నీ అన్నంతోనే ప్రవర్తిస్తున్నాయి.

**"అన్నదాన సదృశ మగు దాన మెందు నె**
**న్నడును లేదు గావునను విధేయ**
**మన్నదాన మధిక యత్నపూతంబుగా**
**బూని దానిచేఁత పుణ్యతమము"** (అను. 2.370) అన్నదానంతో సమానమైనది లేదు. కాబట్టి అది తప్పక చేయదగింది. ఎక్కువ ప్రయత్నంతోనైనా సరే పవిత్రంగా చేయటం ఎక్కువ పుణ్యమిస్తుందని ఈ పద్యం తెలియజేస్తుంది. అన్నం ప్రాణాధారం కాబట్టి ఇంట్లో వారికి పెట్టకుండా అయినా అతిథులకు పెట్టటం పుణ్యం. అందులోనూ అలసినవాడు, స్త్రీ, బాలుడు, అంగవైకల్యం కలవాడు, ముసలి, తాపసి అయినవారిని ఎప్పుడు కాదనకూడదు. ఆకలితో వచ్చిన ఎవరినైనా ఆదరించాలి. మునులు పితృదేవతలు, దేవతలను అన్నదానంతో సంతోషపెట్టటం శ్రేష్ఠకర్మ. అన్నం పెట్టడానికి కులం, విద్య, నడవడిక అడగరాదు. అన్నం అమృతంతో సమానం. సప్తధాతువులను పోషించే అన్నం లేకపోతే ఎంతటి బలవంతుడైనా బలహీనుడౌతాడు. అన్నదానం వల్ల సర్వసుఖాలు లభిస్తాయని భీష్ముడు బోధించాడు.


మరో ప్రశ్నలో అన్నదానానికి సంబంధించిన మరిన్ని అంశాలను పేర్కొన్నారు.

**"దానార్హవస్తువులలో**
**మానిత మన్నంబ యన్నమయము లసువులున్**
**మేనుఁ దదీయబలంబును**
**గాన బుధులు దాని దద్ద గైకొంద్రు మదిన్."** (అనుశా. 4.350)

దానం ఇవ్వదగిన వస్తువులలో అన్నమే గొప్పది. ప్రాణాలూ, దేహమూ, దాని బలమూ అన్నం స్వరూపాలే. కనుక పండితులు దాన్ని మనస్సులో గొప్పదిగా భావిస్తారు. అంటూ మరో పద్యంలో అన్నదానంచేత పరమానందం తప్పక కలుగుతుంది. పరమ దుష్టభావాలు కలవాడైనా గొప్పదైన ఈ దానం చేత నిర్మలమూ, మంచిదీ అయిన భావం కలవాడవుతాడు అని తెలియజేసాడు. అన్నిటికంటే తృప్తి పరిచేది అన్నదానం మాత్రమే. ఏది ఇచ్చినా వద్దనడం కష్టం కాని తినేవారు కడుపునిండగానే 'చాలు' అంటారు. ప్రతి ప్రాణికి ఉదరం ఉంటుంది. ఉదరం ఉన్న అందరికీ ఆకలి ఉంటుంది. ఆకలి ఉన్న వారందరూ అన్నం తినాల్సిందే. తినని వారెవరు జీవించడం కష్టం. అంటే జీవన ప్రదమైన పదార్థం అన్నం. అన్నింటిలో కెల్లా అన్నదానమే గొప్పది.

**ఆధార గ్రంథాలు** :

1. అప్పలస్వామి, పురిపండా. '**వ్యావహారికాంధ్ర మహాభారతం**' (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.
2. కమలాకరశర్మ, సాగి. **'దానం – విధానం'**. 2013. హైదరాబాద్ : వేద సంస్కృతి పరిషత్.
3. నిర్వికల్పానంద, '**శ్రీమద్భగవద్గీత**' (పదచ్ఛేద టీకాతాత్పర్య సహితం). 2010. హైదరాబాద్ : రామకృష్ణమఠం.
4. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. **'శ్రీమహాభారతము'** (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.
5. విశ్వేశ్వర శాస్త్రి, జన్నాభట్ల. సంపా. **'మహాభారత వైజయంతి'** (తొమ్మిది సంపుటాలు). 2006. గుంటూరు : భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.
6. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. **'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము'** (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.
7. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. **'మహాభారత విమర్శనము'** (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.
8. సామి చిరంతనానంద (తెలుగు సేత), 'శ్రీరామకృష్ణ బోధామృతం'. 2019. హైదరాబాదు: రామకృష్ణ మఠం.



ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 37 హైదరాబాద్ జులై : 2024

# ప్రత్యేక తెలంగాణ సాధన – మహబూబ్ నగర్ జిల్లా కవుల పాత్ర

**మనిగిల్ల మల్లికార్జున్,** తెలుగు పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

**ఉపోద్ఘాతం**

20వ శతాబ్దం ఉత్తర భాగంలో తెలంగాణా ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. ఆ ఉద్యమాల్లో భాగంగా ఎంతో విలువైన సాహిత్యం కూడా వెలువడింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సాహిత్యంతో మొదలైన ఆ ఒరవడి ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సాహిత్యం వరకు కొనసాగింది. తెలంగాణ ప్రాంతంలో నడిచిన ఏ ఉద్యమంలోనైనా ఉద్యమకారులు, కవులు, రచయితలు వేరుగా లేరు. భౌతికంగా ప్రజా పోరాటాల్లో భాగమవుతూనే సాహిత్య సృజన చేయడం విశేషం. దీని మూలంగా ఏ ఉద్యమంలో వెలువడిన సాహిత్యాన్ని పరిశీలించినా, అందులో మానవ జీవితం తాలూకు వేదన, తపన, భవిష్యత్తుకు సంబంధించిన ఆంకాక్ష స్పష్టంగా కనిపిస్తాయి. ఆయా ఉద్యమాలు నడిచిన కాలంలో వెలువడిన సాహిత్యం సమకాలీన ప్రజానీకానికి ఒక ఆశ్వాసాన్ని ఇచ్చింది. భవిష్యత్తుకు సంబంధించిన అచంచలమైన విశ్వాసాన్ని కలిగించింది. నిర్దిష్టంగా చూసుకున్నప్పుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వెలువడిన సాహిత్యమంతా తెలంగాణ ప్రజల జీవితాల్లోని విధ్వంసాన్ని ప్రధాన స్రవంతి చర్చలోకి తీసుకువచ్చాయి. తెలంగాణ ఉద్యమంలో వెలువడినంత కవిత్వం రాశిలోనూ, వాసిలోనూ ప్రపంచవ్యాప్తంగా ఇంకే ఉద్యమంలో వెలువడి ఉండక పోవచ్చు. కేవలం వచన కవిత్వానికి సంబంధించి చూసుకున్నా సుమారు రెండు లక్షల పైచిలుకు వచన కవితలు వెలువడినట్లు తెలంగాణ పరిశోధకులు తేల్చారు. ఈ రాశిలో మహబూబ్‌నగర్ జిల్లా కవుల పాత్ర కూడా గణనీయంగానే ఉన్నది. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం రాసిన అతికొద్దిమందిలో ఈ జిల్లావారే ఎక్కువగా ఉన్నారు. మలిదశ ఉద్యమంలోనూ ఈ జిల్లా నుండి వందకు పైగా కవితా సంకలనాలు, సంపుటులు, దీర్ఘ కవితలు వెలువడ్డాయి. ఉద్యమానికి ఊతంగా నిలబడ్డాయి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో మహబూబ్‌నగర్ జిల్లా వచన కవులు నిర్వహించిన పాత్ర గురించి విశ్లేషించడమే ఈ పరిశోధన పత్ర ప్రధాన లక్ష్యం.

**1. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యం**

భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణ (అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రం), ఆంధ్రరాష్ట్రం రెండూ విభిన్నమైన పాలనల్లో ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల పునర్విభజన కోసం ఏర్పాటు చేసిన మొదటి ఎస్సార్సీ (ఫజల్ అలీ కమీషన్) దేశమంతటా పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. ఆంధ్రరాష్ట్రం వారు




తెలుగు ప్రాంతాలను ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్నారు. కానీ ఆంధ్రరాష్ట్ర ప్రజల ఆధిపత్య ధోరణుల అనుభవాలను కలిగిన తెలంగాణ ప్రజలు, తాము విడి రాష్ట్రంలోనే ఉండదలచామని, అందుకు గల కారణాలను, భయాలను కూలంకషంగా కమీషన్ సభ్యుల ముందు తెలియజేశారు. ఆ తర్వాత తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా 14 హామీలతో 'పెద్దమనుషుల ఒప్పందం' పేరిట ఒక ఒప్పందం చేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో తమకు ఏయే రంగాలలో వివక్ష, అన్యాయం, దోపిడీ జరుగుతుందని తెలంగాణ ప్రజలు భావించారో అన్నీ నిజమయ్యాయి. 'ఒప్పందం'లోని మొట్టమొదటి అంశం రాజకీయ ప్రాతినిధ్యంలో సమప్రాధాన్యం. ఒక ప్రాంతం వారు ముఖ్యమంత్రిగా ఉంటే ఇంకొక ప్రాంతంవారు ఉపముఖ్యమంత్రిగా ఉండాలి. కానీ ఈ ఒప్పందాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన మొట్టమొదటిరోజే తుంగలో తొక్కుతూ ఆంధ్రప్రాంతానికి చెందినవారికి ముఖ్యమంత్రి పదవి దక్కింది గానీ, తెలంగాణ వారికి ఉప ముఖ్యమంత్రి పదవి దక్కకపోగా, ఆ పదవినే చేతికి ఆరోవేలువంటిదని, అది అనవసరమని పదవినే తొలగించి వేశారు. ఇట్లా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగిన రోజు నుండి నీరు, వ్యవసాయం, భూమి, విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, పరిశ్రమలు, ఖనిజ వనరులు, గిరిజనులు, బడ్జెట్ కేటాయింపులు, కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాలు, భాష, చరిత్ర, హక్కులు మొదలైన అన్ని రంగాలలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరిగింది. ఈ నేపథ్యంలోంచే తెలంగాణ ప్రజలు తాము అంతకుముందు నుండీ కోరుకున్నట్లుగానే ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమించారు.

**2. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం**

1956లో రాష్ట్రం ఏర్పడితే 1968 సంవత్సరం ఆఖరివరకు

తెలంగాణ ప్రజలు తమకు అనేక రంగాలలో జరుగుతున్న అన్యాయాలకు గురై వివిధ రూపాల్లో నిరసనను ప్రదర్శించారుగానీ, సంఘటితమైన పోరాట రూపాన్ని తీసుకోలేదు. కానీ 1968 నవంబర్‌లో ఉద్యోగుల సమ్మెతో ప్రారంభమైన ఉద్యమం మొదట రక్షణల అమలును కోరి, దానినే ఏకైక డిమాండుగా ముందు పెట్టుకుని నడిచింది. ఆఖరికి 1972లో రాజకీయ నాయకుల కుటిల నీతివలన ఉద్యమం ఆగిపోయింది.

1990 తర్వాత ప్రపంచీకరణ విధానాలకు తెలంగాణ ప్రాంతం ప్రయోగశాలగా మారింది. ఆంధ్రా పాలకులు తెలంగాణ ప్రజాజీవితాన్ని విధ్వంసం చేశారు. ఆ క్రమంలోనే మళ్లీ 1996లో వామపక్ష భావజాలం కలిగిన ఉద్యమకారులు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమంగా అర్థం చేసుకుంటూ, ప్రత్యేక రాష్ట్ర సాధన అంశాన్ని ఎజెండా మీదికి తీసుకువచ్చారు. ఆ తర్వాత 2003లో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించి ప్రజా ఉద్యమానికి రాజకీయ గొంతును అందించింది. 2009లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పతాకస్థాయికి చేరుకుని 2014 జూన్ 2న రాష్ట్రం సాధించేవరకు విరామం లేకుండా నడిచింది. ఈ క్రమంలో తొలిదశ ఉద్యమంలో 400 పైచిలుకు, మలిదశ ఉద్యమంలో 1300 పైచిలుకు ఉద్యమకారులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేశారు.

### 3. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం – కవులు

తన చుట్టూ ఆవరించి ఉన్న భౌతిక పరిస్థితులను చూస్తూ చైతన్యశీలురూ, సృజనాత్మక హృదయులూ అయిన కవులు చలించకుండా ఉండలేరు. సమాజం నిశ్చల స్థితిలో ఉన్నప్పుడే, మానవ జీవితాల్లోని అనేక కోణాలను తమదైన దృక్కోణంలో ఆవిష్కరించే కవులు, సామాజిక ఉద్యమాలు సంచలనాలుగా విస్తరించిన సందర్భాల్లో మరింత తీవ్రంగా స్పందిస్తారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వచన కవులూ అదే చేశారు. ఉద్యమంలో విస్త ృతంగా పాలుపంచుకుంటున్న ప్రజల ఆవేదనల్లోని అనేక పార్శ్వాలను కవిత్వీకరించారు. ఈ క్రమం తొలిదశ ప్రత్యేత తెలంగాణ ఉద్యమ కాలం నుండి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు విస్తరించింది.

### 4. ప్రత్యేక తెలంగాణ సాధన – మహబూబ్ నగర్ జిల్లా కవుల పాత్ర

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాంది పడింది ఖమ్మం జిల్లాలో. అక్కడి పాల్వంచ థర్మల్ విద్యుత్ కేంద్రంలో రవీంద్రనాథ్ అనే కార్మికుడు ఆమరణ నిరాహార దీక్ష మొదలుపెట్టాడు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 12 సంవత్సరాల తర్వాత ఈ నిరసన మొదలైంది. ఈ మధ్య కాలంలో తెలంగాణ ప్రాంతానికి ఇచ్చిన రక్షణలేవీ అమలుకు నోచుకోకపోగా ఉద్యోగరంగంలో సింహభాగం సీమాంధ్రులే స్థిరపడ్డారు. పాల్వంచ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఉద్యోగాల విషయంలోనూ అదే జరిగింది. దాంతో రవీంద్రనాథ్ తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరిగిందని పోరాటం మొదలుపెట్టాడు. ఆ సెగ తెలంగాణ అంతటా తాకింది. ఈ పరిణామానికి స్పందనగా 1969లో యాదగిరి గారు 'శివుడు మూడవ కన్ను తెరవనేలేదా?' కవిత రాశాడు. అందులో ఇట్లా అంటారు. ***"ఒడలిలో విద్యుత్తు / వెయ్యి వోల్టుల బల్బు వెలిగించి రగులగా/ అగ్ని జ్వాలలె కత్తి వలె చేత ధరియించి / 'నిప్పులవాన'ను కండ్ల నిండుగా కురిపించి***

***ఈ 'ఆంధ్ర నాయకుల' నిశ్శేషముగ జేయ / కదలిరారా వీర! కదలిరారా వీర! /ప్రాణాలపై ఆశ వదిలిరారా ధీర! / శివుడు మూడవ కన్ను తెరువనే లేదా??"*** (శ్రీనివాస్, సంగిశెట్టి(సంపా). 2009 : 37) ఈ కవితా పంక్తుల్లో 'ఆంధ్ర నాయకుల' నిశ్శేషముగ జేయ' అనడంలోని కవి ఉద్దేశం స్వరాష్ట్రంలో స్వపరిపాలన. తొలిదశ ఉద్యమం ప్రారంభమైన తొలినాళ్లలోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే తెలంగాణ ప్రజల సమస్యలకు పరిష్కారం అని కవి భావించడం, వారి దార్శనికతకు నిదర్శనంగా చెప్పాలి.

విద్యుత్ రంగంలో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి ఎ.లోకేందర్ రెడ్డిగారు చెప్పిన అభిప్రాయం కీలకమైనది. **"విద్యుత్ రంగంలో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతున్నది. ముడిసరుకులు, ఇన్‌పుట్స్ తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నప్పటికీ విద్యుత్‌లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను ఇవ్వడంలో సవతి తల్లి ప్రేమనే ప్రదర్శిస్తున్నారు"** (లోకేందర్ రెడ్డి, ఎ. 2004:253). ఇటువంటి స్థితినే కవి నిరసిస్తున్నారు. సరిగ్గా ఇదే విషయాన్ని భీంపల్లి శ్రీకాంత్ రాసిన 'సోది' దీర్ఘకవితలో ఇట్లా చెప్పారు. ***"సింగరేణి / గనుల మాగాణి / తెలంగాణ రాణి / కరెంటు కోత / తెలంగాణలో / కడుపుకోత"*** (శ్రీకాంత్, భీంపల్లి. 2004 : 14) తెలంగాణలో వ్యవసాయం కుంటుపడటానికి ఉన్న కారణాల్లో విద్యుత్తు అందకపోవడం ఒకటి. ఇక్కడ కవి 'కరెంటు కోత'ను 'కడుపు కోత'గా భావించడం గమనించదగిన ముఖ్యవిషయం. కడుపుకోత కన్నబిడ్డలు దూరం అయితే వచ్చే బాధ. బిడ్డలంటే తాము జన్మనిచ్చిన వాళ్ళు. ఇక్కడ కవి కరెంటును ఉత్పత్తి చేసింది తెలంగాణ తల్లి, కానీ బిడ్డ అనే కరెంటు మాత్రం ఆంధ్రాకు తరలించబడింది. అందుకే ఆయన కడుపుకోతగా దాన్ని అర్థం చేసుకుని రాశారు.

1990ల తర్వాత ప్రారంభమైన ప్రపంచీకరణ తెలంగాణ సమాజాన్ని ఎంత ప్రభావితం చేసిందో, మానవ సంబంధాల్లో ఎటువంటి అవాంఛనీయమైన మార్పులు తీసుకువచ్చిందో తెలిపే కవిత్వం కూడా మహబూబ్ నగర్ జిల్లా కవులు రాశారు. కాశీం 2006లో రాసిన 'డాలరు కాపాడునట' కవితలో ఇలా రాశారు. ***"ఒరే కన్నా! / కాన్రోని బండపై నువ్వు చెక్కిన పేరు / అమెరికా***

*చెరిపేయకుండా ఐరాస కాపలా కాస్తుందిలే! / చెలిమెలో ఊరిన చేపపిల్ల / నీ చేతులను ముద్దాడిన జ్ఞాపకమంటావా? / ఎం.ఎన్.సి. ఎక్వేరియంలో కొంగబావ కాపలున్నాడట! / ప్రేమతో పుస్తకంలో దాచిన నెమలి ఈక / పశ్చిమ గాలికి లేసిపోయింది! / సైబర్ కేఫ్‌లకే పేటెంట్ హక్కట! / సీతాకోకచిలకల రెక్కల మీద / నువ్వు దాచుకున్న బాల్యంపై / ప్లాస్టిక్ పుప్పొడి రేణువులు / మధువు గొలుపునట! / చందమామ నీడలో నులకమంచంపై / ప్రపంచీకరణ అంగట్లో కాట గలిసిపోకుండా / డాలర్ కాపడునట!"* (కాశీం, సి. 2015 : 113, 114). ప్రపంచీకరణ పల్లెను మింగేసిందంటే అందులో కేవలం ఆర్థిక కోణం మాత్రమే లేదు. బహుముఖీనమైన మానవ జీవిత సంవేదనలు ఇమిడి ఉన్నాయి. పుట్టుక నుండి మరణం దాకా జీవితం పొడుగూతా గుర్తుంచుకోదగిన తీపి జ్ఞాపకాలూ ఉన్నాయి. అది కలకాలం నిలిచిపోయే బండమీద రాయితో చెక్కిన పేరు కావచ్చు, వాగు ఇసుక మీద కట్టుకున్న పిట్టగూడు కావచ్చు, దూప తీర్చుకోవడం కోసం తవ్విన చెలిమెలో చేపపిల్లలు ప్రత్యక్షం కావడం కావచ్చు, పుస్తకం పేజీల మధ్య దాచుకున్న నెమలీక కావచ్చు, పచ్చిక బయళ్లమీద గాల్లో ఎగురుతూ పట్టుకున్న రంగురంగుల సీతాకోక చిలుకలు కావచ్చు, ఒడుపుగా పట్టుకుని అగ్గిపెట్టెల్లో భద్రపరుచుకున్న బింగన్నలు కావచ్చు, వాకిట్లో నులకమంచం మీద వెల్లకిలా పడుకుని చూసిన చంద్రుడు కావచ్చు, ఇవన్నీ ప్రపంచీకరణ పల్లెలోనికి ప్రవేశించకముందు అగుపించిన దృశ్యాలు, సజీవ జ్ఞాపకాలు. కానీ ప్రపంచీకరణ కారణంగా ఈ జ్ఞాపకాలు వర్తమాన కాలానికి ప్రయాణించకుండా ఆగిపోయాయి. కాంక్రీట్ అడవి ప్రవేశించిన పల్లెలన్నీ ఇవాళ కృత్రిమ జీవనంలో కొలువుదీరాయని, దానికి ప్రపంచీకరణ కాపలాదారు అని వ్యంగ్యంగా చెప్పడం కవి వేదననూ, ఆవేశాన్ని వ్యక్తం చేయడంతోపాటు ప్రపంచీకరణ ఎంత ప్రమాదకరమో కూడా సూచిస్తుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ మహబూబ్ నగర్ జిల్లా వచన కవులు రాసిన కవిత్వంలో మరొక ముఖ్యమైన అంశం కరువు-వలసలు. **"నాలుగు దశాబ్దాలుగా సాగునీటి రంగంలో ఏ అభివృద్ధి లేక భూమి ఉన్నా అది ఒక వనరుగా అందుబాటులో లేకుండా పోతున్నది. భూమికి నీటి వనరులు తోడు కావాలి. అపుడే భూమి బంగారాన్ని పండిస్తుంది. లేనట్లయితే కరువుని ప్రసవిస్తుంది. పాలమూరులో నీటివనరుల అభివృద్ధి నిలిచిపోయి, ప్రకృతి కన్నెర్ర చేస్తున్న సందర్భంలో వ్యవసాయం కుంటుపడింది. చిన్నకారు రైతులు వ్యవసాయం మానేసి మోతుబరి రైతుల వద్ద కూలీలకు కుదురుకోవాలనుకున్నా, గిట్టుబాటు కాని వ్యవహారమైంది. గ్రామాల్లో వ్యవసాయం తప్ప మరేముంటుంది? వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అది కుంటుపడినపుడు వలస కూలీగా మారటం వారి సామాజిక అనివార్యత. పాలమూరు ప్రజలకు**




**అదే దిక్కయింది. అప్పులు పాలమూరు ప్రజలను వలసకూలీలుగా మార్చడం ఇంకో ప్రధాన సమస్య"** (శ్రీధరరావు దేశ్‌పాండే. 2008 : 89, 90).

పాలమూరు ప్రజల వలసలను బాల్యం నుండీ అవగతం చేసుకున్న రచయిత్రి సుచరిత. ఆమె రాసిన 'వలసగోస' కవిత వలసల్లోని విషాదాన్ని ఎత్తిపట్టింది. ***"జోడుబాగుందని జతచేశారు / శ్రావణపట్టీ మలుపకముందే / బతుకుబండి వలస పట్టాలెక్కింది / బస్సుహారను శవయాత్రముందు / మోగించిన వాద్యంలా / కాష్ఠాన్ని కౌగిలించుకోమని / పిలుస్తున్నట్లుంది / అమ్మనుంచి వేరుచేస్తున్న పెనిమిటి చేతుల్లోంచి / పక్షిలా ఎగిరిపోవాలనిపిస్తుంది / బ్రతుకుదెరువు కొరకు / వాడివెంట నా అడుగులు / అత్తింట తిరగాల్సిన పారాణి పాదాలు / పలుగురాళ్ళ మీద పట్టు తప్పుతున్నాయి / ఎన్నో ఆశలతో పట్టుకున్న చేయి / వలసబాట పట్టించింది"*** (సుచరిత. 2012:64). ఈ కవిత వలసగోసల్లో స్త్రీవాద కోణాన్ని ఆవిష్కరిస్తుంది. మామూలుగా ఉండే వలస జీవిత కష్టాల్లో స్త్రీల కష్టాలు విభిన్నమైనవని ఈ కవిత రుజువులు చూపిస్తుంది. ఉమ్మడిలో ప్రత్యేకంగా ఎదుర్కొంటున్న సమస్యల్ని ఏకరువు పెట్టింది. పాలమూరు లేబర్ భార్యాభర్తల జంటను 'లెంక' అంటారు. ఈ లెంకకు ముందస్తుగా తొమ్మిది నెలల కూలీని చెల్లించి కార్య క్షేత్రానికి తీసుకుని పోతారు. అట్లా భర్త వెంట భార్య కూడా ఎక్కడికైనా వెళ్లవల్సిందే. అట్లా వెళ్లిన కొత్తగా పెళ్లైన జంటలో స్త్రీ పడే యాతనను ఈ కవిత వివరిస్తుంది.

మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఎలా శ్రమదోపిడీకి గురవుతున్నారో కూడా స్థానిక కవులు చిత్రిక పట్టారు. ఆ వస్తువుతోనే వనపట్ల సుబ్బయ్య 'నల్ల బానిసత్వానికి నయారూపం' అనే కవిత రాశారు. ***"ఏడంతస్తుల మేడ ఎప్పుడు కూలుతుందో / ఏ కొండెప్పుడు మీద పడుతుందో / తాము తవ్విన మట్టి పెల్లలే / తమ ప్రాణాలు కప్పేస్తాయని ఎవరూహిస్తారు! / బహుళ అంతస్తుల భవనాలు,***



***నిర్మాణాలు / బడుగుల పాలిట సమాధులు / మా పల్లెల్లో కూలీలు / హైరాజులో అమ్ముడయ్యే అమాయకులు / నల్ల బానిసల అమ్మకానికి నయా రూపం / మనిషిబేరమే అసలు సారం"*** (జగన్ రెడ్డి, ఎస్(సంపా). 2012 : 48, 49). భారత రాజ్యాంగం కల్పించిన హక్కులేవీ పాలమూరు లేబరుకు వర్తించలేదు. ఎనిమిది గంటల పనిదినంగానీ, కనీస వేతనాల చట్టంగానీ, జీవించే హక్కుగానీ వీరికి ఏవీ ఉండవు. కనుకనే ఈ కవితలో వీరిని వనపట్ల సుబ్బయ్య నల్లబానిసలతో పోల్చారు.

మహబూబ్ నగర్ జిల్లా కవులు తెలంగాణ విద్యారంగం గురించి కూడా అత్యంత కీలకమైన అంశాలను కవిత్వీకరించారు. పాఠశాల విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితంలో పునాదిరాయి వంటిది. మనిషి పుట్టి, పెరిగి, తన చుట్టూ ఉన్న సమాజం ఏమిటో అర్థం చేసుకునే ప్రయత్నం మొదలు పెట్టగానే పాఠశాల ప్రవేశం జరుగుతుంది. విద్యార్థికి సరైన పద్ధతిలో విద్య నందించినప్పుడే భవిష్యత్తులో దేశానికి పనికి వచ్చే యోధులుగా తయారవుతారు. కానీ తెలంగాణలో పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైంది. విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలకు అనుమతివ్వడం ద్వారా ప్రభుత్వమే స్వయంగా విద్యా ప్రైవేటీకరణకు పూనుకున్నది. దాని పర్యవసానం ఏమిటో ఎం.రాఘవాచారి 'మా బడి' అనే కవితలో వివరించారు. ***"కూల్చిన గోడలు / రాల్చిన ఇటుకలు / ఎగిసి ఎగిసి పడుతున్న / దుమ్ము ధూళికింద / నేల మీద ఆకాశాన్ని పరిచినట్టు / తారుమీద జారిపోయే వాహనాల పొగలో / కదంచిన మైదానంలో మా బడి"*** (మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 568). ఈ కవితలో 'కూలిన గోడలు' అనే పదబంధానికి బదులుగా 'కూల్చిన గోడలు', 'రాలిన ఇటుకలు' అనే పదబంధానికి బదులుగా 'రాల్చిన ఇటుకలు' అనే ప్రయోగాలు చేశారు కవి. ఇందులోనే కవితా సారాంశం ఇమిడి ఉన్నది. కూలినా, రాలినా దానికి సహజత్వం ఉంటుంది. కానీ ఆ కూలడం సహజంగా జరగలేదు, ఎవరో పనిగట్టుకుని కూల్చారు. కనుకనే కవి 'కూల్చిన', 'రాల్చిన' అనే పదప్రయోగం చేశారు. ఆ కూల్చినవారు సీమాంధ్ర పాలకులు అని కవి ఉద్దేశం. అలా కూలడం కారణంగా పాఠశాల విద్య తరగతిలో కాకుండా మైదానంలో గడపడం జరుగుతున్నది. ఇది అత్యంత విషాదం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన వైద్యరంగం ఎలా కుదేలయ్యిందో కూడా మహబూబ్‌నగర్ జిల్లా కవులు వ్యక్తీకరించారు. నిజాం ఏలుబడిలో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రులను, ఆంధ్రవలస ప్రభుత్వం ఎలా ప్రైవేటీకరించి, స్థానిక ప్రజలకు వైద్యాన్ని అందకుండా చేసిందో వివరించారు. నిజాం ఏలుబడిలోని తెలంగాణలో కుక్క కరిస్తే నారాయణగూడలో, క్షయకు ఎర్రగడ్డలో వైద్యం చేసే ప్రభుత్వ ఆసుపత్రులు ఉండేవి. కానీ తర్వాత అవి సదుపాయాలు లేక రోగులను పరిరక్షించే స్థితిలో లేకుండా పోయాయని కాశీం 2011లో రాసిన 'నన్ను నిషేధించావు' కవితలో చెప్పారు. ***"నా తండ్రి క్షయతో రక్తం కక్కుతున్నాడు / నా తల్లి కుక్కకాటుకు పిచ్చిదయింది / ప్రభుత్వ దవాఖాన మూతబడ్డది!??"*** (కాశీం, సి. 2015 : 67). కుక్క కరిచినా, క్షయ వచ్చినా ప్రాణాంతకమైన స్థితి వస్తుంది. ఆ సరిస్థితిలో తప్పనిసరి వైద్యం అవసరం. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే శరణ్యం. కానీ ఆ ప్రభుత్వ ఆసుపత్రులు సీమాంధ్ర పాలకుల ప్రైవేటీకరణ విధానాల కారణంగా సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతున్న కారణంగా అక్కడ వైద్యం అందడం లేదు. పర్యవసానంగానే నా తండ్రి క్షయతో రక్తం కక్కుతున్నాడని, నా తల్లి కుక్కకాటుకు పిచ్చిదైపోయిందని కవి ఆవేదన, ఆవేశం వ్యక్తం చేశాడు.

పారిశ్రామిక రంగంలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని కూడా మహబూబ్‌నగర్ కవులు ఎలుగెత్తి చాటారు. సీమాంధ్ర పాలనా విధానాలవల్ల మూతపడిపోయిన పరిశ్రమలకు, ఉపాధి కోల్పోయిన తెలంగాణ ప్రజానీకానికి లెక్కలేదు. అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు, డిబిఆర్ మిల్స్, సర్‌సిల్క్, ఆల్విన్, రిపబ్లిక్ ఫోర్జ్, ఎ.పి.స్కూటర్స్, బోధన్, మిర్యాలగూడ వంటిచోట్ల సహకార రంగంలోని చక్కెర కర్మాగారాలు మూతపడగా, వాటితోపాటే ఆజంజాహీ మిల్స్, హిందుస్తాన్ కేబుల్స్, నిజాం షుగర్స్ కూడా పతనం చెందాయి. ఆ విషయాన్నే ఈ కవిత వివరించింది. సరిగ్గా ఇటువంటి భావాలతోనే భీంపల్లి శ్రీకాంత్ 'సోది' దీర్ఘకవిత రాశాడు. ***"తెలంగాణ బద్నామైతోంది / కళ్లు తెరవాలె! / ఫ్యాక్టరీలు మూతపడ్డవి / కొలువులెక్కడ!"*** (శ్రీకాంత్, భీంపల్లి. 2004 : 19). ఫ్యాక్టరీలు మూతపడడం అనేది బతకు ఆధారానికి మూతపడటమే అవుతుంది. వివిధ రంగాలలో తెలంగాణ నిరుద్యోగులకు మొండిచెయ్యి చూపిన వాతావరణంలోనే మరొకవైపు నుండి ఇట్లా పరిశ్రమల్ని మూసివేస్తూ పోవడం కారణంగా కొత్త నిరుద్యోగ వర్గం తెలంగాణలో రూపుదిద్దుకున్నది.

మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న

కాలంలో సీమాంధ్ర పెట్టుబడిదారులు, హైదరాబాదును తామే అభివృద్ధి చేశాము అనే వితండవాదాన్ని మొదలుపెట్టారు. ఆ వాదాన్ని పూర్వపక్షం చేసే కవిత్వ ప్రయత్నాన్ని కూడా పాలమూరు వచన కవులు చేపట్టారు. హైదరాబాద్ చుట్టుపక్కల తమ పెట్టుబడులతో, తమ మానవ వనరులతో, తమ ప్రయోజనాల కోసం సీమాంధ్ర పెట్టుబడిదారులు ఇండస్ట్రియల్ పార్కుల్ని నిర్మించారు. వాటి ద్వారా తెలంగాణ ప్రజలకు ఒనగూరింది ఏదీలేదు, పైగా పూడ్చుకోలేనంత నష్టం వాటిల్లింది. ఆ విషయాన్నే బోల యాదయ్య 'తెలంగాణ జ్వాల' కవితలో వివరించారు. ***"మా పొట్టగొట్టి కూడు లాగి – గూడు కూల్చి గోడ గట్టి / ఇండస్ట్రియల్ పార్కు బెట్టి – ఇంటి భూమిలో వంటమనిషిని జేసి / మమ్ము మంట గలిపి – మలమల మాడ్చిన / కలియుగ కళంకితులారా.. సీమాంధ్ర సంపన్నులారా.."*** (యాదయ్య, బోల. 2011 : 23). ఇలా కోస్తాంధ్ర సంపన్నవర్గాలు స్థాపించిన పరిశ్రమలకు ముడి సరుకు మాత్రం తెలంగాణలోంచే దండుకోవడం జరిగింది. కనుకనే ఈ కవి తమ పొట్టను కొట్టారు అన్నారు. ఏ ప్రాంతంలో లభించే సహజ వనరులను ఆ ప్రాంతానికి అవసరమైనంత వినియోగించాకే ఇతర ప్రాంతాల ప్రయోజనాలకు వినియోగించాలనేది ప్రజాస్వామిక సూత్రం. కానీ తెలంగాణకు ఈ విషయంలో అన్యాయమే జరిగిందని చెప్పాలి. తెలంగాణలో ప్రాంతేతరులు స్థాపించిన పరిశ్రమల్లో ముడిసరుకుల్ని మాత్రం తెలంగాణ నుండే రాబట్టుకుని, ఆయా పరిశ్రమల్లో తెలంగాణ వాళ్లకు ఉపాధి ఇవ్వలేదు సరికదా, ఉత్పత్తిని సైతం తమ ప్రయోజనాలకే వినియోగించుకోవడం అత్యంత దారుణమైన వాస్తవం. అందుకే ఈ కవిత రాసినట్లు తెలుస్తోంది.

### 5. ముగింపు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, అందులో భాగంగా వెలువడిన కవిత్వం– ఈ రెండూ పరస్పర పరిపూరకాలుగా సాగాయి. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో లేని, మలిదశ ఉద్యమంలో కనిపించే ప్రత్యేకత ఇదే. ఏ ప్రజా పోరాటానికైనా భౌతిక, బౌద్ధిక రూపాలు రెండూ ప్రధానమైనవే. భౌతిక పోరాటానికి బౌద్ధిక రూపం జవసత్వాలను అందిస్తే, భౌతిక పోరాటం బౌద్ధిక రంగానికి ప్రేరణను అందిస్తుంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఒక పాయగా మొదలై తెలంగాణలోని ప్రతి పల్లెను తాకడానికి బౌద్ధికరంగంలో జరిగిన కృషి అనన్య సామాన్యమైనది. వ్యాసం, కథ, నాటకం మొదలైన వాటితో పాటు కవిత్వం కూడా గణనీయమైన స్థాయిలో వెలువడింది. తక్షణ స్పందనగా వెలువడే కవిత్వంలోనైతే ఆవేశం, ఆవేదన, సమస్యల చిత్రణ, పరిష్కార మార్గాల బోధన సూక్ష్మంలో మోక్షంలా దర్శనమిస్తుంది. ప్రత్యేక తెలంగాణోద్యమంలో మొత్తం రెండు లక్షలకు పైచిలుకు వచన కవితలు వెలువడ్డాయి. వాటిలో మహబూబ్ నగర్ జిల్లా కవులు రాసిన కవిత్వం చాలా కీలకమైనది, విలక్షణమైనది.



ఎందుకంటే మొత్తం తెలంగాణ జిల్లాలన్నింటిలో అత్యంత వెనుకబడేయబడినదీ, బతుకుదెరువు అత్యంత కష్టసాధ్యంగా మారినదీ, కరువు వలసలకు నెలవైనదీ మహబూబ్ నగర్ జిల్లానే. అందుకే ఇక్కడి కవులు వెలువరించిన కవిత్వం, మొత్తం ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి తనదైన చేయూతనందించి, రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్నది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

### ఉపయుక్త గ్రంథసూచి

1. కాశీం. 2015. ***కాశీం కవిత్వం 1994 - 2014.*** హైదరాబాద్. స్నేహ. ప్రథమ ముద్రణ.

2. జగన్‌రెడ్డి, ఎన్ (సంపా). 2012. ***జులూస్.*** హైదరాబాద్. తెలంగాణ సాహితి. ప్రథమ ముద్రణ.

3. మురళీకృష్ణ, వేముగంటి (సంపా). 2012. ***మునుం.*** హైదరాబాద్. తెలంగాణ సాహిత్య సమాఖ్య. ప్రథమ ముద్రణ.

4. యాదయ్య, బోల. 2011. ***జై తెలంగాణ.*** మహబూబ్‌నగర్, స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

5. లోకేందర్‌రెడ్డి, ఎ. 2004. ***రగులుతున్న తెలంగాణ.*** హైదరాబాద్. తెలంగాణ రాష్ట్ర సాధన కమిటి. ప్రథమ ముద్రణ.

6. శ్రీకాంత్, భీంపల్లి. 2004. ***సోది.*** మహబూబ్ నగర్. పాలమూరు సాహితి. ప్రథమ ముద్రణ.

7. శ్రీధరరావు, దేశ్‌పాండే. 2008. ***తెలంగాణ రాజకీయ ఆర్థిక సామాజిక వ్యాసాలు.*** హైదరాబాద్. తెలంగాణ విద్యావంతుల వేదిక. ప్రథమ ముద్రణ.

8. శ్రీనివాస్, సంగిశెట్టి(సంపా). 2009. ***1969 - 1973 తెలంగాణ ఉద్యమ కవిత్వం.*** హైదరాబాద్. సింగిడి తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

9. సుచరిత, వెంకటేశ్వర్లు. 2012. ***అడుగులు...*** మహబూబ్‌నగర్. పాలమూరు అధ్యయన వేదిక. ప్రథమ ముద్రణ.

❖ ❖ ❖ ❖ ❖

# తెలంగాణ గిరిజన ఉద్యమాల్లో మహిళలు

గుగులోతు పూల్ సింగ్, పరిశోధక విద్యార్థి, బెంగళూరు విశ్వవిద్యాలయం. ఫోన్ : 9866217572

భారతదేశ చరిత్ర పొడవునా ఆదివాసీలు, గిరిజనుల నెత్తురు చిందని పోరాటం లేదు. వాళ్ల చెమటా, నెత్తుటితో తడవని నేల లేదు. 'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్' కోసం వాళ్లు పోరుబాటను ఎంచుకున్నారు. భారతదేశానికి వలన వచ్చిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఆదివాసీల భూముల్ని ఆక్రమించారు. సంపదను కొల్లగొట్టారు. ఆదివాసీలతో వెట్టిచాకిరీ చేయించుకున్నారు. ఎదురుతిరిగితే దాడులు చేశారు. వేలాది మందిని చంపేశారు. బ్రిటిష్ సైన్యాలను ప్రతిఘటిస్తూ ఆదివాసీలు అనేక పోరాటాలు చేశారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మొట్టమొదట పోరాడింది గిరిజనులే. తొలి తిరుగుబాటు బావుటాలెగరేసింది గిరిజనులే. ఇవి చరిత్రకెక్కని చరితార్థ పోరాటాలు. ఈ నేల విముక్తి కోసం గొంతెత్తి నినదించిన ఉద్యమాలు. ఊపిరినే ఉప్పెనగా మలిచి పోరుకెరటాలై గర్జించిన విముక్తి పోరాటాలు. ఆదివాసీలు అటవీ భూముల రక్షణ కోసం నెత్తురు చిందించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సంఘటితమై వీరోచిత పోరాటాలు నిర్వహించారు. ఆదివాసీలు ఈ దేశ సహజ వనరుల్ని కాపాడేందుకు ప్రాణాల్నే పణంగా పెట్టిన అసలైన దేశభక్తులు. ఆధిపత్యంపై తిరుగుబాటు ప్రకటించిన **'సమ్మక్క సారక్క'** నుంచీ నేడు దండకారణ్యంలో బహుళ జాతి సంస్థలకు, ప్రజా వ్యతిరేక పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న **'ప్రత్యామ్నాయ ప్రజా పోరాటాల'** దాకా గిరిజనులు అనేక పోరాటాలు నిర్మిస్తున్నారు. ఎన్నెన్నో నిర్బంధాలు ఎదుర్కొంటున్నారు. ప్రాణత్యాగం చేస్తున్నారు. తమ నెత్తుటి తడితో ఈ దేశ విముక్తి గీతం ఆలపిస్తున్నారు.

**సమ్మక్క-సారక్క తిరుగుబాటు :**

సమ్మక్క, సారక్కలు గిరిజనులు. కోయజాతికి చెందిన సాహస వనితలు. వీళ్లిద్దరూ అక్కాచెల్లెళ్లు. 13వ శతాబ్దంలో జీవించారు. సమ్మక్క ఒక సామంత రాజు భార్య. సారక్క ఓ స్వతంత్ర రాజు కూతురు. వీరి పూర్వీకులు వింధ్య పర్వతాలకు దక్షిణంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో చిన్నచిన్న రాజ్యాలు ఏర్పర్చుకున్నారు. ఆదివాసీలను జనరంజకంగా పరిపాలించారు. చెరువులు, కుంటలు తవ్వించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. వీళ్లు మాతృదేవత, శివున్ని పూజించేవాళ్లు. సమ్మక్క వంశీయులు చందావారు. బండిచిక్క దేవతను కొలిచేవారు. ఆమె తండ్రి రాయిబండాని రాజు వరంగల్ జిల్లా భూపాలపట్నం ప్రాంతానికి రాజు. ఇతని బావ సముద్రుడు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా బీజాపూర్ తాలూకా కొత్తపల్లి ప్రాంతానికి రాజు. ఇతనిది నాగవంశం. రాయిబండాని రాజు తన కూతురు సమ్మక్కను సముద్రుని కొడుకు పగిడిద్ద రాజుకిచ్చి పెండ్లి చేశాడు. పగిడిద్ద రాజు కరీంనగర్ జిల్లాలోని పొలవాస దేశాన్ని పరిపాలిస్తున్న రెండో మేదరాజుకు (క్రీ.శ.1116-1158) మేనల్లుడు. ఈయన అదే జిల్లాలోని మేడారం ప్రాంతానికి రాజు అయ్యాడు.

కాకతీయ రాజులు తమ సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ఆదివాసీల భూములను ఆక్రమించారు. ఆదివాసీలు ఈ దురాక్రమణను ఎదిరించారు. కాకతీయ సైన్యాలను ప్రతిఘటించారు. మేదరాజు, పగిడిద్ద రాజుల మీద కాకతీయ రాజు రెండో ప్రోలుడు క్రీ.శ. 1138లో యుద్ధం చేశాడు. అతని కొడుకు మొదటి ప్రతాపరుద్రుడు క్రీ.శ. 1159లో మరోసారి యుద్ధంచేసి వారిని ఓడించారు. ఓడిపోయిన మేదరాజు తన పొలవాస దేశాన్ని, సంపదను విడిచిపెట్టి గోదావరి దాటి మంచుకొండ అడవుల్లోకి పారిపోయాడు. మేడారానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో మంచుకొండ అడవులున్నాయి. ఆ అడవుల్లో ఇప్పటికీ కోయతూర్ ప్రజలు చిన్నయ్య దేవున్ని (భీముడు) పూజిస్తున్నారు.

మేదరాజు బంధువర్గం, పగిడిద్ద రాజు కుటుంబం అందరూ మేడారం బయ్యక్కపేట ప్రాంత అడవులకు వలసపోయారు. అక్కడే చిన్న రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతాపరుద్రుని సేనలు మళ్లీ వారిపై దండయాత్ర చేశాయి. ఇరు వర్గాల మధ్య దయ్యాల మడుగు దగ్గర 10 రోజులు యుద్ధం జరిగింది. యుద్ధంలో సమ్మక్క కొడుకు జంపన్న భీకరంగా పోరాడి మరణించాడు. అప్పటి నుంచి ఆ ప్రాంతంలోని వాగుకు జంపన్న వాగు అని పేరొచ్చింది. ఈ వాగుకే సంపంగి వాగు అనే పేరు కూడా ఉంది.

సమ్మక్క, సారక్కలు కాకతీయ సైన్యాలపై పోరాడి మరణించారు. అనేకమంది ఆదివాసీ వీరులు వీరోచింగా పోరాడి నేలకొరిగారు. వీరమరణం పొందినవారిని స్మరించుకోవడానికి వీరగల్ శిల్పాలను చెక్కించడం ఆనాటి ఆనవాయితీ. తమ జాతి విముక్తి కోసం ప్రాణాలిచ్చిన ఆదివాసీ వీరయోధులు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆ వీరుల స్మృతిలో రెండేళ్లకోసారి గిరిజన జాతర జరుగుతుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర. ధిక్కారమే తమ ప్రాణంగా బతికే ఆదివాసీలకు ఈ పోరాటం గొప్ప స్ఫూర్తినిచ్చింది. భవిష్యత్ పోరాటాలకు మార్గదర్శిగా నిలిచింది. అటవీ భూముల రక్షణకు, ఆదివాసీల రక్షణకు ఈ పోరాటం వెలుగు దారైంది.

**తెలంగాణ సాయుధ పోరాటం :**

నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ అంతటా భూస్వామ్య

పోరాటాలు పెల్లుబికాయి. పల్లెలన్నీ ప్రభంజనమయ్యాయి. భూస్వాముల్నీ, జమీందార్‌లనీ, రజాకార్‌లనీ ప్రతిఘటించారు. 'దున్నేవారికే భూమి' నినాదంతో గ్రామాలన్నీ యుద్ధభూమిగా మారాయి. ఈ పోరాట స్ఫూర్తితో గిరిజన మహిళలు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఈ కాలంలో నల్లగొండ జిల్లాలో లంబాడీ మహిళలు రణన్నినాదమయ్యారు. తమ భర్తలతోపాటుగా సాయుధ శిక్షణ పొందారు. తండాలనే రక్షణ క్యాంపులుగా చేసుకొని యుద్ధంచేశారు. జన్నారెడ్డి ప్రతాపరెడ్డి, విసునూరు రామచంద్రారెడ్డి గూండాల దాడులను ఎదుర్కొన్నారు. ఎర్రబాడు, బాలెంల, రావిపాడు, పాతసూర్యాపేట, కడివెండి, మొండ్రాయి, ధర్మారం, ధర్మాపురం, గ్రామాల్లో లంబాడీ మహిళలు భూస్వాములను ఎదిరించారు. గిరిజన ఉద్యమాల్లో మహిళలు కూడా వీరోచితంగా పోరాడారు. నిర్బంధాలు ఎదుర్కొన్నారు. అనన్య త్యాగాలు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని రగిలించిన విప్లవాల ఖిల్లా నల్లగొండ జిల్లా అంతటా గిరిజన మహిళలు యుద్ధభూమిలోకి నడిచారు. భూస్వాములు, జమీందార్‌లు, దేశ్‌ముఖ్‌లపై తిగరబడ్డారు. 'దున్నేవారికే భూమి' నినాదంతో లక్షలాది మందిని పోరాటాల్లోకి నడిపించారు. 'ఆంధ్రమహాసభ' నుంచీ 'తెలంగాణ సాయుధ పోరాటం' దాకా వందలాది మంది గిరిజన మహిళలు సాయుధమయ్యారు. రజాకార్‌లను ఎదుర్కొన్నారు. భూపోరాటాలు నిర్వహించారు. ఈ పోరాటంలో అనేకమంది మహిళలు రజాకార్‌ల చేతుల్లో లైంగిక దాడులకు గురయ్యారు. సజీవ దహనమయ్యారు. చరిత్రలో అనామకంగా మిగిలారు. చరిత్ర సృష్టించిన మట్టి మనుషుల త్యాగాలు ఈ మట్టిలో కలిసిపోయాయి.

**వీరయోధ జాటోత్ పుల్లమ్మ (పూల్నీ బాయి):**


తెలంగాణ సాయుధ పోరాట కాలాన పోలీసులు ధర్మాపురంలో (ఫిబ్రవరి, 1948) క్యాంపులు వేశారు. వీరికి తోడు అదనంగా బయట నుండి వచ్చిన పోలీస్ సబ్‌ఇన్స్పెక్టర్‌లు కలసి పడమటి తండా లంబాడీలపై దాడులు చేశారు. ఆ తండాకు చెందిన జోద్యా, సాంక్రు పోలీసులకు దొరకకుండా అజ్ఞాతంలో ఉన్నారు. వారిని అరెస్టుచేసే నెపంమీద పోలీసులు స్త్రీలపై ఆత్యాచారానికి తెగబడ్డారు. అంతకుముందే పార్టీ యిచ్చిన కార్యక్రమం ప్రకారం జోద్యా భార్య కామ్రేడ్ పుల్లమ్మ (పూల్నీ బాయి) స్త్రీలను సంఘటితం చేసింది. స్త్రీలు పోలీసుల కండ్లలో కారం చల్లారు. రోకలిబండలతో తరిమికొట్టారు. అప్పట్నించీ లంబాడీల ఇండ్లల్లోకి వెళ్లడానికీ, స్త్రీలను బలాత్కరించడానికి పోలీసులు సాహసించలేదు. జోద్యా రామన్నపేట ప్రాంతం పల్లెర్ల గ్రామంలో అరెస్టయ్యాడు. అతన్ని పోలీసులు చిత్రహింసలు పెట్టి జైలుకు పంపారు. అతనిపై ఒక హత్యానేరం మోపారు. దీంతో జైలుకు పోవాల్సి వచ్చింది. వీరనారి పుల్లమ్మ మహిళలందరికీ పాటలు నేర్పేది. పురుషులతో పాటుగా పోలీసుల్ని



ఎదిరించేది. శత్రుదాడుల్లో ధైర్య సాహసాలతో పాల్గొనేది. దళ సభ్యులకు అండగా ఉండేది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకురాలు మల్లు స్వరాజ్యం, శశిరేఖలు నెలరోజుల పాటు పుల్లమ్మ ఇంట్లోనే షెల్టర్ తీసుకున్నారు. అజ్ఞాతం నుంచే పోరాట వ్యూహ రచన చేశారు. శత్రువులపై దాడులు చేశారు. ఈ దాడులన్నిటిలో వీరనారి పుల్లమ్మ తెగువతో పోరాడింది.

**వీరవనిత రమణీబాయి :**

లంబాడీల వీరవనిత రమణీబాయిది తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా నెక్కొండ గేట్‌పల్లి తండా. తల్లిదండ్రులు మీరాబాయి, రాణానాయక్. ఈమె తమ్ముడు వ్యాగ్యా నాయక్. వీరి తండ్రి చుట్టుపక్కల తండాల గిరిజనులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండేవాడు. ఈమె తండ్రిని ఆదర్శంగా తీసుకున్నది. రమణీబాయి, వాగ్యా నాయక్‌లు తండ్రి బాటలోనే నడిచారు. తర్వాత వ్యాగ్యా నాయక్ చంద్రుగొండ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. తర్వాత వీళ్లిద్దరూ మేనేజ్‌మెంట్ హాస్టల్ నడిపారు. హాస్టల్ విద్యార్థులకు సామాజిక స్పృహ కల్పించడంలో క్రియాశీలక భూమిక నిర్వహించారు. విద్యార్థుల్లో ఉద్యమ స్ఫూర్తి నింపారు. తమ సొంత గ్రామమైన నెక్కొండ ప్రాంతం నుంచి ఉద్యమం చేశారు. తెలంగాణ లంబాడీలను ఎస్టీ జాబితాలో కలపాలని ఉద్యమాన్ని ఉధృతం చేశారు. వాగ్యానాయక్ సహకారంతో 1964లో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి వసంత్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. తెలంగాణ లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డితో నెక్కొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో **'ఒకే భాష, ఒకే సంస్కృతి'** కలిగిన లంబాడీలను ఆంధ్రప్రాంతంలో ఎస్టీలుగా, తెలంగాణ ప్రాంతంలో **'డీనోటిఫైడ్ ట్రైబ్'**గా గుర్తించడం సరికాదన్నారు. తెలంగాణ ప్రాంత లంబాడీలను ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీని కలిసి వినతి పత్రం ఇచ్చారు. 1968 ఉద్యమ సందర్భంలో హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ఇందిరా గాంధీని కలిశారు. తెలంగాణ లంబాడీల జీవన



స్థితిగతుల గురించి వివరించారు. ఈ ప్రాంత లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి పత్రం అందజేశారు. తర్వాత ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఈ ఉద్యమానికి వాగ్యానాయక్, రవీందర్ నాయక్, రమణీబాయి నాయకత్వం వహించారు.

**వీరనారి హీరీ బాయి**

హీరీ బాయిది పాలమూరు జిల్లా. ఆమె సాహసి. నమ్మిన ప్రజల కోసం కడదాకా నిలబడ్డది. వాళ్ల కడుపు నింపేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నది. భూస్వాముల, దొరలకు సింహ స్వప్నంలా మారింది. స్వాతంత్ర్యానికి పూర్వం లంబాడీలు ఎడ్ల బండ్లపై మూటలు వేసుకొని లదణీలు (రవాణా, అమ్మకం) చేస్తూ బతికేవాళ్లు. కాలక్రమేణా యాంత్రికత పెరిగాక లారీలు, ట్రాక్టర్లు వచ్చాయి. దీంతో లంబాడీల రవాణా, అమ్మకాలు తగ్గిపోయాయి. దీంతో హీరీ తాత తీవ్ర ఇబ్బందుల్లో పడ్డాడు. అప్పటిదాకా హీరీ తన తాత, తండ్రికి సాయంగా ఉన్నది. ఈ పనిచేస్తూనే అడవిలో దొరికే పండ్లూ, తేనె, దుంపలు తొవ్వుకొని బతికింది. లంబాడీలంతా ఆ రోజుల్లో అడవినే నమ్ముకున్నారు. అడవిని నరికి పోడు వ్యవసాయం చేశారు.

25 ఏళ్ల వయసులో గంగారం పెద్ద తండాలో ఉండే రాట్లావత్ లాలుతో ఆమెకు పెండ్లి చేశారు. ఆమె ఆజానుబాహురాలు. తెలివైన యువతి. ఆ తండాలో బతుకు దెరువు లేదు. అత్తమామల్ని, భర్తను వెంటపెట్టుకుని పుట్టింటికి వచ్చింది. అక్కడా అదే కరువు. అదే ఆకలి. కొంతకాలమయ్యాక తీవ్రమైన కరువు వచ్చింది. దీంతో తండా జనం ఆకలితో అలమటించారు. వాళ్ల ఆర్తనాదాలు చూసి హీరీ కరిగిపోయింది. చుట్టుపక్కల ఊళ్లలో ఉండే భూస్వాముల ఇళ్లకు పోయి **'అయ్యా తండాలో ఆకలితో జనం చచ్చేట్టున్నరు. మీ ఇండ్లలో గుమ్ముల నిండ గింజలున్నయ్. మాకు తినడానికి పిడికెడు దానం చేయండి'** అని అడిగింది. ఆమె బాధ ఎవ్వరూ అర్థం చేసుకోలేదు. దీంతో తండా జనం ఆకలి తీర్చేందుకు తీవ్రంగా ఆలోచించింది. కందనూలు, వనపర్తి నుండి బాదేపల్లి (జడ్చర్ల) మార్కెట్‌కు పోయే లారీలు, ఎడ్లబండ్లు ఆపి బియ్యం, పప్పులు, గింజలు, నూనె దానం చేయమని ప్రాధేయపడింది. లంబాడోళ్ల ఆకలి కన్నీళ్లకు ధనవంతులు, వ్యాపారులు, భూస్వాములు కనికరించలేదు. దీంతో ఆమె తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. **'ఏ లారీలు మన పొట్టకొట్టాయో ఆ లారీల పని పట్టాలే'** అని తండా జనాన్ని చైతన్యం చేసింది. తన తమ్ముళ్లు, బంధువులతో ముఠాను తయారు చేసింది. 25 మంది ఉన్న ఈ ముఠాలో రూప్లు, లచ్యా, రెడ్యా, కేవ్లా, దూద్యా, లచ్మా ముఖ్యులు.

**ఆకలి పోరాటం**

తండాల ఆకలి తీర్చేందుకు దొరల గడీలను, భూస్వాముల కల్లాలను హీరి ముఠా లక్ష్యంగా ఎంచుకునేది. వాటిని పట్టపగలే దోచేది. కానీ దొంగతనంగా ఎత్తుకుపోయేది కాదు. ధాన్యం నిండిన గడీలకు పోయి దొరలను కలిసేది. పంటలు బాగా పండిన భూస్వాముల ఇండ్లకూ పోయేది. **'మీకు భూములు, భవంతులున్నయి. సొమ్ముంది. గుడిసెల్లో ఉండే పేదోళ్లకు ధాన్యం, నూనె ఇస్తే సల్లంగ బతుకుతరు'** అని అడిగేది. ఇస్తే తీసుకునేది. **'ఇవ్వం పో'** అన్న గడీని మూడు రోజుల్లో దోచుకుపోయేది. **'దొరా అడిగితే ఇయ్యనన్నవు కదా.. మూడు రోజుల్లో నీ ధాన్యం ఎత్తుకుపోతా చూడు'** అని సవాల్ చేసేది. చెప్పినట్టే చేసేది.

నిజాం కాలంలో రోడ్లు చిన్నగా ఉండేవి. లారీలు నెమ్మదిగా పోయేవి. ఆ లారీలోని సరుకుని దోచుకోవడమే హీరి లక్ష్యం. రోడ్డుకు రెండు వైపులా చెట్లు దట్టంగా ఉన్న కోడుపర్తి మిట్ట దగ్గర లారీలు, బండ్లు దోచుకునేందుకు వ్యూహం పన్నింది. మధ్యరాత్రి రోడ్డు పక్కగా ఉండే పెద్ద, పెద్ద చెట్లపైకి ఎక్కి లారీలు రాగానే అమాంతం దూకేది. లారీలో ఉన్న బియ్యం, పప్పులు, నూనె డబ్బాలు, ధాన్యం సంచుల్ని కిందికి విసిరేసేది. ఆమె అనుచరులు వాటిని అందుకుని పొదల మాటుకు పోయేవాళ్లు. తనపని పూర్తయ్యాక రోడ్డుపైన ఉన్న ఏదయినా చెట్టుకొమ్మను అందుకుని, ఆ చెట్టెక్కేది హీరి. ఎవరైనా చూసి వెంటబడితే మెరుపు వేగంతో పరుగెత్తుతూ చీకట్లో కలిసిపోయేది. ఎత్తుకొచ్చిన సరుకునంతా తన ఇంటికి తీసుకుపోకుండా తండా జనానికి పంచేది. అట్లా పాలమూరు తండాల్లో ఆకలి బాధతో ఉన్న లంబాడీలకు హీరి పెద్ద దిక్కయింది.

**ఇందిరమ్మ ఇంటికి**

దోపిడీల జీవనాధారం కాకూడదని లంబాడీలు వ్యవసాయం బాటపట్టారు. అడవి కొట్టి పోడుచేస్తున్నారు. దొరలు వాళ్లకు అడ్డుపడుతున్నారు. **"ఈ అడవి మాది. భూమి మీద మాకే హక్కుందని"** లంబాడీలను బెదిరించేవాళ్లట. దొరలు ఎక్కడ అడ్డు పడితే హీరి అక్కడికిపోయి దొరలను బెదిరించింది. గడీలను దోచి ధాన్యం పంచిన తండా జనంతో అడవిని నరికించింది. భూమిని చదును చేయించింది. కానీ దొరలు, పటేళ్ల ఆగడాలు ఆగట్లేదు. కాస్తులో ఉన్న పోడు భూముల్ని దొరలు గుంజుకున్నరు.

**'భూమి ఎవడి సొత్తూ కాదు. దున్నేవాడికే భూమి హక్కు'** అని పాలమూరు తండాల తరపున హీరి ఢిల్లీకి బయలుదేరింది. జీవితంలో ఎన్నడూ బస్సెక్కని ఆమె రైలెక్కింది. జొన్న రొట్టెలతో ఢిల్లీకి సద్ది కట్టుకుంది. లంబాడీ భాషలోనే మాట్లాడుతూ ఇందిరా గాంధీ (నాటి ప్రధాన మంత్రి) ఇంటి దగ్గరికి పోయింది. తన బాధను ఇందిరమ్మతో చెప్పుకోడానికి వచ్చిన అని చెప్పింది. కానీ సెక్యూరిటీ అనుమతించ లేదు. అక్కడి నుంచి పొమ్మన్నా హీరి పోలేదు. తెచ్చుకున్న జొన్న రొట్టెలు తిని అక్కడే పడుకుంది. రెండు రోజులు కూర్చున్న చోటు నుంచి కదల్లే. మొత్తానికి మూడో రోజు ప్రధాన మంత్రి ఇంటి గేటు తెరుచుకుంది. వాహనాలు వస్తున్న సప్పుడు హీరికి వినపడింది. అప్రమత్తమైన హీరి ఒక్కసారిగా ప్రధాన మంత్రి కాన్వాయికి అడ్డుపడ్డది. గమనించిన ఇందిరా గాంధీ కారు దిగింది. ఆమెను ఇటు పంపించండని పోలీసులను ఆదేశించింది. ఇందిరాగాంధీ దగ్గరకు వచ్చి నమస్కరించింది హీరి. **'క్యా తక్లీఫ్ హై. ఆప్ కో క్యా చాహియే?'** అని అడిగింది. **'అడవి కొట్టుకుని బతికే లంబాడోళ్లని దొరలు బెదిరిస్తున్నరు. పోడు భూములకు పట్టాలిస్తే మంచిగ బతుకుతం. దొరలు పెట్టిన కేసులు తీసేయాలె'** అని హీరి అన్నది. ఆమె మాటలు ఇందిరకు ఆసక్తి కలిగించాయి. ఇంకాసేపు హీరితో మాట్లాడింది. కొద్ది నిమిషాల తర్వాత హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫోన్ మోగింది. ముఖ్యమంత్రి హలో అనగానే.. **'మై ఇందిరా గాంధీ బాత్ కర్ రహీ హు'** అని వినిపించింది. అంతే హీరి సమస్యకు పరిష్కారం కూడా చెప్పింది. అమలు దున్నేవాడికే భూమి చేయడమే మీ బాధ్యతని చెప్పింది. హీరీని రైల్లో హైదరాబాద్‌కు పంపించాలని ఇందిరాగాంధీ ఆదేశించింది. అధికారులు ఆమెను హైదరాబాద్ పంపించారు. హీరి రైలు దిగగానే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. పెద్ద హోటల్లో గది ఇచ్చారు. రుచికరమైన వంటకాలతో భోజనం పెట్టారు. వివరాలన్నీ తీసుకుని ఇంటికి పంపించారు. హీరి చెప్పినట్లుగా పోడు చేసుకునే లంబాడీలకు భూమిపై హక్కు వచ్చింది. భూములకు పట్టాలొచ్చాయి. అందరికీ వచ్చినట్లే హీరి భూమికి కూడా పట్టా వచ్చింది.

బాజీపూర్ తండా నుండి విడిపోయి తన పేరున హీరి తండాను (కల్వకుంట తండా) నిర్మించింది. తండాల్లో కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలను పరిష్కరించే నసాబ్లు నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ జిల్లాలోని తండాలన్నీ తిరిగింది. ఏ ఊరు పోయినా నడిచే పోయేది. ఆ రోజుల్లో ఆమెను మహబూబ్ నగర్, నల్లగొండ, వరంగల్, గుల్బర్గా ప్రాంతాల ప్రజలు ఆడసింహంగా, లేడీ రాబిన్ హుడ్‌గా చెప్పుకునేవాళ్లు. హీరి 6 సెప్టెంబర్ 2008న కన్నుమూసింది. అప్పటికి ఆమె వయసు 120 ఏళ్లు. ఇది చరిత్రకెక్కని లేడీ రాబిన్ హుడ్, తెలంగాణ వీరనారి లంబాడీ హీరి గాథ. హీరీ జీవిత గాథను సమాజానికి తెలిపేందుకు అంగోత్ వెంకట్ పవార్ (గుడ్లనర్వ,



బిజినపల్లి మండలం, నాగర్ కర్నూల్ జిల్లా) అనే ఉపాధ్యాయుడు అనేక ప్రాంతాలు తిరిగాడు. నల్లగొండ, వికారాబాద్, కర్నాటక, మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామాలు, తండాలు తిరిగాడు. వృద్ధులను అప్పటి విశేషాలు అడిగి తెలుసుకున్నాడు. ఆమె సాహసాల్ని విన్నాడు. రికార్డ్ చేశాడు. అప్పటి దొరల సంబంధీకులతో మాట్లాడాడు. హీరి అనుచరులు ఊద్యా (పుల్లగిరి తండా), ముడావత్ బద్యాని కలిశాడు. హీరీ సాహస గాథల్ని ప్రపంచానికి అందించాడు.

**చెంచు లక్ష్మి :**

పచ్చని అడవితల్లి ఒడిలో పుట్టి పెరిగిన నిరుపేద చెంచుబిడ్డ వీరమ్మ. తల్లిదండ్రులు నిరుపేదలు. పేద రైతు కూలీలు. ఆమె ఒక నిర్మలగా, లక్ష్మక్కగా చెందిన పరిణామం అద్భుతమైనది. నల్లమల అటవీ ప్రాంతంలో ఆదివాసీలను సంఘటితం చేసిన వీరనారి చెంచు లక్ష్మి. నల్లమల రైతాంగాన్ని పోరాటాల్లోకి వెల్లువలా కదిలించింది. నల్లమల రైతాంగ విప్లవానికి దారులు వేసింది. ఆమె అసలు పేరు ఈరక్క. మహబూబ్‌నగర్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామంలో చెంచు ఆదివాసీ తెగలో పుట్టింది. ఆమె చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. ఏ ఆలనాపాలనా లేని బతుకైంది. ఇష్టంలేని వ్యక్తితో పెళ్లి చేశారు. కట్టు బానిసలా బతకలేక బయటకు రావాలనుకున్నది. పితృస్వామ్యంతో ఘర్షణలు పడి ఇష్టంలేని భర్తను వొదిలించుకుంది. ఇంటినుంచి పారిపోయింది. సాంఘిక కట్టుబాట్లను తెంచుకుంటూ అడవిలో జీవితం గడిపింది. సరిగ్గా ఈ సమయంలోనే అడవిలో అన్నలూ అక్కల సాహస గాథలు చెంచు గూడేల్ని చేరాయి. ఈ క్రమంలో కిరణ్ అరుణక్కలు పరిచయ మయ్యారు. ఇది ఆమె జీవితాన్ని మలుపుతిప్పిన సంఘటన. వాళ్లిద్దరి ద్వారా ఆమెకు 'పీపుల్స్ వార్' పార్టీతో పరిచయమైంది. 'అరుణ' వెంట తిరగడం నేర్చుకున్నది. ఉద్యమంలోకి వచ్చేంతవరకూ ఆమె కూడా అందరు చెంచు ప్రజల్లాగే అక్షరమ్ముక్క రాని అమ్మాయే. అప్పటికి ఆ పార్టీ లింగాల మండలం కేంద్రంగా నల్లమల అటవీ పోరాటాన్ని నిర్మిస్తున్నది. ఆ పోరాటాలకు ఆకర్షితురాలై తన అన్నతోపాటు 1989లోనే పూర్తికాలపు కార్యకర్తగా పార్టీలో చేరింది.



పట్టుదలతో చదువు నేర్చుకున్నది. 1990లలో రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబికిన ప్రజా ఆందోళనలలో, పోరాటాల్లో ప్రజలను సమీకరించింది. సంఘటితం చేసింది. 1994లో జిల్లాలో కరువుతో అలమటిస్తున్న ప్రజానీకాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కరువు దాడులకు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. మన్ననూర్, పదర గ్రామాలలో కరువు దాడుల్లో పాల్గొన్నది. 1995 సభలో అచ్చంపేట ఏరియాలో గ్రామగ్రామానికి తిరుగుతూ మహిళా సంఘాలను నిర్మాణం చేసింది.

1997లో అచ్చంపేట ఏరియాలోని మాచారం భూస్వాములైన నారాయణరెడ్డి, శంకరయ్యల 120 ఎకరాలు, ఐనోలు భూస్వామి రామచంద్రారెడ్డి (సిపిఎం) తదితర భూస్వాముల 250 ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవడంలో, నిర్బంధంలో ప్రజలను కదిలించడంలో ముందు నిలిచింది. అజలాపురంలో స్వాధీనం చేసుకున్న 200 ఎకరాల పొలం పంపకంలో ప్రజలను కదిలించడం లోనూ, శెట్టిపల్లి, పేటలోని భూస్వాముల భూములను స్వాధీనం చేసుకోవడంలోను తనవంతు పాత్రను నిర్వహించింది. **"సామాజికంగా వెనుకబడిన తరగతులనుంచి ఉద్యమంలోకి వచ్చే వాళ్ళకి, ముఖ్యంగా స్త్రీలకి 'ఒక తక్కువభావం' (ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు) వెంటాడే అవకాశం వుంటుంది. అలాటి కాంప్లెక్సు లక్ష్మక్కలో మచ్చుకైనా కనిపించేది కాదు. పట్టుబట్టి రాయనూ చదవనూ నేర్చుకొని సాటివాళ్ళలో మేటిగా నిలవడానికే ఆమె నిరంతరం ప్రయత్నించింది. ఎన్ని మైళ్ళు నడిచినా, అలసిపోని ఆమె ఎప్పుడూ ఒక కొత్తదాడికి సంసిద్ధమై వున్నట్టు తాజాగా కనిపించేది. అందుకామె సామాజికనేపథ్యం బాగా తోడ్పడింది. గోరంతలను కొండంతలుగా ప్రదర్శించుకునే స్వభావం (ఎగ్జిబిషనిజం) ఆమెలో ఏమాత్రం కనబడేది కాదు"** అని ఆమె సహచరి కృష్ణమ్మ గుర్తుచేసుకున్నది. (కొండవాగు-కొత్తవెలుగు, 2000, పు.37)

1999 మార్చి15న ఆమ్రాబాద్ మండలం తాటిగుండాల సమీపంలో గల తిమ్మిరెడ్డి బయలు దగ్గర పోలీసుల కాల్పుల్లో నాయకత్వ టీంను కాపాడి లక్ష్మక్క, లక్ష్మణ్ చనిపోయారు. ఆమె పితృస్వామ్యం పై పోరాడుతూ చేసిన రచనలు, ఇతర రచనలన్నీ పోయాయి. విరసం ప్రచురించిన సంకలనంలో చేరిన రెండుమూడు రచనలను బట్టే పాట, వచన కవిత, కథ ప్రక్రియల్లో ఆమె ఎంత సునాయాసంగా సాహితీ సృజన చేసిందో మనం గ్రహించవచ్చు. 'అల' అనే కలంపేరుతో ఆమె రచనలు చేసింది. 1995 కాన్ఫరెన్సులో ఆమె చదివిన కవిత "ఆమె ఉప్పొంగిన అడవి కెరటం". 'కమ్యూనిస్టు పెండ్లంటే', 'అమ్మకోసం' (కవిత్వం), 'కామ్రేడ్ ఆంజనేయులు' (పాట); కొత్తవెలుగు (కథ) రాసింది. అడవిలో గెరిల్లాగా ఉన్నపుడు అనేక రచనలు చేసివుండొచ్చు. అవన్నీ ఎక్కడా భద్రపర్చుకోకపోవడం వల్ల ఆమె సాహితీ సృజన మరింతగా వెలుగులోకి రాలేదు. చెంచు గూడెంలో పుట్టి అణగారిన ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేసింది. అణచివేతకు గురవుతున్న స్త్రీలందరికీ ఆమె జీవితం, పోరాటం, త్యాగం స్ఫూర్తిగా నిలుస్తుంది.

ఇట్లా భారతదేశ చరిత్ర పొడవునా గిరిజనులు ఈ నేల విముక్తి కోసం రక్తతర్పణ చేస్తున్నారు. భవిష్యత్ పోరాటాలకు దిక్సూచిలా నిలుస్తున్నారు. 'జల్, జంగల్, జమీన్' కోసం పోరుజెండాలై రెపరెపలాడుతున్నారు.

**ఆధార గ్రంథాలు :**


1. రాజేశ్వరరావు, చంద్ర. 'చారిత్రాత్మక తెలంగాణా పోరాటం', 1972. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

2. విరసం. 'కొండవాగు కొత్త వెలుగు', 2000.

3. ప్రతాపరెడ్డి, కందిమళ్ల. 'వీరతెలంగాణ సాయుధ సమరం', 2015. నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

4. వెంకన్న, జిలుకర. 'బంజారాభీం దర్గ్యానాయక్ వీర కుటుంబం-ధీర చరితం', 2017, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

5. నాగేంద్ర, హంసావత్. 'గిరిజన వీరులు', 2016.

6. ప్రొ. రాందాస్, రూపావత్. 'తెలంగాణలో గిరిజనులు-తిరుగుబాట్లు'. 2016. నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

7. నరసింహులు, నల్లా. 'తెలంగాణా సాయుధ పోరాటం నా అనుభవాలు'. 2020(ద్వి.ము.) నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

8. తిరుమలి, ఇనుకొండ. 'తిరగబడ్డ తెలంగాణ'. 2008. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.

9. స్త్రీ విముక్తి సంఘటన. 'ఆంధ్రప్రదేశ్‌లో మహిళా ఉద్యమ పరిణామం'. 2009. స్త్రీ విముక్తి సంఘటన, ఆంధ్రప్రదేశ్.


❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 (47) హైదరాబాద్ జులై : 2024

# తెలుగు సాహిత్యంలో లక్ష్మీ స్తుతి

**ఆర్. ధనలక్ష్మి,** పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 728 798 5428

"హితేన సహితం సాహిత్యం" అన్నారు ఆలంకారికులు అనగా మంచిని బోధించేది, మేలును చేకూర్చేది సాహిత్యం అని అర్థం. తెలుగులో వచ్చిన కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, పాటలు, కథలు, యక్షగానాలు, దండకాలు మొదలైన ప్రక్రియలు, రచనల సమాహారమే తెలుగు సాహిత్యం. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో లక్ష్మి స్వరూపాన్ని అధ్యయనం చేయడమే **'తెలుగు సాహిత్యంలో లక్ష్మీ స్తుతి'.**

**'లక్ష్మి' పదం పుట్టుక :**

'మహాలక్ష్మి రత్నకోశము' లక్ష్మీ పదం పుట్టుకను గూర్చి వివరిస్తూ 'లక్ష్మి' అనుపదము 'లషతి' అను మూలధాతువు నుంచి ఉద్భవించినదని లషతి అనగా 'లాభ భావము' లేదా లక్షణాత్ (identification) లేక లాంఛనాత్ (symbolising) అని తెలియ జేస్తుంది. యాస్కుని నిరుక్తం కూడా 'లాభాత్ లక్ష్మి' అనగా లాభము వలన లక్ష్మి అనబడుతుందని, 'లాభ' అనే సంస్కృత ధాతువు నుండి లక్ష్మి శబ్దము ఏర్పడిందని వివరిస్తోంది.

తెలుగు నిఘంటువులు లక్ష్మి శబ్దానికి అంబుజాసన, అబ్ధిజ, అమల, ఇందిర, కమలాలయ, కలిమి చెలి, తమ్మిఇంటిగరిత, తల్లి తల్లి, పద్మ, పద్మకర, పద్మ గుణ, పాల మున్నీటికూతురు, మంగళ దేవత, మాధవి, రమ, శ్రీ, సంపద, సింధుజ, హరిప్రియ అనే అర్థాలను ఇవ్వగా లక్ష్మీ అష్టోత్తర శతనామావళి ప్రకృతి, వికృతి, విద్య, విభూతి, సురభి, శుచి, హిరణ్మయి, వసుధ, క్షమ, బుద్ధి, ధర్మ నిలయ, విమల, బిల్వ నిలయ, శుభప్రద మొదలైన నామాలతో లక్ష్మిని కీర్తించింది.

అంటే ఇక్కడ లక్ష్మిని అధ్యయనం చేసే సందర్భంలో సంపద అనే మామూలు అర్థంతో కాకుండా ప్రకృతి, విమల, బిల్వ నిలయ, శుభప్రద మొదలైన అర్థాలను పరికించి చూసినట్లయితే లక్ష్మి యొక్క అసలైన స్వరూపం గోచరిస్తుంది.

పౌరాణిక సాహిత్యం ప్రకారం లక్ష్మి క్షీరసాగర మథనం ద్వారా ఉద్భవించిందని ఆమెతో పాటుగా చంద్రుడు పుట్టాడని అందుకే చంద్రున్ని లక్ష్మికి సోదరునిగా పిలవడం జరుగుతుంది. దీనిని వైజ్ఞానిక కోణంలో పరిశీలించినట్లయితే పాలసముద్రము అనే పాలపుంతలో ఎక్కువ గ్రహాలు ఆస్టరాయిడ్స్ తిరుగుతున్న రోజుల్లో ఒక ఆస్టరాయిడ్ వచ్చి భూమిని బలంగా తాకడం వల్ల భూమి నుండి కొంత భాగం విడిపోయి కుజుడిగా మారింది. ఈ సమయంలో భూమి కొంత ముందుకు జరగడం వల్ల భూమిపైన విపరీతమైన ఉల్కాపాతం పడటం ప్రారంభమైంది. ఈ ఉల్కలు మంచును తీసుకొని రావటం వల్ల భూమి మొత్తం జలమయం అయిపోయింది. ఇదే సమయంలో మరొక ఆస్టరాయిడ్ వచ్చి భూమిని తాకడంతో మరొక ముక్క భూమి నుండి విడిపోయింది. ఈ దెబ్బకు భూమి కొంత వంగి తిరగటం జరిగింది. విడిపోయిన ముక్కకు తగినంత ద్రవ్యరాశి లేకపోవడంతో భూమి యొక్క ఆకర్షణ శక్తికి గురై భూమి చుట్టూ తిరుగుతూ చంద్రునిగా మారింది. భూమి పైన ఉన్న నీరు అంతా చంద్రుడు విడిపోయిన భాగంలోకి చేరి సముద్రంగా మారింది. క్రమంగా భూమి తన చుట్టూ తాను



తిరుగుకుంటూ సూర్యుని చుట్టూ తిరుగుతూ క్రమంగా ఓజోన్ పొరను ఏర్పాటు చేసుకుంది. దీని ద్వారా భూమిపై ప్రకృతి ఏర్పడింది. ఆ ప్రకృతే లక్ష్మి అందుకే లక్ష్మీ అష్టోత్తర శతనామాల్లో లక్ష్మి ప్రకృత్యై నమః అనే నామంతో పిలువబడింది. ఇదే సమయంలో చంద్రుడు పుట్టడం వల్ల అతన్ని లక్ష్మికి సోదరునిగా పిలవడం జరుగుతుంది.

లక్ష్మి 'బిల్వ నిలయ' అనే నామాన్ని గనక తీసుకున్నట్లయితే –

**"ఆదిత్యవర్ణే తపసోధిజాతో వనస్పతిస్తవ వృక్షోఽథ బిల్వః తస్య ఫలాని తపసానుదంతు మాయాంత రాయాశ్చ బాహ్యా అలక్ష్మీః"** (శ్రీసూక్తం ఆరవ ఋక్కు)

అని శ్రీసూక్తం చెబుతుంది. దీన్ని బట్టి సూర్య కిరణం వల్ల పుట్టిన బిల్వ ఫలాలను తేనెలో ముంచి నెయ్యితో హోమంలో వేసినట్లయితే దాని నుండి వచ్చిన పొగ ద్వారా వాతావరణంలో మాయగా పేరుకుపోయిన బాహ్య అలక్ష్మి తొలగిపోయి ఆ ప్రదేశమంతా లక్ష్మీమయం అవుతుంది అంటే కార్బన్ డై ఆక్సైడ్ తగ్గిపోయి ఆక్సీజన్ పెరుగుతుంది. అందుకే లక్ష్మికి బిల్వ నిలయ అను పేరు వచ్చింది. ఇక్కడ ఏదైతే శుద్ధతను కలిగిస్తుందో అది లక్ష్మి గా చెప్పబడింది.

ఇలా చెప్పుకుంటూ పోతే లక్ష్మి యొక్క ఒక్కొక్క నామము ఆమెలోని ఒక్కొక్క కోణాన్ని, ఒక్కొక్క శక్తిని, ఆమె తత్వాన్ని తెలియజేస్తాయి.

**తెలుగు కవుల ఇష్టదేవతా స్తుతులు లక్ష్మి :**

ఇష్టము అంటే కోరబడినది, ప్రియమైనది అని స్తుతి అంటే పొగడ్త అని అర్థం. ఇష్ట దేవతా స్తుతి అనగా ప్రియమైన దేవుడిని పొగడటం. కవులు ఇష్టదేవతలను ఎందుకు స్తుతించారు అని గనక చూసినట్లయితే వారు రచించబోయే కావ్యములు ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి కావాలని కోరుకుంటూ తమ కావ్యావతారికల్లో ఇష్టదేవతా స్తుతిని గావించారు. సంపదకు అధిదేవత అయిన లక్ష్మిని తరిగిపోని సంపదలు ఇమ్మని, కృతి భర్త ఇంట్లో నివసించమని, సంపదలు, ఆయుష్షు, ఆరోగ్యం, యశస్సును కలిగించాలని వేడుకున్నారు కవులు.

తెలుగులో ఆదికావ్యమైన మహాభారతం నుండి ఇష్టదేవతా స్తుతులు కనబడుతున్నాయి. దేవతాస్తుతిని విస్తరించి అనేక పద్యములతో రాసిన మొట్టమొదటి తెలుగు కవి నన్నెచోడుడు. తర్వాతి కవులు దీనిని అనుసరిస్తూ తమ కావ్యాలలో ఇష్ట దేవతా స్తుతిని కొనసాగించారు. అవతారికల్లో లక్ష్మిని స్తుతించుట మంచెన 'కేయూర బాహు చరిత్ర' నుండి ప్రారంభమై ఎర్రన నృసింహ పురాణము, జక్కన విక్రమార్క చరిత్ర, విన్నకోట పెద్దయ కావ్యాలంకార చూడామణి, శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యము, పోతన భాగవతము, పిల్లలమర్రి పినవీరభద్రుని శృంగార శాకుంతలము, దూబగుంట నారాయణ కవి పంచతంత్రము మొదలైన కావ్యాలతోపాటు ఆధునిక కావ్యాల వరకు కూడా లక్ష్మీ స్తుతి కొనసాగుతూ వస్తుంది.

తెలుగు కవులు తమ కావ్యవతారికల్లో లక్ష్మిని ఇందిర, సిరి, రమా రమణి, లోకమాత, కలిమి చెలువ, కలశపయోధిపుత్రి, కలశవారాశి పట్టి, శ్రీదేవి, జలధి కన్య, పద్మ, మహాదేవి మొదలైన నామాలతో కీర్తించారు.

తెనాలి రామకృష్ణ కవి 'పాండురంగ మాహాత్మ్యం'లో ఆదిలక్ష్మిని స్తుతించిన తీరును చూద్దాం.

సీ. "అవతారమందె నే యఖిలైక జనయిత్రి
కలశ రత్నాకర గర్భసీమ
దోబుట్టువయ్యెనే తులిత కాంచన వర్ణ
వెలది వెన్నెల గాయు వేల్పునకును
బాయకయుండు నే పరమ పావనమూర్తి
చక్రి బాహా మధ్య సౌధ వీధి
నభిషేకమాడు నే యభివర్ణితాచార
దిగ్గజానీతమౌ తేట నీట

తే. "నవనిధానంబు లే దేవి జవని సరకు
లమ్మహాదేవి శ్రీదేవి యాదిలక్ష్మి
సరస శుభదృష్టి రామానుజయ్య సుతుని
నాదరించు విరూరి వేదాద్రి నాథు"(1–2)

పై పద్యంలో కవి లక్ష్మిని రత్నాకరుని గర్భసీమ నందు జన్మించిన అఖిలైక జనయిత్రిగా, వెన్నెలను కాచే వేల్పునకు తోబుట్టువుగా, విష్ణుమూర్తి హృదయ నివాసినిగా, దిగ్గజములచే పోయబడిన నీటిచే అభిషేకమాడు దివ్యమూర్తిగా కీర్తిస్తూ తన కావ్య కృతిభర్త అయిన విరూరి వేదాద్రిని ఆదరించమని కోరుకున్నాడు.

లక్ష్మీదేవిని పద్మాలయగా కీర్తిస్తుంటారు. మరి ఆ పద్మ భవనము ఎలా ఉంటుందో కూచిమంచి తిమ్మకవి 'నీలా సుందరి పరిణయము' నందు ఈ విధముగా వర్ణించారు.

ఉ. "కమ్మని తెమ్మదెమ్మెరలు గ్రమ్మగ నిమ్మగు తమ్మిమేడలోఁ
దుమ్మెద కొమ్మ లెమ్మెలను దూఁకొని నీటుగఁ బాటఁ బాడఁగాఁ
గొమ్మని పూవుఁదేనియలఁ గూరిమి నామెత లిచ్చి నిచ్చలున్
నెమ్మదినుందు పాల్కడలి నెయ్యపుఁగూఁతురు మమ్ముఁ బ్రోవుతన్.".
(1 – 4)

అందమైనటువంటి సరోవరంలో నిండుగా వికసించిన కమలమే లక్ష్మీ నివాస భవనము. చుట్టూ తామరల పరిమళాలతో, నీటి కెరటాల తుంపురుల తేమతో నిండిన పిల్లగాలులు కమ్ముకుంటూ ఆహ్లాదముగా ఉన్న తమ్మి మేడలో ఉన్న లక్ష్మికి చెలికత్తెలు తుమ్మెదలు. అవి మకరందాలను తీసుకొని వచ్చి ఇదిగో సేవించమని లక్ష్మికి విందులు చేస్తాయి. విందులు ఇచ్చిన చనువుతో వయ్యారాలు చేకొని ఏదో ఒక పాట ఎత్తుకుంటాయి తుమ్మెదలు. ఇవన్నీ నిత్య కృత్యంగా జరుగుతూ ఉండగా మానసికోల్లాసంతో తమ్మి మేడలో నివసించే క్షీర సముద్ర రాజు గారాల పట్టి లక్ష్మి మమ్మల్ని బ్రోచుగాక అని కవి కోరిక.

**తెలుగు శతక సాహిత్యము లక్ష్మీస్తుతి :**

'శత్' అనే సంస్కృత ధాతువు నుండి శతకము అనే పదం ఏర్పడింది. శత అంటే వంద అని అర్థం. నూరు పద్యాలతో కూడిన రచనను శతకము అంటారు. కానీ సాధారణంగా తెలుగు శతకాలు నూట ఎనిమిది, నూట పదహారు పద్యాలతో కనిపిస్తాయి.

తెలుగు సాహిత్యంలో కొన్ని శతకాల్లో అక్కడక్కడ లక్ష్మి ప్రస్తావనలు ఉన్నాయి. మరికొన్ని లక్ష్మీ స్తుతి ప్రధానంగా కలిగిన శతకాలు కూడా ఉన్నాయి.

తెలుగులో సుమతి, వేమన మొదలైన శతకాల్లో లక్ష్మి ప్రస్తావనలు కనబడుతున్నాయి.

క. "కులకాంతతోడ నెప్పుడుఁ
గలహింపకు వట్టితప్పు ఘటియింపకుమీ
కలకంఠి కంటి కన్నీరొలికిన
సిరి యింటనుండ నొల్లదు సుమతీ" (36 వ పద్యం)

భర్త ఎప్పుడూ భార్యతో గొడవ పడకూడదు. చేయని తప్పులకు వేలెత్తి చూపరాదు ఒకవేళ ఆమె కంటి నుంచి కన్నీరు వస్తే ఆ ఇంట్లో లక్ష్మి ఉండదు.

ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు పెద్దలు. ఇంటిలోని స్త్రీ ఆమెకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉన్నట్లయితే ఆ ఇంటిని చక్కబెడుతుంది. పిల్లల్ని తీర్చిదిద్దుతుంది. ఆ ఇల్లు ఆనందమయంగా తయారవుతుంది. ఒకవేళ ఆమె బాధ పడినట్లయితే ఆనందము అనే లక్ష్మి ఆ ఇంటి నుండి దూరమవుతుంది.

లక్ష్మీ స్తుతి ప్రధానంగా ఉన్న శతకాలను గనక చూసినట్లయితే కోసంగి సిద్ధేశ్వర ప్రసాదు కలుముల జవరాల శతకములో, వైదిక పౌరాణిక గాథలతో పాటు లక్ష్మీ పూజా విధానము, లక్ష్మి ఏ దేశంలో ఏ రూపంతో పూజించబడుతుందో మొదలైన వివరములే కాక లక్ష్మికి సంబంధించిన చారిత్రక విషయాలను కూడా వివరించారు. హరప్పా మొహంజదారో నాగరికతలపై చేసిన పరిశోధనలు, త్రవ్వకాలలో దొరికిన చిహ్నాములు లక్ష్మి వేనని వివరించారు.

"అల 'హరప్ప' 'మొహంజొదా' ర్లందు' జువ్వ
దా ర్ల నెఱుఁగ నగుఁ బరిశోధనలఁ జేయ
నీదు చిహ్నాల టందురు నిజముతల్లి
కలుముల జవరాల కరుణఁ గావుమమ్మ".

(కలుముల జవరాల శతకము – 70)

ఈ శతకములో లక్ష్మిని సకల లోకాలకు జననిగా, సనాతనిగా, సర్వలోకాలను కాపాడే తల్లిగా, వేదచరితగా వర్ణించాడు. దుష్టులను శిక్షించేదిగా, సర్వశాస్త్రములకు మూలముగా, సర్వ గుణ పూర్ణగా స్తుతించాడు కవి.

"సర్వదుష్ట భయంకరి సర్వవంద్య
సర్వ సంపత్తి సంధాత్రి సర్వశాస్త్ర
సర్వగుణ పూర్ణ సర్వజ్ఞ స్త్రైణసౌమ్య
కలుముల జవరాల! కరుణఁ గావుమమ్మ".

(కలుముల జవరాల శతకము – 12)

పరవస్తు మునినాథకవి సుదీర్ఘ సంస్కృత సమాసాలతో, శబ్దాలంకార సొగసుతో, ధారా శుద్ధితో 'లక్ష్మీ శతకము'ను రచించారు. ఈ శతకములో లక్ష్మిని అమృతసఖి, త్రిలోకజనని, మంగళాధిదేవత, విశ్వాత్మిక, నిత్యానంద స్వరూపిణి అనే నామములతో కీర్తించాడు.

నలినాక్షుని వక్షస్థల పీఠముపై కొలువుదీరి కచ్ఛపము, ముకుందాది నిధులు కొలుస్తుండగా లోకాలను రక్షించే తల్లియని లక్ష్మిని కీర్తించాడు మునినాథ కవి. నిన్నే దిక్కని నమ్ముకున్నాను ఓ త్రిజగత్పావని నీవు తప్ప వేరొక దైవమును ఎరుగను. రావే లోకేశ్వరి మమ్మల్ని సంరక్షించు అని లక్ష్మిని వేడుకున్నాడు.

"నీ వని నమ్మితిఁ ద్రిజగ
త్పావని విను నీవినా యితఃపర మెఱుఁగన్
రావే లోకైకేశ్వరి కావవె
భద్రాత్మికా సుఖప్రద లక్ష్మీ" (లక్ష్మీ శతకము – 66)

కారంపూడి చతుర్భుజ లక్ష్మి తన భాగ్యలక్ష్మి శతకములో లక్ష్మీ అష్టోత్తర శతనామావళి లోని 108 నామాలకు 108 ఆట వెలదులతో అర్థాలు చెబుతూ సరళ సుందరముగా రచించారు. గోవర్ధనము రంగాచార్య కవి 'ఇందిరా శతకము'లో లక్ష్మి అవతార మహిమలను భక్తి పూర్వకంగా ప్రశంసించాడు. శనగల హనుమయ్య చందలూరు గ్రామంలో వెలసిన మహాలక్ష్మిని కీర్తిస్తూ 'చందలూరి మహాలక్ష్మి శతకము' ను రచించాడు. రామకృష్ణ సీతారామ సోదర కవులు 'పమిడిపాటి మహాలక్ష్మి శతకము'లో పమిడిపాడు మహాలక్ష్మి దేవాలయ ఉత్సవ విశేషాలను వివరిస్తూ, లక్ష్మిని పరిపరి విధాలా స్తుతించారు.




సాలువ బాబురావు అష్టలక్ష్మి శతకములో సమాజంలో జరుగుతున్న జీవిత సత్యాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. లక్ష్మిని శక్తిమాతగా, అమృతవల్లిగా కీర్తిస్తూ, అన్ని మంత్రముల కన్న గాయత్రి మంత్రము మిన్న. అన్ని దైవాల కన్న మిన్న ఆదిలక్ష్మి. అంటూ లక్ష్మి పై తన భక్తి భావాన్ని చాటుకున్నాడు.

**తెలుగు కావ్యాలు లక్ష్మీస్తుతి :**

తెలుగు కావ్యాలలో పోతన భాగవతము శ్రీనాథుని కాశీఖండము మొదలైన కావ్యాల్లో లక్ష్మీ స్తుతులు కనబడుతున్నాయి.

పోతన తన భాగవతంలో లక్ష్మీ జననము, లక్ష్మీ అంగాంగ వర్ణన, లక్ష్మీ వివాహము మొదలైన ఘట్టాలను అతి రమణీయంగా వర్ణించాడు. లక్ష్మి పుట్టుకతో ఎలా వుందో క్రింది పద్యములో వర్ణించాడు.

"తొలుకారు మెఱుగుకైవడి
తళతళ యని మేను మెఱయ ధగధగ యనుచు
గలుముల నీనెడు చూపుల
చెలువంబుల మొదలిటెంకి సిరిపుట్టె నృపా"
(పోతన, భాగవతము అష్టమ స్కం. 265)






లక్ష్మి చూపులు ప్రసరిస్తే వారు ఎంతటి వైభవమును పొందుతారో క్రింది పద్యంలో వర్ణించాడు పోతన.

"పలుకుల నమృతంబు చిలుక నెవ్వానితో-
భాషించు నతడెపో బ్రహ్మ యనగ
నెలయించి కెంగేల నెవ్వని వరియించె-
వాఁడె లోకములకు వల్లభుండు
మెయిదీఁగె నెవ్వని మేనితోఁ గదియించె-
వాఁడెపో పరమ సర్వజ్ఞమూర్తి
నెలతుక యెప్పుడు నివసించు నేయింట-
నాయిల్లు పరమగు నమృత పదము
నెలత చూపు వాఋ నెచ్చోటి కచ్చోటు
జిష్ణు ధనద ధర్మ జీవితంబు
గొమ్మ పిన్న నగవు గురుతర దుఃఖ ని
వారణంబు సృష్టి కారణంబు." (8 - 272,273)

లక్ష్మి అమృతం చిలికే మాటలతో ఎవరితో మాట్లాడుతుందో అతడే బ్రహ్మ. తన చేతితో పూలమాల వేసి ఎవరిని వరిస్తుందో అతడే సర్వలోకాలకు అధిపతి. తన శరీరాన్ని ఎవరి దేహంతో చేరుస్తుందో అతడే సర్వజ్ఞుడు. ఎవరి ఇంట్లో ఆమె నివసిస్తుందో అదే పరమాద్భుతమైన అమృత నిలయం. ఆమె చిరునవ్వు దుఃఖాన్ని తొలగిస్తుంది. సృష్టిని ప్రకాశింపచేస్తుంది.

శ్రీనాథుని కాశీఖండ తృతీయాశ్వాసములో అగస్త్యుడు చేసిన లక్ష్మీస్తుతి లక్ష్మీ స్తుతులన్నింటిలో అతి ప్రధానమైనది. ఈ కావ్యములో లక్ష్మియే సర్వ జగత్తుకు మూలముగా వర్ణించబడింది. లక్ష్మి పురుషుని యందు భాగ్యముగా, స్త్రీ యందు విలాస రేఖగా, గజములు, అశ్వములు, పక్షులయందు ఉన్న అసాధారణమైన పుష్టి లక్ష్మి అంశగా పేర్కొనబడింది. లక్ష్మీ కృపకు పాత్రుడైన వాడు ఎంతటి వాడవుతున్నాడో క్రింది విధముగా వర్ణించాడు శ్రీనాథుడు.

"పండితుఁడాత, డాతఁడు ప్రభావసమగ్రుఁ డతండు శూరుఁడా
తండు వివేకి యాతఁడు వదాన్యుడతండు మహాకులీనుఁడా
తండు కళావిదుండతఁడు ధన్యుడతండు మనోజ్ఞమూర్తి, యె
వ్వండు భవత్కృపాకలన వైభవలక్ష్మికిఁ బాత్రుఁడిందిరా!"
(3-45)

లక్ష్మిని సంపద, ధనము అనే సామాన్య అర్థములోనే కాక ప్రకృతి, పద్మ, శుద్ధత మొదలైన అంశాలకు అన్వయించి కనక చూసినట్లయితే అసలైన లక్ష్మి స్వరూపం గోచరిస్తుంది.

**ఆధార గ్రంథాలు** :

1. ఆంజనేయ శర్మ జమ్మలమడక (వ్యాఖ్యాత), శ్రీ రహస్యమ్, హైదరాబాద్ : వేదాంత వేదిక లలిత కామేశ్వరి ట్రస్ట్ 1998
2. కమలాకర శర్మ సాగి, శ్రీకరం. హైదరాబాద్ : వేద సంస్కృతి పరిషత్ 2022.
3. కృష్ణమాచార్యులు యం. వెంకటరామయ్య గోలి, (సంకలనము సమీక్ష ) శతక త్రయము, గోరఖ్ పూర్: గీతాప్రెస్ 2011.
4. పోతన, భాగవతం. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం 1994.
5. శ్రీనాథుడు, కాశీ ఖండము, చెన్నపురి: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్1958.
6. సిద్ధేశ్వర ప్రసాద్ కోసంగి, కలుముల జవరాల శతకము, కోదూరు: శ్రీ శిరిడీ సాయిబాబా ప్రింటర్స్ 1995.
7. సీతారామాచార్యులు బహుజనపల్లి, శబ్ద రత్నాకరం (నిఘంటువు) చెన్న పట్నము : చెన్న పట్టణపు దేశ భాషా గ్రంధీకరణ సభ 1981.





ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 (51) హైదరాబాద్ జులై : 2024

# కొండవీటి సత్యవతి రచనలు – ప్రేమ

**ఆవుల రేణుక,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.



ప్రేమ లేని మనిషి ఎవరు ఉండరు. ప్రేమించడం, ప్రేమించ బడడం ప్రతి ఒక్కరూ చేస్తారు. ప్రేమ అనే భావనలో హుషారుగా విహరించిన మనిషి, ప్రేమ దూరం అవగానే జీవితాన్ని వ్యర్థమని భావిస్తాడు. మనిషి జీవితం మొత్తం ప్రేమతో ముడిపడి ఉంటుంది. తల్లిదండ్రులు – పిల్లల మధ్య, భార్యాభర్తల మధ్య, మిత్రుల మధ్య, మనుషులకు మూగజీవాలపైన, ప్రకృతి పైన ఉండేదంతా ప్రేమే. ప్రస్తుత ప్రేమలు ఎలా ఉన్నాయి? ప్రేమ ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అని కొండవీటి సత్యవతి తన రచనల్లో పేర్కొన్నారు. కె. సత్యవతి స్త్రీవాద రచయిత్రి. సామాజిక ఉద్యమకారిణి, స్త్రీవాద పత్రిక భూమిక సంపాదకురాలు. ఈమె తన రచనలైన కొన్ని మెరుపులు కొన్ని ఉరుములు అనే కథా సంపుటిలో, ఆనందార్ణవం అనే డైరీలో, విపశ్యన అనే పుస్తకంలో ప్రేమ గురించి పేర్కొన్నారు.

సత్యవతి కథల సంపుటిలో భార్యాభర్తల మధ్య ప్రేమ ఎలా ఉండాలో చెప్పిన కథ **హమ్ చలేంగే సాథ్ సాథ్.** ఇందులో భార్యాభర్తల బంధం బలంగా ఉండాలంటే, ఇరువురి మధ్య ప్రేమ, స్నేహం, పరస్పరం అవగాహన, ప్రోత్సాహం ఉండాలని చెప్పారు. ఈ కథలో అవని, గురు ప్రధాన పాత్రలు. వీరు ప్రేమ వివాహం చేసుకుంటారు. అయితే పెళ్లి తర్వాత వాళ్లు ఎలా ఉండాలనుకుంటున్నారో ముందుగానే ఇరువురు మాట్లాడుకుని వివాహ బంధంలోకి అడుగు పెడతారు. కాబట్టి వారు అనుకున్నట్టుగానే ఒకరి ఇష్టాలను ఒకరు గౌరవిస్తూ, తమ లక్ష్యాలు, ఆశయాలు, ఆశలు అన్నిటిలో పరస్పరం సహకరించుకుంటూ, తమ వ్యక్తిత్వంతో పాటు వారి బంధాన్ని నిలబెట్టుకుంటూ ఆదర్శవంతంగా జీవిస్తారు. ఈ కథలో దాంపత్య జీవితంలో ఉండే హక్కులు, అధికారాలు, అణచివేతలు లేకుండా, స్త్రీ పురుష సమానత్వం చూపించారు. ఇలాంటి చోట స్వేచ్ఛ, స్వతంత్రాలకు కొదవ ఉండదు. వారి మధ్య ప్రేమ ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

అపూర్వం కథలో హరిత, ప్రభాకర్, మెలకువ సందర్భం కథలో అరుణ, రమేష్ పాత్రలు పెళ్ళికి ముందు ప్రేమించుకుని, వివాహ బంధంలోకి అడుగు పెట్టిన తర్వాత ప్రభాకర్, రమేష్ పాత్రలు పితృస్వామ్య భావజాలంతో హక్కులు, అధికారాలు ప్రదర్శిస్తూ, స్త్రీలను తక్కువ స్థాయి మనుషులుగా చూడడం, వాళ్లకు పనులు చేసి పెట్టే బానిసలుగా భావిస్తారు. వీళ్ళ మధ్య పెళ్లికి ముందు ఉన్న ప్రేమ స్థానంలో అధికారం మొదలవుతుంది. అది హింసకు దారితీస్తుంది. అప్పుడు స్వేచ్ఛ, స్వతంత్రాలు నశించి వారి బంధం కూడా విచ్ఛిన్నమైపోతుంది. ఇది పితృస్వామ్య భావజాలం అంటిన ప్రేమ ఈ ప్రేమ బానిసత్వాన్ని కోరుతుంది.

కువైట్ క్యాసెట్ కథలో ప్రధాన పాత్ర సక్కూ తల్లి. ఆమె తన పిల్లల పోషణ కోసం కువైట్ వెళ్లి, అక్కడ సిమెంట్ పరిశ్రమలో పని చేస్తుంది. దానివల్ల తన ఆరోగ్యం పూర్తిగా చెడిపోతుంది. తను ఎంత కాలం బతుకుతుందో తెలియదు. మళ్లీ తన పిల్లలను చూస్తుందో, లేదో కూడా తెలియదు. అయినా ఆమె జీవితం వాళ్ళ కోసం త్యాగం చేస్తుంది. ఇందులో బదులు ఆశించని స్వచ్ఛమైన తల్లి ప్రేమ కనబడుతుంది.

ఎక్కడున్నా ఒకటేనా అనే కథలో వల్లబ్, సంపూర్ణలు తమ పిల్లల కోసం యంత్రాల్లా కష్టపడి, వారికి ఉన్నత ఉద్యోగాలు వచ్చి, విదేశాల్లో స్థిరపడేలా కృషి చేస్తారు. ఆ తర్వాత వల్లబ్ ఆల్జీమర్స్ తో ఎవరిని గుర్తుపట్టలేని స్థితికి వస్తాడు. ఆ సమయంలోనే సంపూర్ణ చనిపోతుంది. ఆమె అంత్యక్రియలకు వచ్చిన వారి కొడుకులు సుధాకర్, విశాల్ లతో వల్లబ్ మిత్రుడు రంగారావు తండ్రిని తమతో తీసుకెళ్ళమని చెప్తాడు. అందుకు **"అంకుల్ ఈయన ఎక్కడున్నా ఒకటే. మమ్మల్ని గుర్తుపట్టలేడు. మేము తీసుకెళ్లినా, ఇక్కడున్నా, పెద్ద తేడా లేదు. మేము డబ్బు పంపుతాము, ఆశ్రమం వాళ్ళు చూసుకుంటారు"** (సత్యవతి కొండవీటి. కొన్ని మెరుపులు కొన్ని ఉరుములు. పుట. 315) అని నిర్లక్ష్యపు సమాధానం చెప్తాడు సుధాకర్. చిన్నప్పటినుండి ఆ పిల్లల్ని హాస్టల్లో ఉంచి పెంచడం వల్ల వారికి తల్లిదండ్రుల పట్ల ఎలాంటి ప్రేమానురాగాలు లేవు. తల్లిదండ్రులు యంత్రాల్లా మారిపోయి, పిల్లల్ని అలాగే మార్చడం వల్ల ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఈ కథ ద్వారా తెలుస్తుంది. పిల్లలు ఏదైనా తల్లిదండ్రుల నుండే నేర్చుకుంటారు. కాబట్టి మనం వాళ్లతోనూ, ఇతరులతోనూ ప్రవర్తించే తీరు, పెద్దలపట్ల మనకు గల గౌరవం అన్ని గమనిస్తారు. పిల్లల పట్ల మనం ప్రేమగా ఉండి, వాళ్లకు బంధాలు, విలువలు నేర్పాలని ఈ కథ ద్వారా రచయిత్రి పేర్కొన్నారు.

విపశ్యన ధ్యానకేంద్రంలో సత్యవతి గడిపిన పది రోజుల అనుభవాలను విశ్వప్రేమను విప్పి చెప్పిన విపశ్యన అనే పుస్తకంగా మలిచారు. ఆ ధ్యాన కేంద్రంలో పది రోజులు బయట

ప్రపంచంతో సంబంధం లేకుండా, మనతో మనం గడపడం వల్ల మనలో గొప్ప మార్పు వస్తుంది. మనిషిలో మార్పు తీసుకురావడమే విపశ్యన ప్రధాన ఉద్దేశ్యం. అక్కడికి వెళ్లొచ్చాక సత్యవతిలో చాలా మార్పు వచ్చిందని చెప్పుకున్నారు. అందులో ప్రకృతి, మనుషులు, మన శరీరంలోని అణువణువు, ఇలా లోకంలో ప్రతిదీ క్షణక్షణం మారుతూ ఉంటుంది. ఏదీ శాశ్వతం కాదు. దుఃఖం, సుఖం, కష్టాలు, కన్నీళ్లు, ఆనందం ఇవేవీ శాశ్వతంగా ఉండవు. ఇన్ని అశాశ్వతమే. ప్రతిరోజు మనిషి మరణం వైపు అడుగులేస్తూ ఉంటాడు. కాబట్టి నాది, నేను అనే అహంభావం ఉండకూడదు. ఆస్తుల కోసం, ఆధిపత్యం కోసం దుర్మార్గాలు, అణచివేతలు విడనాడాలని చెప్పారు. ఈ సృష్టిలో పుట్టిన ప్రతీది అంతర్ధానం అవక తప్పదనే సత్యాన్ని గ్రహించాలి. **"బుద్ధుడి కాలంలో కన్నా ఆధునిక మానవుడు మరింత దుఃఖంలో, సంఘర్షణలో, అసమానతలో, పేదరికంలో, ఆకలి చావుల్లో, అత్యంత హింసపూరిత పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. కార్పొరేట్ క్రూర ప్రపంచం పెట్టే పోటీలో మానసికంగా నలిగిపోతున్నాడు. ఒత్తిళ్ళ మయమైన జీవితం, ఆనందం ఆవిరవుతున్న పరిస్థితులు, తన మనసులోని, తన జీవితంలోని డొల్లతనాన్ని నింపుకోవడానికి గుళ్ళవైపు, దేవుళ్ళ వైపు పరుగులు తీస్తున్నాడు. వదిలేసిన తంతులన్నింటినీ తిరిగి తలకెత్తుకుంటున్నాడు. జీవితం భారం అవుతుందని వాపోతున్నాడు. ఈ భారాన్ని ఎలా వదిలించుకోవాలి? వేరే ఆలోచన రానీయకుండా మతం తన పాత్రను పోషిస్తుంది"** (సత్యవతి కొండవీటి. విపశ్యన. పుట. 35). మనిషి గతానికి, భవిష్యత్తుకి ముడిపెట్టి వర్తమానంలో జీవించడం మర్చిపోతున్నాడు. సృష్టిలో ఈ క్షణం మాత్రమే నిజమని, వర్తమానంలో జీవిస్తే సంతోషంగా ఉండవచ్చని రచయిత్రి చెప్పారు. నేటి మానవుడు వస్తు సముదాయం మీద ప్రేమ పెంచుకుంటున్నాడు. వస్తువులను ప్రేమించడం మాని, సాటి మనుషులను, ప్రకృతిని ప్రేమించాలని సత్యవతి పేర్కొన్నారు. ఆమె విపశ్యనకు వెళ్లి వచ్చిన తర్వాత తనలో ఉన్న కేంద్రీకృతమైన ప్రేమ నశించి విశ్వవ్యాప్తమైన ప్రేమ అలవడిందని పేర్కొన్నారు. కేంద్రీకృతమైన ప్రేమలో బానిసత్వం ఉంటుందని విశ్వవ్యాప్తమైన ప్రేమలో స్వేచ్ఛ, సమానత్వం తెలిపారు.

ప్రేమ అనే భావన ఎలా ఏర్పడుతుంది? దాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలిసి ఉండాలి. ప్రేమ అనేది స్వేచ్ఛ, స్వతంత్రాలతో ముడిపడి ఉంటుంది. అసలు స్వతంత్రం అంటే ఏమిటో కూడా తెలిసి ఉండాలి. మనకు ఇష్టం వచ్చిన పని చేయడం, ఇష్టం వచ్చినట్టు ఉండడం స్వతంత్రం కాదు. మనల్ని బంధించే బాహ్య పరిస్థితులను తెంచుకుపోవడం కూడా కాదు. పరాదీనత లేకపోవడం నిజమైన స్వతంత్రం. పరాధీనత అంటే మన నిత్య జీవితంలో చిన్న చిన్న పనులకు ఇతరుల మీద ఆధారపడతాం, అది చాలా సులువుగా అర్థమవుతుంది. కానీ మనం అర్థం చేసుకోవలసినది మన సుఖ సంతోషాల కోసం ఇతరుల మీద మానసికంగా ఆధారపడేలా మనల్ని కట్టిపడేసే పరాధీనత వల్ల మనం బానిసలైపోతాం, అది క్రమంగా మనల్ని బంధించివేస్తుంది. అలాంటి వాటిని అర్థం చేసుకొని మానసికంగా బయటపడగలగాలి. కొండవీటి సత్యవతి ఆనందార్ణవంలో ప్రేమ నేది ఎలా వుండాలి, ఎలా ఉండకూడదో పేర్కొన్నారు.

మనం ప్రేమిస్తే దానికి బదులుగా ఇతరులు మనల్ని ప్రేమించాలనుకోవడం అంటే బదులు కోరుతున్నామంటే అది పరాధీనతే అవుతుంది. ప్రస్తుతం మనం చెప్పుకునే ప్రేమ ఈర్ష్య, ద్వేషం, చింత, అసూయ, భయం అనే అడ్డుగోడల మధ్య చిక్కుకొని ఉంటుంది. మనం లోలోపల ఇతరులపై ఆధారపడటమే ఇందుకు కారణం. ప్రేమించడం అంటే దానికి బదులు ఆశించడం కాదు. ఎదుటివారికి మనమేదో ఇస్తున్నటువంటి భావన అసలు ఉండకూడదు. అది ప్రేమంటే.

మనిషి జీవితం ప్రేమతో అల్లుకొని ఉంటుంది. ఆ ప్రేమ దూరమవగానే జీవితం అక్కడితో ముగిసిందని భావిస్తూ, ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. అంటే అది ఆశించే ప్రేమ కనుక అలాంటి భావన కలుగుతుంది. సత్యవతి స్త్రీ పురుష ప్రేమలో వేరుగా ఉంటాయని పేర్కొన్నారు. మగవారి ప్రేమ స్త్రీ శరీరం చుట్టూ తిరుగుతుందని, కొన్నిసార్లు ఆడవారి ప్రేమ కూడా శరీరం చుట్టూ తిరుగుతుంటుందని తెలిపారు. ఇది కేవలం శరీర ఆకర్షణ మాత్రమే. అప్పుడది శరీరాకృతి మారే కొద్దీ మార్పు చెందుతుంది.

ప్రేమ అనేది విశాలంగా ఉండాలి. కానీ, ప్రస్తుత ప్రేమలు నెమ్మదిగా మనిషిని బందీని చేస్తూ, ఒక ఇరుకులో పడేస్తున్నాయి. ఆ ఇరుకు భరించలేనిదిగా మారి హింసాత్మకమవుతుంది. **"ప్రేమని విప్పి చూస్తే ఏముంటుంది, ఒకరికి ఇంకొకరిని కట్టేసుకోవడం – ప్రేమతోనే సుమా! ఎప్పుడైతే కట్టేసుకోవడం మొదలవుతుందో ప్రేమలో స్వేచ్ఛ ఆవిరైపోతుంది. ఉక్కపోత మొదలవుతుంది. ఒక్కోసారి ప్రేమ బానిసత్వాన్ని కోరుతుందేమో అనిపిస్తుంది నాకు. బానిసత్వంలో స్వేచ్ఛ సాధ్యం కాదు. ప్రేమ బానిసలు? ప్రేమ రోగులు? ప్రేమ పీడితులు? ప్రేమకి ఈ పదాలకి పొంతన ఎలా కుదురుతుంది. ప్రేమ ఉదాత్తమని, అత్యున్నత భావోద్వేగం అని అనుకుంటాం కానీ, ప్రేమకి పితృస్వామ్య పరిధులున్నాయి."** (సత్యవతి కొండవీటి. ఆనందార్ణవం. పుట. 16). మగవాడు, ఆడవాళ్లపై పెత్తనం చేయడం, అధికారం చలాయించడం, ఇదంతా ప్రేమ అనుకునేలా చేస్తారు. ఇది కేవలం స్త్రీలను కట్టడి చేయడానికి, వారి అదుపాజ్ఞలలో ఉంచుకోవడానికి చేసే ప్రయత్నమే, ఇందులో స్వేచ్ఛ, సమానత్వం ఉండవు. ఇది బానిసత్వానికి సంకేతం మాత్రమే. అందుకే స్త్రీ మగవాడి మాట కాదంటే ప్రేమ స్థానాన్ని హింస ఆక్రమిస్తుంది. అప్పుడు అతను ఉన్మాదిలా మారతాడు. **"పితృస్వామ్య**


**వ్యవస్థ పురుషుడికి స్త్రీల మీద సర్వహక్కులు ఇచ్చింది. కాబట్టి ప్రేమలో కూడా హింస సాధ్యమే. ఇలాంటి హింస నిత్యం చూస్తున్నాము. తనకు మాత్రమే హక్కులున్నాయి అనుకునే మగాడు, తనకు ప్రేమించే హక్కు, హింసించే హక్కు, ఏమైనా చేయడానికి సర్వహక్కులు ఉన్నాయనుకుంటాడు కాబట్టి ప్రేమిస్తాడు. కాదంటే హింసిస్తాడు. ఆడవాళ్లు మగవాళ్ళ ప్రేమని అనుభవిస్తారు. వాడి హింసనీ అనుభవిస్తారు. ప్రేమలో కూడా లొంగే ఉంటారు. ఆడవాళ్ళ ప్రేమ సున్నితంగా ఉండాలని, వాళ్లు హింసాత్మకంగా ప్రవర్తించకూడదని సమాజం ఆశిస్తుంది. అన్నింట ఇదే సిద్ధాంతం. హింసను భరించమని నూరిపోస్తుంది. ప్రేమలో, పెళ్లిలో, భార్యాభర్తల సంబంధాలలోనే కాదు, ప్రేమ సంబంధంలోనూ మగవాడు పితృస్వామ్య భావజాల పరిధిలోని వ్యవహరిస్తాడు"** ( ఆనందర్ణవం. పుట. 17).

ప్రేమ, పెళ్లి వంటి బంధాలలో ఎదుటి వ్యక్తి మన సొంతం అనుకునే భావన ఉంటుంది. దీనివల్ల స్వేచ్ఛ, స్వతంత్రాలు నశించడం, వాళ్లతోనే మన సంతోషం ముడిపడి ఉందనే ఆలోచన లోంచి పరాధీనత ఏర్పడి, ఆ బంధానికి బానిసై బతుకుతాం. అది ఎంతటి హింసారూపం దాల్చినా భరించాల్సిందే. అలాంటి ప్రేమ స్వార్థపూరితమైనది. ఈ ప్రేమ చుట్టూ ఇరుకు ప్రపంచం నిర్మించుకుని, దాని నుండి బయటపడలేక నానాయాతలను పడతాం. ప్రేమలో బదులు కోరుకోవడం లేకుండా, ప్రేమిస్తూ వెళ్తే అది విశాలత్వం. కేంద్రీకృతమైన ప్రేమలో హద్దులు, ఆంక్షలు, అధికారాలు, హక్కులు ఏర్పడి, మనకు మనమే ముళ్లకంచె నిర్మించుకుని సంతోషం కోల్పోతున్నాం.

ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును అని గురజాడ పేర్కొన్నట్టు, ఇవ్వడంలో ఆనందం ఉంది, బదులు కోరడంలో కాదు. నియమరహిత ప్రేమ గొప్పగా ఉంటుంది. ఏ నియమ నిబంధనలు మన మీద ఆధిపత్య పాత్ర పోషించకుండా, మనం మనలా నిలబడి, మనలా ఆలోచించగలగాలి. తరతరాలుగా సంస్కృతి, కట్టుబాట్లు, ఆచారాలు, సంప్రదాయాలు ఇలా ఎన్నో మోస్తూ బందీ అయిపోయిన మనిషి, అన్నిటినీ వదిలించుకోగలడా? ఇక్కడ వదలాల్సినది బంధాలు కాదు, బంధనాలు వదిలించుకొని, మనం మనలా ఉంటే విశ్వ ప్రేమ సాధ్యం అవుతుంది.

**ఉపయుక్త గ్రంథ సూచిక :**

1. సత్యవతి కొండవీటి. కొన్ని మెరుపులు కొన్ని ఉరుములు.
2. సత్యవతి కొండవీటి. విపశ్యన.
3. సత్యవతి కొండవీటి. ఆనందార్ణవం.
4. కృష్ణమూర్తి జిడ్డు. గతం నుండి విముక్తి.



## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం **'కదంబం'.**
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 (54) హైదరాబాద్ జులై : 2024

# ఆచార్య ఎస్వీ జోగారావు గారి వినూత్న సృష్టి – "అడిగొప్పల పొూరుగాలి"

**ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న,** గౌరవ ఆచార్యులు, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.
ఫోన్ : 9440 641 617

"జోగారావుగారికొక విలక్షణమగు పదప్రయోగ నైపుణ్యము కలదు. "అడిగొప్పుల హోరుగాలి"లో అది కలదు. ప్రతి పద్యమున సాక్షాత్కరించును. భావచాలనములో ఒక వైచిత్రీసంవిధానము పదపదమున గోచరించును...."

– డా॥ ప్రసాదరాయకులపతి

ఈ ఖండకావ్యం సెప్టెంబర్ 1979లో వెలువడింది. ఇందులో 46 పద్యాలు వున్నాయి. పేజీలు 36. ముందుమాట ప్రసాదరాయ కులపతి గారు రాశారు. వై.బి.రెడ్డి గారికి అంకితం ఇచ్చారు. త్రివేణి ప్రెస్ మచిలీపట్నం వారు దీన్ని ప్రచురించారు.

**"గుడి మీద కోతి తోడను**
**గుడిలోపలి నంబి వారి కోడలితోడన్**
**నడివీధి లంజె తోడను**
**"అడిగొప్పుల హోరుగాలి" నడిగితి ననుమీ"**

శ్రీనాథుని పేర ప్రసిద్ధమై వున్న చాటువు ఇది. ఈ చాటువుకు పూర్వరంగ పరికల్పనం "అడిగొప్పుల హోరుగాలి".

ఒక్క కవియొక్క చాటువును ఆధారంగా తీసుకొని, దానికి పూర్వ రంగ కావ్యం అల్లడం, తెలుగు సాహిత్యంలో అపూర్వమైన ఘట్టం. సంప్రదాయ సిద్ధంగా పుర వర్ణనతో కథ ప్రారంభమౌతుంది. ఈ కావ్య కథా సూత్రంతో ముడిపడిన సన్నివేశాలన్నింటికీ కూడలి "అడిగొప్పుల హోరుగాలి" ఆ పేరునే కావ్యానికి పేరు పెట్టారు "శృంగార యోగి" రావు గారు.

జోగారావుగారి వినూతన సృష్టి "అడిగొప్పుల హోరుగాలి". ఇది ఊహ అనే పునాదిపై పుట్టింది. ఇది శృంగార రసప్రధానమైన కావ్యం. ఈ కావ్యానికి మూలం శ్రీనాథుని ప్రసిద్ధ చాటువు. ఈ పద్యాన్ని శ్రీనాథుడు ఎందుకు చెప్పాడని ఊహించి, ఆ మాటల వెనుక ఒక కథ వుంటే ఆ కథ ఇలాంటిది అయితే, ఎలా వుంటుందని భావించి ఈ ఖండ కావ్యాన్ని రావుగారు రాశారు.

ఈ కావ్యంలో కళా ప్రయోజనాన్ని గూర్చి నిరుపమానంగా విశదీకరించారు. జీవితంలోని కష్ట నష్టాలను పారద్రోలి సరసం, విలక్షణం, వినూత్నం, పరిపూర్ణమైన అనుభూతిని మానవునకు ప్రసాదించేది అసలు సిసలైన కళాతత్త్వమని జోగారావుగారు "స్వాగతం"లో తెలియజేశారు.

**"అతకనిబొంత లీ బ్రదుకు లందనిదైన సుఖానుభూతికై**
**సతతము నఱ్ఱుసాచు నరసంజ్ఞితు డింత యుదాత్తుడైనచో**
**బ్రతుకుల బాటలం దఱగొఅల్ కడతేరగ వేదనాకళం**
**కితమతిగాక యుండగ నొకింత కళాంకితబుద్ధి కావలెన్"**

**"సతత మనేక సమస్యల**
**సతమతమగు నీసమాజ సంసారములన్**
**మతి మఱపించి యలౌకిక**
**గతిని రసానంద మొసగగనెపుట్టె కళల్"**

లౌకికమైన బాధలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు అలౌకికమైన ఆనందాన్ని ఇచ్చి మనసును రసానుభూతితో ఆహ్లాదమయం చేసేదే కళ. అనేక లౌకిక విషయాల్లో బాధపడుతున్న మానవుని ఆత్మ సుఖసమగ్రం కాదు. మానవుడు తన జీవితంలోని సుఖ సంతోష సంతృప్తుల లోపపూరణకై సహజంగా సుముఖుడు అవుతాడు. ఆ ప్రయత్నంలో అవ్యక్తమైన రసానుభూతి పొందడానికి అతడు సృష్టించుకొన్నదే కళ. ఈ కళ సత్యమా? అసత్యమా? కళ కలకాదు కల్లయును కాదు. అవ్యక్త మధురమైన రసానందాన్ని మానవుడు ఎన్ని క్షణాలు తన జీవితంలో పొందగలడో ఆ మధుర క్షణాలే అతని జీవితానికి సార్థకతనిస్తాయంటారు జోగారావుగారు.

**"కళ కలకాదు. కల్లయును గాదు. మనోజ్ఞకవిత్వమో, మహో**
**జ్జ్వల కలగానమో, మధుర భంగిమతల్పము శిల్పమో, మన**
**మ్ముల కనువిప్పు చిత్రపటమో, అపురూపము రూపకంబొ, ఉ**
**ల్లల దనుభూతి నూచి హృదులన్ రసరమ్య మొనర్చు వేళలన్"**

**"అదె మధురక్షణం బొకరుదర్వది కాదొక వంద వత్సరాల్**
**బ్రదికెనయేని యట్టి మధురక్షణముల్ సకలమ్ము లెక్కిడన్**
**పద పదునై దయౌనపుడు వానిది తద్దశవత్సరంబులే**
**బ్రదుకనగాదగున్ కడమ భాగము కాలము పుచ్చుటే యగున్"**

సహృదయలు, పరమభావుక పట్టభద్రుడైన జోగారావు గారు చెప్పింది శతశతాంశం సత్యం. అందరూ ఇలా నిస్సంకోచంగా వున్నది ఉన్నట్లు చెప్పలేరు. సహృదయ సార్వభౌముడైన యస్వీగారికే ఈ ఘనత దక్కుతుంది. సకల కళాధిరాజమై కవిత్వం ఎలా విరాజిల్లుతుందో జోగారావుగారు విపులీకరించారు.

**"సర్వ భావనాభివ్యక్తి శక్తి మంత**
**మైన శబ్దము పరికరమగుట, చిరము**

**స్థిరము తదనుభూతి వరము పరమ మగుట**
**కవితయ కళాధిరాజమై క్రాలుచుండు"**

నీతులు, నినాదాలు కవిత్వం కాదు. శ్రావ్యమైన శబ్దంతో రమ్యమైన అర్థాన్ని హృద్యమైన అనుభవంగా మలచేది సాహిత్యం అని జోగారావుగారు అన్నారు. ఈ సాహిత్య ప్రపంచ సృష్టిలో ఒక్కొక్క కవిది ఒక్కొక్క దృక్పథం. అందరి దృష్టి ఒకేలా వుండదు, వుండకూడదు కూడా. ఈ కవి ఇలాగే ఎందుకు రాశాడన్నది వెర్రిప్రశ్న అని రావుగారు అన్నారు. ఆ కవిత్వం సద్యోహృద్యం, సహృదయ నైవేద్యమై చక్కగా వున్నదా? లేదా? అనేదే చూడాలని జోగారావుగారి అభిప్రాయం.

**"ఎక్కవి యిష్టము వానిది**
**అక్కైవడి నేల వ్రాసెనన్నది ప్రశ్నా?**
**చక్కగ వ్రాసెన లేదా?**
**చొక్కిడు కవిత గలద యని చూడగవలయున్"**

కావ్య కళారహస్య వివేచనాశక్తిని ఎంతో అందంగా చెప్పారు యస్వీగారు.

మనిషి ప్రతీరోజు జీవితానుభవంలోని లోటుపాట్లు, పాత వాసనలు విస్మరించి, సరసం, వినూత్నం, విలక్షణం, పరిపూర్ణమైన అనుభూతిని పొందడానికే రసికులు కలలు గని, కళలు గనినారనీ, దాన్ని తన కావ్యంలో రసజ్ఞులు నిండార పొందుతారని జోగారావు గారు కావ్యం యొక్క గొప్పతనాన్ని గూర్చి "స్వగతం"లో తెలియజేశారు.

**"అనుదిన జీవితానుభవమందలి లోటులు పాట్లు ప్రాత వా**
**సనలును విస్మరించి సరసంబు విలక్షణమున్ వినూతనం**
**బును పరిపూర్ణమైన యనుభూతి నొసంగుటకే కదా కల**
**ల్లని రసికుల్ కళల్గనిరి కందురుగాక రసజ్ఞు లిందునున్"**

ఇందులో జోగారావుగారు కావ్య కళా పరమార్థాన్ని నిర్వచించారు. భావంలో, భావనలో, భాషలో, ఛందస్సులో, శైలిలో అన్నింటా ఒక కవితా వైలక్షణ్యం ఈ "అడిగొప్పుల హోరుగాలి" కావ్యంలో కన్పిస్తుంది.

ఈ ఖండకావ్యం పురవర్ణనతో ప్రారంభమవుతుంది. హోరుగాలికి అడిగొప్పుల పురంలోని విషయపరిస్థితుల్ని జోగారావుగారు మన కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

**"ఉఱుములై యూర్పులై యెఱపులుచ్చిన క్రేగను గెంపు సొంపులై**
**ఈలలువేసి పర్వులిడు నీదురుగాలులె చీదరింపులై**
**పిడుగులపాట్లు వాలుజడ వ్రేట్లునునై జడియశ్రుధారయై**
**వచ్చెన్ వర్షము కొండెకృష్ణపయి కోపం బూను నచ్చామనాన్"**

శ్రీనాథుడు అప్పుడే పురంలోకి ప్రవేశిస్తాడు. ఆ సమయంలో హోరుగాలి వీస్తుంది. గడ గడలాడెడు మ్రానులతో, వడ వడ వడకెడి మేనులతో, దడ దడ లాడెడి తలుపులతో, చిడి ముడి పడియెడు తలపులతో, చిత్త చూపులతో ఊరంతా అల్లకల్లోలమవుతుంది. ఊరంతా పరమ విషమస్థితిలో వుంటుంది. ఆ హోరుగాలికి ప్రజలు కాందిశీకులవుతారు. ఆ సమయంలో జోగారావుగారు ఎన్నో కొత్త వింతలు కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

**"సుసర భేత్తును విల్చి బసకేగు జవరాలు**
**చకచక ఎక్కె సౌచికుని గడప**



డాక్టర్ యస్వీ జోగారావు

**రామకోటిని వ్రాసి వ్రాసి నామాలయ్య**
**కోటిరామల దల్చుకొని పరుండె**
**స్వాముల వారి సపర్య నప్పటి కప్డు**
**భగవంతు దర్శించె బాల విధవ**
**మంచ మొగ్గినరోగి మకరధ్వజముమాత్ర**
**మిని మింతుడునుగాక**
**మ్రింగినాడు"**

ఊరంతా చీకటి. చుక్కలు కూడా కన్పించడం లేదు. ఊపిరాడక ఉక్కిరి బిక్కిరియై ఆ ఊరిలో చుక్కలన్నీ నక్కినవో, చొక్కినవో అన్పిస్తుంది. శ్రీనాథునికి ఏ తలుపును స్వాగతం ఇవ్వలేదు. పరిస్థితులు చాలా భయంకరంగా వున్నాయి. ఎవడిగోల వాడిది. ఎవరి తిప్పలు వాడివి. ఏది ఏమైన చివరకు శ్రీనాథుడు ఊరి చివర శివాలయానికి చేరుతాడు. దేవాలయం ద్వారాలు మూసివుంటాయి. అయితే ఆ దేవాలయం లోపల నుండి "ఘ్రాణపుటీకుంబక" సుగంధం వాసన వస్తుంది. శ్రీనాథుని నోరు ఊరింది. లోపల గుడిలో నంబి అర్చకుని కోడలు శివుని నివేదనకై రుచి పదార్థాలు తెస్తుంది. "కొప్పెర" అనే కోతి ఎత్తుకొని వీధిలోకి పోతుంది. ఆమె తలుపులు తెరుస్తుంది. కోతి, పాత్రను విడిచి పరుగెడుతుంది. శ్రీనాథ కవి దేవాలయం లోకి వెళతాడు. గుడిలోని శివ పార్వతులకు దండం పెట్టుకుంటాడు. ఆమె, లింగని ప్రసాదాన్ని, కవి లింగనికి ఇస్తుంది. ఆ ప్రసాదాన్ని తిని

శ్రీనాథుడు ఎంతగానో మెచ్చుకుంటాడు.

శ్రీనాథుడు అదే పనిగా, ఆమెవైపు కరదీపిక చూపిన రీతి చూస్తాడు. ఆమె శ్రీనాథుని భావాన్ని కనిపెడుతుంది. వెంటనే "రసజ్ఞేంద్ర! ఇది శివాలయము క్షమింపు" మని అంటుంది. అప్పుడు శ్రీనాథుడు –

**"అల్లోనేరెళు లాత్మ లింగమున కవ్వా ! గుండెలో లోపలన్**
**గుళ్ళున్ గోపురముల్ రచించితిని సాకుల్మాను, మావంకనే**
**విల్లున్ వంచుక విఱ్ఱవీగునతడున్ వేంచేసి యున్నాడహో**
**బుల్లీ! పూజరిపూవుబోడి ! దయకల్వో నేను శ్రీనాథడన్!"**

"బుల్లీ! పూజారి పూవుబోడీ! నా గుండెలోనే గుళ్లను గోపురములను రచించితిని, సాకులు మానుము. మన్మథుడు విల్లువంచి విర్రవీగు చున్నాడు. నేను శ్రీనాథుడను దయకర్వో" అని అంటాడు ఇలా అనడం వల్ల మనకు "తల్లీ కన్నడ రాజ్యలక్ష్మి ! దయ లేదా! నేను శ్రీనాథుడన్" అనే పద్యం ఈ సందర్భంలో స్ఫురిస్తుంది.

ఆమె "మగనాలనురా" అని పల్కి వెళ్ళిపోతుంది. శ్రీనాథుడు సిగ్గుతో చితికిపోతాడు. ధర్మపు హద్దు హెచ్చరించింది. శ్రీనాథుడు నిగ్రహించుకుంటాడు.

పంచబాణునకు నమస్కరించి "అయ్యా! ఈమె పర దార! ఇది పాపము" అని విన్నవించుకుంటాడు. ఇలా జరగడంతో శ్రీనాథుని శృంగార కథా తంతు ముగింపు అయిందా అని సహృదయ పాఠకునకు అనిపిస్తుంది. అప్పుడే కథ ముగిస్తే అది శ్రీనాథుని కథ కాదు. జోగారావుగారి రచనా కాదు. ఇక్కడే అద్భుతమైన క్రొత్త మలుపు వుంది. ఆ మలుపు చెప్పుకోదగ్గది. అప్పుడే వినుకొండ వేశ్య ఒకతె తన వృత్తికి సంబంధించిన పని మీద వస్తుంది. ముత్యాల పల్లకి మీద అంగరంగ వైభవంతో వస్తుంది. అయినప్పటికీ హెూరు గాలి వానవల్ల ముప్పు తప్పలేదు. సుడిగాలి, జడివాన వల్ల పల్లకీ బోయలు కకావికలవుతారు. ఆమె మాత్రం గుడిలోకి వెళుతుంది.. నంబిగారి కోడలితో శ్రీనాథుడు జరిపిన సంభాషణ వింటుంది. ఆమె శ్రీనాథుని చేరి తనను తాను పరిచయం చేసుకుంటుంది.

విన్నవాడు ప్రవరుడు కాదు, శ్రీనాథుడు. కోరి వచ్చి అర్పించుకొన్న కాంతను, ధన్యను చేస్తాడు. శ్రీనాథుడనే శివునకు ఆమె తన శరీరాన్ని మనస్ఫూర్తిగా అర్పించుకుంటుంది. వారిద్దరి కలయికలో పరమశివునకు భక్తురాలు శరీరాన్ని అర్పించి మోక్షమొందినదని జోగారావుగారు వ్యంగ్యంగా చెప్తుతారు. ఇలా చెప్పడంలో ఆ శృంగారానికి ఒక పవిత్ర వైశిష్ట్యం ఏర్పడింది. వారిద్దరి కలయికలో, వారిద్దరికి జోగారావుగారు వేసిన అద్భుతమైన విశేషణాల్లో ఈ విషయం మనకు తెలుస్తుంది. అయితే ఇది శివాలయంలో జరిగిన కామ కలాపన కథ కాదు. ఆమె సామాన్య వేశ్య కాదు. ఆమె పరమ శివభక్తురాలు, కవితా కళాసురభిళమైన వ్యక్తిత్వం కలది ఆమె. శ్రీనాథుడు పరమ శివభక్తుడు. ఈశ్వరార్చన కళాశీలుడు. అందుకే "కాశీఖండం"లో "శివుడే నేను నేశివుండ ననుచున్ చింతింతు నకాంతమున్" అని శ్రీనాథుడు ప్రకటించుకున్నాడు. శివాద్వైతి శ్రీనాథుడు. ఇద్దరూ శివభక్తులే. అందుకే వేశ్య శ్రీనాథుని పొందుకై తహతహలాడుతుంది. అర్రులు చాచింది, తలచింది, వలచింది. తాను అనుకున్న పని చేసింది. శివభక్తుడైన శ్రీనాథునితో కలవడం ఆమె ఆనందానికి అవధులు లేవు. శ్రీనాథునితో ఆమె పొందిన క్షణిక సుఖం, తన జీవితానికి శాశ్వతత్వాన్ని ప్రసాదింపగలదని అభిప్రాయపడింది.

కొండవీటిలో పెదకోమటి వేమారెడ్డి చేత మదనార్చితుడైన మహేశ్వరుని వలె సన్మానించబడిన దృశ్యం గుర్తుకు తెస్తుంది. అప్పటి నుండి ఆయనపై మరులు కొనియుంటినని, ఆ కవీంద్రుని కౌగిటిలో కరిగిపోవు క్షణం కోసం ఎదురు చూస్తున్నానని చెప్తుతుంది. వరూధిని చెప్పినట్లు తన పేరు ప్రతిష్ఠలు చెప్తుతుంది.

వినుకొండ బంగారు గనులను కనుల కరిగించు కనకాంగి యా తన్వంగి. ఈ సంఘటన మన్మథ మాయకాదు. ఆ మహేశుని అనుగ్రహం అని భావించి పలుకుతుంది. దివాంధ జీవితంగా, నిశాచర వృత్తిలో గడుపు తనకు, బ్రతుకులో ఒక మధుర క్షణం ప్రసాదింపుమని ప్రార్థిస్తుంది.

శ్రీనాథుడు ప్రవరుడు కాదు. అలా అని ధర్మ విరుద్ధ వర్తనుడు కాదు. కోరివచ్చి అర్పించుకొన్న కాంతను ధన్యను చేసినాడు శ్రీనాథుడు. వారి పరిష్వంగంలో గంగాస్నానానుభవం, సౌపర్వ స్వాదు సుఖం స్ఫురిస్తాయి. "తాను శివుని కలిసిన గంగా పావన జీవననౌదు" అని అంటుంది. వారిద్దరు కలిసినప్పటి స్థితిని జోగారావుగారు అద్భుతంగా వర్ణించారు.

**"సర్వాంగీణ తదీయబంధుర పరిష్వంగంబులో నీశవా**
**సోర్వీ ధ్రోన్నత సాను నిర్గళిగంగోదాహగాహమ్ము సౌ**
**పర్వ స్వాదు సుఖాను భూతియు స్ఫురింప బోలునప్పాటనా**
**శర్వ ప్రాణుల పారవశ్యము రసజ్ఞా! నీకు నే చెప్పనా"**

శ్రీనాథుడు తన కవిత్వాన్ని, హృదయాన్ని శివపరం చేశాడు. సహజంగా శివభక్తిగల ఆ వేశ్య తన హృదయాన్ని శివ స్వరూపుడైన శ్రీనాథునికి అంకిత మిచ్చింది. శ్రీనాథకవిలో శివుని దర్శించింది వేశ్య. కవితా కళా శిఖామణి ఆమె. వేశ్యను గంగగా తలచి, ఆమెను ధన్యను చేసిన కవీశ్వరుడు శ్రీనాథుడు. కావ్యకళా రసజ్ఞ, శివ భక్తి తత్పరురాలైన వేశ్యకు, శ్రీనాథకవీశ్వరుడు మోక్షమిచ్చాడు. ఆమె మోక్షం పొంది మాయమవుతుంది.

**"సాధు రసాధిరాజ సరసాభినివేశము తద్గతంబు ఝం**
**ఝూదుర లెక్కలేక నరసాగెను. వేగినదాక కాని శ్రీ**
**నాథ శివార్పి తమ్మయిన నవ్యలతాంతము మాయమయ్యెభా**

**మాధరశీధు పాన మదమత్తుని చిత్తము తత్త ఱింపగన్"**

"శ్రీనాథ శివార్పితమయిన నవ్యలతాంతము మాయమయ్యెనట" అంటూ అద్భుతమైన ముగింపుతో కథ ముగుస్తుంది.

ఈ కావ్యంలో అద్వైత భావన బాగా ఇమిడి వుంది. ఇందులో శివభక్తి స్పష్టంగా కన్పిస్తుంది. భక్తిలో శృంగారం, శృంగారంలో భక్తి చోటు చేసుకున్నాయి.

జోగారావుగారు బహు విచిత్ర చిత్ర ప్రయోగాల్ని ఈ కావ్యంలో వాడారు. "చుక్క" శబ్దంపై విచిత్ర ప్రయోగం చేశారు రావుగారు. ఆ పురానికి వచ్చిన శ్రీనాథునకు చుక్కెదురైంది. "ఊపిరాడక యునుక్కిరి బిక్కి యౌట నీపురిన్ జుక్కలవెల్ల నక్కినవో చొక్కినవో" అనిపించుట అని అన్నారు. అదేవిధంగా "లింగ" శబ్దం మీద ప్రయోగం కూడా.

**"లింగని జూచి, లింగని చెలింగని చేతుల మోడ్చి నంబియా**
**లింగని, దాని రొమ్మున త్రిలింగ మహీభర ధూర్వహ ప్రణా**
**ళిం, గని యిచ్చమెచ్చి మనలింగనిదైవ ప్రసాదమిచ్చియా**
**లింగన మేనిముట్ట గవిలింగని గావు మటంచు వేడగన్"**

సంస్కృతాంధ్ర భాషల్లో కదు సమర్ధులు జోగారావుగారు అని చెప్పడానికి ఇలాంటి పద్యాలు ఎన్నో ఈ కావ్యంలో వున్నాయి.

> **''కావ్య వస్తువు చాటువులోని మాట. రసజగన్నాథుడైన శ్రీనాథుడు నాయకుడు. ఈ వినూత్న సృష్టిలో కవి యొక్క సాహిత్య సౌందర్యోపాసనా లబ్ధమైన దివ్య దార్శనికత్వము స్పష్టమగును. కృతి ఖండకృతి గాని కల్పనలో, భావనలో, ఛందః స్వీకరణలో, శైలిలో, అన్నిట ఒక విలక్షణత, ఒక విశిష్టత, అఖండముగ సాగినవి. ఈ కావ్యమున వారి కవితా వైమర్శిక విధానము, కావ్య ప్రయోజన దృక్పథము, కవిత్వ తత్త్వ విచారము వంటి విషయములెన్నియో చక్కగా చెప్పబడినవి. ఈ అడిగొప్పుల హోరుగాలి పరిమాణమున చిన్నదైనను ప్రమాణమున మిన్నదై, రసభాసుర భావసంపదతో, విశిష్ట పద ప్రయోగ దక్షతతో, సురుచిర సుమధుర శృంగార లావణ్య కావ్య కన్యకగా సహృదయ మనః ఫలకముల చెరగని ముద్ర వేయుచున్నది. పూర్వ కవి వాక్ప్రయోగదక్షత, ప్రతిపద సార్థకత, ఈ కావ్యమున పద పదమున గోచరమగును. ఒక విలక్షణ పదప్రయోగ నైపుణ్యము దర్శనమిచ్చును. భావ చాలనములో ఒకవైచిత్రీ సంవిధానము కన్పడును. కథ శ్రీనాథము కనుక రచనకు ప్రౌఢత్వము చేర్చి ప్రతి పంక్తిలో శ్రీనాథునే దర్శింప చేసిన కవితా ప్రజ్ఞ కాన నగును". - డాక్టర్ తటవర్తి రాజగోపబాలం**

❖ ❖ ❖ ❖ ❖

# సగం మనిషి

**గొర్రె సురేష్ బాబు,** ఫోన్ : 8125 811 671

చీలిక పీలికలై అసహ్యమోడుతున్న ఆడంబరం.
వడివడిగా అడుగులేస్తు పరుగులెత్తాలని పడిలేచె,
పదుగురితో పడలేక
అస్తిత్వాన్ని అణచుకుంటూ తడబడుతూ పొడిపొడిగా
నీ గమనాన్ని గ్రీష్మఋతువు ఆకులా రాల్చిపోతున్నావు
నడకే లేవు, పరుగులు ఇంకెక్కడ
భావి భవితవ్యం మాయా టోర్నడోలలో చెక్కి
అల్లిబిల్లి తిరిగి విసిరి వేయబడింది ఎక్కడో
గతిలేదు, స్థితిలేదు అసలు మనుగడే లేదు
మౌనం భాషగా ఎప్పుడు మారుతుంది.
విషజ్వాల మానవత్వంలా ఎప్పుడు చల్లారుతుంది
గాలి లేనేలేదు అన్నీ పెనుగాలులే, సునామీలే
భవిష్యత్తుది భరించలేని బాధల కోతలు తప్ప
ఆగిపోదు, సాగిపోగు పూర్తిగా ప్రాణం పోదు
కట్టెకూడా ఆసాంతం కాలిపోదు
ఎవరు భరించాలి పాపకర్మల ఫలాలు
బలికావల్సిందే బక్కచిక్కిన జీవచ్ఛవాలు
అర్థం కావు ఏ భావాలు దరిద్రరేఖ దిగువన
ఏవో హాహాకారాలు, ఏవేవో కేరింతలు
అర్థంకావు అనంత అలజడిలో శబ్దాలు
వర్ణాలు, స్వర్ణాలు త్యజించలేము
అంతా మిథ్యేనంటూ భోగట్టా
కాలం మందులా మారలేదు, గాయం మారలేదు
ఇంకా రేగుతూనే ఉంది, రేపుతూనే ఉంది
అలవికాని ఆశల సౌధంలో పుడమి బంధించబడి
నిరాశా, నిస్పృహలో నీరసించి స్పృహ కోల్పోతుంది
సగమే ఆకలి, సగమే నిద్ర, సగమే జీవితం
సగమే అన్నీ...
అసలు మనిషే సాటి మనిషి, సగటు మనిషి కానే కాదు
'సగం'మనిషి - సగం మనిషి

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 9 (58) హైదరాబాద్ జూలై : 2024

# 'కన్యాశుల్కం' రచనా నేపథ్యం – సరికొత్త చూపు

**ఘట్టమరాజు,** ఫోన్ : 9964082076

గురజాడ అప్పారావు మేరుకృతి 'కన్యాశుల్కం'. 1892 ఆగష్టు 13వ తేదీన విజయనగరంలో జగన్నాథ విలాసినీ సభ నాటక మండలి ద్వారా ప్రదర్శింపబడింది. ఆనందగజపతి మహారాజు అభినందనల్ని, మూట కట్టుకొంది. కాని కొంతమంది సంస్కృత విద్వాంసుల కన్నెర్రకు కూడా గురైంది. 1897లో 'కన్యాశుల్కం' తొలి ముద్రణ వేలాది పాఠకుల ప్రశంసలు పొందగలిగింది. గురజాడ ఈ సాంఘిక నాటకంలోని వస్తువు, పాత్ర చిత్రణ, సంభాషణలకు మెరుగులు దిద్ది 1909లో నాటకం స్వరూప స్వభావాల్లో మార్పులు, చేర్పులు సంతరించి వావిళ్ళ ప్రెస్సు ద్వారా రెండో ముద్రణ వెలువరించారు. గురజాడ వారి 'కన్యాశుల్కం' తెలుగు సాంఘిక నాటక చరిత్రలో ఓ వినూత్న, విలక్షణ అధ్యాయాన్నే సృష్టించింది. ఈ నాటకరాజం కొందరి పండిత రాజుల, విశ్వవిద్యాలయ ఆచార్య పుంగవుల కఠోర విమర్శలకు గురైనా, ఆ ఆటుపోట్లను తట్టుకొని సుభద్ర గిరిదుర్గంగా నిలబడగలిగింది. 'కన్యాశుల్కం'లో ప్రతిపాదింప బడ్డ సాంఘిక సమస్య కాలక్రమంలో నిర్మూలింపబడినా, ఈ విశిష్ట నాటకం మీద నేటికీ చర్చలు సాగుతున్నాయంటే, విమర్శలు వెలువడుతున్నాయంటే దీని అస్తిత్వ బలాధిక్యాన్నీ, ఆవశ్యకతనూ గమనించాల్సిందే మరి.

'కన్యాశుల్కం' వైశిష్ట్యాన్ని విశదపరుస్తూ, సహకరించే వృద్ధుల కల్యాణ రామారావు రాసిన 'నందిపిల్లి' గురజాడ 'కన్యాశుల్కం' అనే 164 పేజీల పుస్తకం హైదరాబాద్ లోని ఛాయా రిసోర్సు సెంటర్ అట్ జిమైల్ డాట్ కాం. ద్వారా ఇటీవలే డిసెంబర్ 23లో వెలువడింది.

'కన్యాశుల్కం' ఐదో అంకంలో రామప్పంతుల ఇంట్లో జరిగే పేకాట ఏడు పేజీల పాటు సాగినా కథా నిర్వహణకు ఏ విధంగానూ తోడ్పడదనీ, నాటక కర్త దాన్ని ఎందుకు రాశారో తెలియటం లేదనీ కొంతమంది విమర్శకుల అభిప్రాయం. అయితే చాలామంది విమర్శకులు అసలు ఈ పేకాట ప్రసంగం గురించి పట్టించుకొన్న పాపానే పోలేదు.

కాని 'కన్యాశుల్కం' వెలువడ్డ 120 ఏళ్లకు న్యాయవాది వృద్ధుల కల్యాణ రామారావు ఈ పేకాట తీగను కదిలించి, డొంకంతా గాలించి, ఈ ఆట కథా కమామీషు, ఈ ప్రసంగం పుట్టు పూర్వోత్తరాలు వెలికి తీశారు. గురజాడ వారి 'కన్యాశుల్కం' లోని నందిపిల్లి కథలు– గాథలు తవ్వి తలకెత్తారు కల్యాణ రామారావు. అంతేకాదు, అప్పారావు 'కన్యాశుల్కం' ఎందుకు రాశారో, ఆయన్ను ప్రేరేపించిన శక్తులేవో, సంఘటనలేవో తాత తాతల నాటి కథల్ని తవ్వి తీశారు. ఇంతవరకు ఏ సాహిత్య పరిశోధకునికీ అంతుపట్టని పేకాట ప్రసంగం ఏవిధంగా గురజాడను ఈ నాటకం రాయడానికి ప్రేరేపించిందో, వాటి అజాపజాల్ని అరటిపండు వొలిచి నోటికి అందించినట్లు ఈ 164 పేజీల్ని దొడాయించారు జ్ఞానవృద్ధుల కల్యాణరామారావు.

'కన్యాశుల్కం' ఐదో అంకంలోని పేకాటకు కేంద్రం 'నందిపల్లి' అగ్రహారం. ఇది విశాఖ పట్నానికి అరవై కిలోమీటర్ల దూరంలో వుంది. ఈ 'పెదనందిపల్లి' కాలక్రమంలో 'నందిపిల్లి' గా రూపాంతరం చెంది స్థిరపడి పోయింది. ఈ పెద నందిపల్లి అగ్రహారంలో 75 ఏళ్ల కిందట పుట్టిన గ్రంథకర్త వృద్ధుల కల్యాణరామారావు 'కన్యాశుల్కం' రెండవ ముద్రణ వావిళ్ళ ప్రతి (1909) లోనూ, నేటి దాకా ప్రచారంలో వున్న అన్ని ముద్రణల్లోనూ 'నల్లబిల్లి'గా తమ వూరి పేరు కనపడ్డం చూసి బాధపడి జిజ్ఞాస, తపనలతో పేకాట చిత్రణ, ఆ పేకాట రాయుళ్ల మనస్తత్వాన్నీ, నందిపల్లి వూరి వృత్తాంతాన్ని బయటికి తీశారు. కన్యాశుల్కం నాటకానికీ, ఈ నందిపిల్లి కీ ముడిపెట్టడం ఏమిటి? తాతాచార్లకూ, పీర్ల పండక్కీ ఏమి సంబంధం అంటారా? వృద్ధుల కల్యాణ రామారావు గురజాడను సమకాలీన సమాజం ముఖ్యంగా విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి ప్రాంతాల్లోని బ్రాహ్మణ కుటుంబాల్లో బాల్య వివాహాలు, బాల వితంతువులు అధికంగా వుండటం బెడదను చిత్రించేందుకు ప్రేరేపించిన ఘటనల్ని నందిపల్లి గురజాడ 'కన్యాశుల్కం' అనే పరిశోధనాత్మక విశ్లేషణాత్మక పుస్తకంలో వివరించారు. పేకాట ప్రసంగం గురించి ఇంత శ్రద్ధగా, లోతుగా పరిశీలించిన రచయితల్లో వృద్ధుల కల్యాణ రామారావు సర్వ ప్రథములని చెప్పొచ్చు.

గురజాడ అప్పారావు 'కన్యాశుల్కా'నికి ఇంగ్లీషులో రాసిన పీఠికలో తానెందుకు కన్యాశుల్కం వల్ల బ్రాహ్మణ కులంలో దారుణ పరిస్థితుల దాపురించాయో అన్న విషయాన్ని గణాంకాల సహితంగా సాక్ష్యాధారాలతో పాటు వివరించారు. అంటే గురజాడ 'కన్యాశుల్కం' రచనా నేపథ్యాన్ని స్పష్టంగా తెలియచేశారని మనం ఇంతవరకు విశ్వసించాం. కాని ఈ గ్రంథరచయిత తెలియజేసిన విషయాలు పాఠకులకు మరో చూపు ప్రసాదించాయని చెప్పొచ్చు.


1885లో పెళ్లి చేసుకొన్న గురజాడ వారి అత్తగారి వూరు దేవరాపల్లి, ఇది నందిపిల్లి అగ్రహారానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ రోజుల్లో ఈ వూళ్లో దాదాపు 60 బ్రాహ్మణుల ఇళ్లుండేవి. విశేషమేమంటే వాళ్లల్లో 2 ఇళ్లు వెలనాటి బ్రాహ్మణులవి కాగా మిగతాని ఆరామ, పుదూరి ద్రావిడులవి. ఆశ్చర్యకరమైన సంగతి ఏమిటంటే ఒక్క నియోగి కుటుంబం కూడా లేకపోవడం. ఆ వైదిక, ద్రావిడ బ్రాహ్మణులు పరస్పరం సంస్కృతంలోనే మాట్లాడుకొనేవాళ్లు.

చిన్న పిల్లలు, స్త్రీలు కూడా సంస్కృతంలోనే సంభాషించే వాళ్లు. ఆది శంకరాచార్యుల శిష్యుడైన మండన మిశ్రుని ఇంట్లో చిలుకలు కూడా సంస్కృతమే పలికేవట! 1886–87 ప్రాంతంలో భోగి, సంక్రాంతి పండుగ నాలుగు రోజులు జరిగేది. ఆ నాలుగు రోజుల్లోనూ పెదనందిపల్లి అగ్రహారంలోని వైదికి, ద్రావిడ బ్రాహ్మణుల ఇండ్లల్లో పేకాట భలే జోరుగా సాగేది. ఆరువేల నియోగి గురజాడ కొత్త పెళ్లి కొడుకుగా తన అత్తగారి వూరు దేవరాపల్లికి నాలుగైదు కిలో మీటర్ల దూరంలో వున్న పెదనందిపిల్లి అగ్రహారానికి వెళ్లి వస్తూ వుండేవాడు. అక్కడి వైదికీ, ద్రావిడ బ్రాహ్మణులతో ఎత్తురపు, ఎత్తడం, బేస్తులాట, కుదేలు, బేస్తులు అనబడే పేకాట ఆడి వస్తుండేవాడు పైలా పచ్చీసు అప్పారావు ఏడుగురి ఆటగాళ్ళ కంటే మించని ఈ పేకాట ఆడేటప్పుడు నందిపిల్లి బ్రాహ్మణులు సంస్కృతంలోనే మాట్లాడుకునే వాళ్ళు. అంతే కాదు, తిట్లు శాపనార్థాలు కూడా ఆ దేవభాషలోనే! గురజాడ పేకాట ప్రారంభిస్తూ తన కొచ్చిన సంస్కృతంలో **'వయం ద్యూతమేవ దైవ మితి మత్వా పూజామః'** (జూదాన్నే మనం దైవంగా భావించి పూజిద్దాం) అని అన్నారట. అప్పుడు ఆ ఆట చూస్తున్న ఓ గుంటడు **'పూజయామః'** అని క్రియా రూపాన్ని సవరించాడు గురజాడ ముఖంలో కళ తప్పింది.

పేకాట రాయుళ్ళకి తిండీ తీర్థాలు తెచ్చి పెడ్తున్న ఓ పెద్దావిడ **'ఆర్యా! భవాన్ కిం సంస్కృత మభ్యస్తవా! నాస్తివా?'** (అయ్యా! తమరు సంస్కృతం చదువుకోలేదా?) అని ప్రశ్నించింది. అప్పారావు ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేకుండా పోయింది. ఇంతలో సంస్కృతం లౌక్యులకు (నియోగులకు) ఎక్కడి నుంచి వస్తుంది లెద్దూ, ఓ శాస్త్రి ఓ విసురు విసిరాడు. అంతే! పాతికేళ్ల నియోగి అహం దెబ్బతినింది. వైదీకుల, ద్రావిడుల వల్ల లేవిడీకి గురైన గురజాడ తన మనస్సులోని బాధను మిత్రుడైన మహామహెూపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రి (1867–1944) ముందు వెళ్లబోసుకున్నాడు.

తన మనో వేదనకు అక్షర రూపం కల్పించాలని సంకల్పించా డాయన. కాలం కలిసి రావాలిగా? విజయనగర ప్రభువు ఆనంద గజపతి రాజుగారికి తన సంస్థాన ప్రాంతంలో జరుగుతున్న బాల్య వివాహాల గురించి, వితంతువుల దుస్థితి గురించి చాలా భోగట్టా లభిస్తుంది. గురజాడ ఈ బాల్య వివాహాలు వైదీకుల, ద్రావిడుల ఇళ్లలోనే ఎక్కువగా జరుగుతుంటాయనీ, వాళ్లు ముక్కు పచ్చలారని ముద్దు బిడ్డల్ని పెద్దపెద్ద మొత్తాలకు మూడుకాళ్ల ముసలివాళ్లకు అమ్మేస్తుంటారన్న సంగతి బాగా తెలిసినందువల్ల, ఆ సమస్య గురించి ఓ మాంచి నాటకం రాసి, దివాణంలో గౌరవ మర్యాదలు పొందుతున్న వైదీకుల, ద్రావిడులపై తన ప్రతీకార వాంఛ కూడా తీర్చుకోవాలని నిర్ణయించుకొన్నాడు. చక్కని ప్రణాళిక వేసుకొని, సమకాలీన వైదీక, ద్రావిడ బ్రాహ్మణుల ఇళ్లల్లో జరిగే బాల్య వివాహాల వెనుక దాగివున్న ముగ్ధ బాలికల తండ్రుల స్వార్థాన్ని, దురాశను

(ఛాయారిసోర్స్ సెంటర్, 103 హరితా అపార్ట్‌మెంట్స్–3, మధురానగర్, హైదరాబాద్ 500038, నందిపిల్లి గురజాడ కన్యాశుల్కం, రచయిత : వృద్ధుల కళ్యాణరామారావు, పేజీలు 164, వెల, 150, ఫోన్ : 9100671089)




కళాత్మకంగా 'కన్యాశుల్కం' నాటకంగా మలిచాడు గురజాడ.

'కన్యాశుల్కం' నాటకంలో చిత్రింపబడ్డ అగ్రహారాలు నందిపిల్లి, కృష్ణరాయపురం, రామచంద్రాపురం, అగ్నిహెూత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, కరటకశాస్త్రి, రామప్పంతులు, కీలకపాత్ర వహించిన గిరీశం వీళ్లందరూ వైదీక ద్రావిడ బ్రాహ్మణులే, పైన చెప్పబడ్డ అగ్రహారాలన్నీ వీళ్ల చరిత్ర, సంస్కృతుల్ని చాటే కేంద్రాలే. గురజాడ ఆ పాత్రల సంభాషణల్ని కళింగాంధ్ర బ్రాహ్మణుల వాడుక భాషలోనే చాలా సమర్థవంతంగా రాశాడు. 'కన్యాశుల్కం' నాటకం 1897లో అచ్చయి ఈ అగ్రహారీకుల్లో గొప్ప కలకలం రేపింది. వైదీకులూ, ద్రావిడులు కళ్లల్లోంచి నిప్పులు రాస్తూ, నియోగి గురజాడ అప్పారావుపై తిట్ల దండకమే వల్లించారు. కీలకపాత్ర గిరీశం కూడా పాఠకులకు సులభంగా అర్థంకాని వైదీకే. రామప్పంతులు నియోగులు ముసుగులో దాగున్న వైదీకే. సాత్వికుడు, మంచి మనిషి ఎవరంటే నియోగి ఐన సౌజన్యరావు పంతులు మాత్రమే. గురజాడ నియోగి చాతుర్యం 'కన్యాశుల్కం' నాటకం రాయడం ద్వారా నందిపల్లి అగ్రహారంలో తనకు వైదికులు, ద్రావిడులు చేసిన అవమానానికి పగ తీర్చుకొన్నాడు. ఆనంద గజపతి రాజుగారిని తన రచనా ప్రతిభతో మెప్పించి, అప్పటికే మహారాజా కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ, అచిర కాలంలోనే దివాణంలో శాసన శాస్త్రజ్ఞుడిగా, ఆంతరంగిక సలహాదారుగా ఎదిగి పొయ్యాడు. మహారాజుగారి మరణం (1897 మే 23) తర్వాత పెత్తనం చలాయించిన అప్పల కొండయాంబ ఆప్త కార్యదర్శి పదవి అలంకరించాడు. దివాణంలో అధికారం చలాయిస్తున్న వైదీక, ద్రావిడ, శ్రీవైష్ణవులంతా గురజాడ ముందు తలవంచుకొని వర్తించసాగారు.

'నందిపల్లి గురజాడ కన్యాశుల్కం' గ్రంథకర్త వృద్ధుల కల్యాణ రామారావు 16 ఏళ్ళ వయస్సులో 'కన్యాశుల్కం' చదివి మాతామహుడైన పేరి సుబ్బరాయశాస్త్రి తిట్లవర్షంలో తడిసి పొయ్యాడు. **"వాడు మన శత్రువు. వైదీకులకు శత్రువు. ద్రావిళ్ళకు**

**బద్ధ శత్రువు నందిపిల్లికి ప్రత్యేకంగా శత్రువు"** (పేజి: 21) 'కన్యాశుల్కం' నాటకం చదివిన పాపానికి నూనూగు మీసాల నూత్న యువకుడు వృద్ధుల కల్యాణ రామారావు తాతయ్య చేత చివాట్లు తిన్నాడు, పాపం! ఈ పేకాట తతంగాన్ని, దాని పరిణామాల్ని గ్రంథకర్త ఇలా వివరించారు "నందిపిల్లిలో సంఘటనలు జరిగిన ఒకరికి ఆ సంఘటనలు గురించి చెప్పేరుట. కన్యాశుల్కం పుస్తకం 1897 ప్రచురణ అయిన తరువాత ఆ పుస్తకం వైదిక, ద్రావిడ బ్రాహ్మణుల్లో ఆనాడు కలకలం రేపిందట, మళ్లీ రెండో కూర్పు (1909) ప్రాచుర్యంలోకి వచ్చిన తరువాత, వైదిక, ద్రావిడ బ్రాహ్మణులు గురజాడను ఒక శత్రువులా చూసేవారట. అప్పుడు విజయనగరంలో గురజాడ నోటినుండి నందిపల్లిలో జరిగిన సంఘటనల గురించి స్వయంగా విన్న అతడు, నందిపిల్లికి చెందిన తన మేనల్లుడుకి తను ఏవం విన్నదీ, పూస గుచ్చినట్టు చెప్పేడుట. అప్పుడు ఆమేనల్లుడు నందిపల్లిలో అందరికీ ఆ విషయం టాంటాం కొట్టాడు. ఆ నందిపల్లిలో జరిగిన సంఘటనలే 'కన్యాశుల్కం' నాటకం పుట్టుకకు మూలకారణం అని తీర్మానించేరుట. తరువాత కొంత కాలానికి మాతామహులు కూడా గురజాడ ఎవరికైతే చెప్పేరో ఆయన్నే అడిగి మళ్లీ విషయం ధ్రువపరుచుకున్నారట." (పేజీ: 21-22) గ్రంథకర్త వృద్ధుల కల్యాణరామారావు పి.యు.సి. విద్యార్థిగా 1965లో తన తాతగారి నోట విన్న ఈ వృత్తాంతం ఆయన్ను నందిపిల్లి తీగను కదిలించి, డొంకంతా గాలించేలా చేసింది. గ్రంథకర్త తన స్వగ్రామమైన నందిపిల్లి అగ్రహారాన్ని హేళన చేసిన గురజాడను తన పూర్వీకుల్లా నిందించకుండా ఆయన 'కన్యాశుల్కం' నాటక వైశిష్ట్యాన్ని మనసారా ప్రశంసించి, సహృదయ పాఠకునిగా సునిశిత విమర్శకుడిగా నిలబడ్డాడు. వృద్ధుల ఏమన్నాడంటే **"గిరీశం, వెంకటేశం, బంట్రోతు, అగ్ని హోత్రావధాన్లు కరటక శాస్త్రి, లుబ్ధావధాన్లు, బుచ్చమ్మ, మీనాక్షి, బైరాగి, శూద్రులు, హెడ్ కానిస్టేబుల్, మధురవాణి అందరూ మనం చూసినవాళ్ళే, చూస్తున్నవాళ్ళే."**

సాయంకాలం భూమార్గం పట్టిన సాహిత్యరథం రాత్రికల్లా భూమ్మీద నిలదొక్కుకుంది. ఇక మీద కావ్యకథా వస్తువు దేవుళ్ళకో, దేవతలకో, యక్ష, కిన్నర, కింపురుష, విద్యాధర, సిద్ధ, నాగులకో చెందినది కానక్కరలేదు. 'మన'కి చెందినది కావచ్చు. ఇక మీద మనం 'దేవ' భాషలోనో, భూ 'సురు'ల భాషలోనో కాకుండా మామూలు మనుషులు మాట్లాడే భాషలో సాహిత్యాన్ని సృష్టించొచ్చు.

**"ఇంతవరకూ కవి కరీంద్రులను దారిలోకి తెచ్చే మావటీడు లేదు. ఇప్పుడు గురజాడ వచ్చేడు. నాటకం చివరికి గిరీశానికి వ్యవహారం అడ్డంగా తిరిగింది. అంతవరకూ అడ్డంగా తిగిగున్న తెలుగు సాహిత్యం నిటారుగా నిలబడింది."** (పేజి: 71-72)

గ్రంథకర్త ఆధునిక తెలుగు నాటక సాహిత్య చరిత్రలో గురజాడ అప్పారావు అసమాన ప్రతిభను గుర్తించి ఆయన నిలువెత్తు మూర్తిని సహృదయ పాఠకుల మనోమందిరాల్లో ప్రతిష్ఠించాడు. ఆకుచాటు మొగ్గలా ఇంత కాలం దాగున్న వృద్ధుల కల్యాణ రామారావు తటాలున తెలుగు సాహిత్య క్షేత్రంలో సాక్షాత్కరించడం ఆనందదాయకమైన ఆశ్చర్యమే. ఆయన సందర్భానుసారంగా వ్యక్తీకరించిన కొన్ని అభిప్రాయాలు మరీ మరీ ఆలోచించి, చర్చించదగినవే. మచ్చుకి కొన్ని:

1. రెండవ కూర్పు ప్రదర్శన యోగ్యం కాకుండా పోయింది. నాటకం వేసేవాళ్ళు ఎవరికి నచ్చిన కత్తిరింపులు వాళ్ళు చేసుకోవడం మొదలెట్టేరు. మొదటి కూర్పు నాటకం మొత్తం మూడు గంటల్లో వెయ్యొచ్చు. ఒక విధంగా చెప్పాలంటే రెండవ కూర్పు అప్పారావు గారి బలం, బలహీనతా కూడా మనకు చెపుతోంది." (పేజీ: 82)

2. "నందాపురం పట్టి ద్రావిడ అగ్రహారాలవాళ్ళూ, ఒక గొప్ప నాటకం పుట్టడానికి పరోక్షంగానైనా కారణం అయినందుకు గర్వపడాలి." (పేజి: 114)

3. ''మూడు ముక్కల్లో చెప్పాలంటే గిరీశంలో మనకి ఆకర్షణీయంగా కనిపించే భాగం గురజాడవారు. మనం గిరీశంలో నచ్చుకోని విషయాలు తీసేస్తే మిగిలిన భాగం గురజాడ వారు. గిరీశం మన అందరి ఆల్టర్ ఇగో" (పేజీ 125).


వృద్ధుల కల్యాణ రామారావు 'నందిపల్లి గురజాడ కన్యాశుల్కం' గ్రంథం ఆద్యంతం రసరమ్య గీతంలా పాఠకుల్ని ఆకట్టుకొంటుంది. 'కన్యాశుల్కం' నాటక రచనా నేపథ్యం గురించి సరికొత్త చూపు ప్రసాదించిన రచయిత అభినందనకు అన్ని విధాలా అర్హుడే.

❖ ❖ ❖ ❖ ❖

# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.





**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**


**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**


## స్వ'కృతి'





**ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం**
ధూళిపాళ అరుణ
వెల : 200/-
**ప్రతులకు :** ధూళిపాళ దత్తాత్రేయ శర్మ, హరిహర త్రిశక్తి క్షేత్రం, వలిగొండ,
యాదాద్రి జిల్లా - 508112
ఫోన్: 871 234 2323





**రేపటి మైదానం (కవిత్వం)**
డా. ఎన్. గోపి
వెల : 150/-
**ప్రతులకు :** ఎన్. అరుణ, ఇం.నెం. 13-1/బి,
శ్రీనివాస పురం, రామంతాపురం,
హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 939 102 8496





**ప్రకృతి పరిమళం (మణిపూసల కావ్యం)**
దోరవేటి
వెల : 80/-
**ప్రతులకు :** నీల్ కమల్ బుక్ లింక్స్,
నారాయణ నాయక్ కాంప్లెక్స్, గాంధి జ్ఞాన మందిర్ ప్రక్కన, కోటి, హైదరాబాద్ - 1.
ఫోన్ : 912 100 1238




**శాసన పర్వం**
(తెలంగాణ శతశాసనాల పరిచయం)
డా. భిన్నూరి మనోహరి
వెల : 300/-
మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె/ ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 934 797 1133




**ఇమానం (విస్తృత దళిత చైతన్యం)**
డా. సంగిశెట్టి శ్రీనివాస్.
వెల : 200/-
**ప్రతులకు :** డా. సంగిశెట్టి శ్రీనివాస్, ఫ్లాట్ నెం. 212, నందనవనం అపార్ట్‌మెంట్,
అత్తాపూర్, హైదరాబాద్ - 500 048.
ఫోన్ : 98492 20321




**జమిడిక (కవిత్వం)**
కందుకూరి అంజయ్య
వెల : 120/-
**ప్రతులకు :** కందుకూరి సుహాసిని, 10-4-311,
సుభాష్‌నగర్, రోడ్ నెం.8,
కరీంనగర్ - 505101
ఫోన్ : 9490 222201

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

## మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్: 934 7971177

# గుడ్డ పేలికలు

**జానీ తక్కెడశిల,**
సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత,
ఫోన్ : 725 951 1956

తీగలు తీగలుగా కన్నుల్లో నిద్ర ఊగుతున్నప్పుడు
ఎవరో సన్నగా అడుగుతారు కదూ
నీకేం కావాలని?
స్వరం ఎవరిదో తెలుసుకోవాలని అనిపించదు
కళ్లు మాత్రం గ్రహాల్లా తిరుగుతాయి
జీవితం కావాలని కోరుకుంటాను
తెల్లని కాగితంపై అక్షర పాలపుంతలను తీర్చి
దిద్దాలనుకుంటాను
మొన్న పోగొట్టుకున్న మనిషిని,
మనిషి లాంటి జాబిల్లిని
హృదయ సముద్రంలో కలుపుకుంటాను.

తూర్పు మొక్కలో కిరణాల పువ్వై వెలుగుతుంటే
రక్తపు కొండలు పగిలిపోయాయి
నా జీవితాన్ని నాకు కాకుండా చేసి
చేపముల్లులను గొంతులో గుచ్చి
వెక్కిళ్లను పేజీలుగా తిప్పుతున్నది ఎవరు?

'మీ ముఖంలో కళే లేదు'
నా జీవితం నాకివ్వండి
'నీ ముఖమేంటి కాలిపోయిన గుడ్డపేలికలా ఉంది'
నా జీవితాన్ని నాకివ్వండి
పారబోసుకున్నాను
కాదు కాదు నా నుండి కాజేసుకున్న
హృదయతంత్రిని, కాంతిపుంజాన్ని,
వెలుగురేఖను, నక్షత్రమాలను,
ఆకాశాన్ని, భూమిని నాకివ్వండి.

నా జీవితం ఎక్కడుందో తెలుసు
ఎలా వెళ్లాలో తెలుసు
ఎప్పుడు చేరుకోవాలో తెలుసు కానీ
ఈ చీకటి రాళ్ల నుండి
తప్పించుకొని కిరణించాలి
రేగికంప పైనో, చీకికంప పైనో,
తుమ్మకంప పైనో పడిన జీవితాన్ని





జాగ్రత్తగా బ్లాక్ హోల్స్ లోకి
పడిపోకుండా చూసుకోవాలి.
అదేంటి! రెండు కన్నులు
నా దోసిళ్ళలో వెలుగుతున్నాయి
బహుశః
జీవితం తాలూకు ప్రతిబింబాలు అనుకుంటాను.

ఏదీ ఎక్కడికీ పోదు
పోయే అవకాశమే లేదు
విరామం, అంతిమం కాదు
వాక్యాల్లో లేదా భవిష్యత్తు బ్రతుకులో
జీవితం లాంటి దీపం వెలుగుతుంది.
వెలగడానికి నిచ్చెనే, పద్యం.

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**IUI | IVF | ICSI | IMSI | HSG**



**ఫర్టీ 9** హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్